ఆంధ్ర సచిత్ర వారపత్రిక

25-8-78
75 పైసలు



మరో అయిదు నిమిషాలలో

మీ జీవితమే ఉన్నతంగా మారుతుంది

(ఈ ప్రకటన పూర్తిగా చదవడానికి మీరు ఓ అయిదు నిముషాలు వెచ్చించితే....)



రేపు అసాధారణమైన మాసపత్రిక!

ఈ పత్రిక ఉజ్వల భవిష్యత్తుకు త్రోవచూపుతూ మిమ్మల్ని ఉన్నతంగా తీర్చి దిద్దుతుంది. ఆంతరంగిక మిత్రునిలా అనుక్షణం సాయపడుతుంది. మిమ్మల్ని మీరు, ఇతరులను అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. జీవితంలో ప్రతి ఘట్టంలోను తెలుసుకోవలసిన విషయాలను, మరెక్కడా లభ్యంకాని వివరాలను తెలుపుతుంది. మీరు ఎదుర్కొనే క్లిష్టమైన సమస్యలను తేలిగ్గా పరిష్కరిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే జీవన మాధుర్యాన్ని చిలకరిస్తుంది.

ఒక పత్రికకు ఇంతటి అద్భుతమైన శక్తి వుంటుందని మీరు విశ్వసించగల్గితే కేవలం "రేపు" పత్రికకు మాత్రమే ఆ ఘనత దక్కుతుందని మీరు అంగీకరించితీరాలి!

లక్షలాది మంది 'రేపు' పాఠకులలో ఏ ఒక్కరిని అడిగినా మీకు ఈ విషయాన్ని ధృవపరుస్తారు.

• ఈ పత్రికకు చందాదారులుగా చేరడమంటే మీ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవడమే!

ఇదొక అద్భుతమైన అవకాశం!



రేపు మాసపత్రిక 1977 ఏప్రిల్‌లో ప్రారంభించబడింది. ఈ పత్రిక వెలువడినప్పటి నుండి దీనిని అత్యద్భుతమైన మాసపత్రికగా పాఠకులు పరిగణించి కనీ వినీ ఎరుగని విశేష ఆదరణ కనపరిచారు. ఈ పత్రిక ప్రచురణ ప్రారంభించి అత్యంత విజయవంతంగా ఒక సంవత్సరం ముగిసిన సందర్భంలో మేమొక పోటీ నిర్వహించాము.

ఈ పత్రిక మీ జీవితాల నెలా ప్రభావితం చేసిందో తెలుపమని పాఠకులను కోరాము. వందలాదిమంది పాఠకులు ఈ పోటీలో పాల్గొన్నారు. సంవత్సరాల పర్యంతం ఎంతగా ప్రయత్నించినా సాధించలేని మార్పును ఒక్క సంవత్సరంపాటు ఈ పత్రికను చదవడం వలన పొందగలిగామని వారు పేర్కొన్నారు





ఈ పత్రికను చదవటం వలన వారి జీవితాల అనుభవాన్ని గడించామని తమ ఆలోచనా ధోరణే మారిపోయిందని ఎందరో యువతీయువకులు పేర్కొన్నారు.



ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావడానికి తమ సమస్యలను తొలగించుకొని ఏకాగ్రత నలవర్చుకోవడాన్కి దోహదం చేసిందని విద్యార్థులు తెలిపారు

ఎంతోమంది మహిళలు తమ తమ జీవితాల్లో గూడుకట్టుకు ఉన్న విచారాన్ని చికాకును, ఆందోళనను విరాళా నిస్పృహలను పైతొలగింపుకొని ప్రశాంతతను అలవర్చుకో గలిగామన్నారు. దాంపత్య జీవనం మధురాతి మధురంగా కొనసాగడానికిది దోహదం చేసిందని వందలాదిమంది దంపతులు పేర్కొన్నారు. పిల్లల నెలా పెంచాలో నేర్చుకున్నామని గృహిణులు కృతజ్ఞతలు తెలిపారు.





తమ బిడియాన్ని సంశయాల్ని దూరంచేసి జీవితంలో ఏదైనా సాధించగల విశ్వాసాన్ని కలిగించిందని నూతనోత్తేజాన్ని రగిలించిందని. ఈ పత్రిక వలన తమ జీవితమే పూర్తిగా మారిపోయిందని అందరూ ముక్తకంఠంతో పేర్కొన్నారు



చిన్నతనం నుండీ తమలో జీర్ణించుకు పోయిన లైంగిక భయాలను దూరంచేసి నూతన జీవితాన్ని ప్రసాదించిందని వేలాదిమంది ఇప్పటికీ తెలియ చేస్తున్నారు.


ఇంతటి మహత్తర ప్రయోజనాన్ని
మీరుకూడా పొందగోరితే
ఇప్పుడే, ఈ క్షణంలోనే...

రేపు

మాసపత్రికకు
చందాదారులుగా
చేరండి!

మీ సౌలభ్యంకోసం మేము ఒక ప్రత్యేక సదుపాయాన్ని కల్పిస్తున్నాము

పూర్తి వివరాలకై
ఎదుటి అట్ట వెనుక పేజీ
చూడండి.



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938-1972]

శుక్రవారం : 25-8-'78
కాళయుక్తినామ సం శ్రావణ బ సప్తమి
సంపుటము 71 సంచిక 49

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

*

పోస్ట్‌లో ఏడాది చందా రు 41-60
ఆరు మాసాల చందా రు 20-80
విడిప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

అట్టమీది బొమ్మ :
కై విజయ
(ఫోటో : జే పి)

కథలు :
కుక్క కన్నీళ్ళు .. 6
కొత్త వెలుగు .. 32

సీరియల్ కథలు :
రాగద్వేషాలు 12
మోహనరూప 19


వ్యాసాలు, శీర్షికలు
లోకంపోకడ - 4 సైకాలజీ - 8, కార్టూన్ - 11 ధర్మపథం - 18 మీకు తెలుసా? - 23 జి వి జి పేజి - 24, హైదరాబాద్ సినిమా - 30 డాక్టర్ సలహాలు-34, ప్రశ్నావళి-36, హైదరాబాద్ నోట్‌బుక్-38, సైన్సులో ఎరదాలు-39 ఈనాటి వనితాలోకం - 40, ఫాలాక్షుని డైరీ-42, వారఫలం-46 ఉత్తరాలు-48

ప్రకృతి రహస్యం కనుగొనబడింది!



ఇది సహజంగా, మృదువుగా
మీ వంటి ఛాయను పెంపొందిస్తుంది

చర్మానికి నలుపుదనం ఎలా సంక్రమిస్తుంది



మీ చర్మం లోపల మెలానిన్ అనే ఒక పదార్థముంది ఇది ఎంత హెచ్చుగా ఉంటే మనుషులు అంత నల్లగా ఉంటారు మీరు ఎండలోకి వెళ్ళినప్పుడల్లా అల్ట్రావయొలెట్ కిరణాలు మీ చర్మంలో ప్రవేశించి మెలానిన్‌ను మరింత పెంచుతాయి

వంటి ఛాయను పెంచడానికి పురాతన పద్ధతి ఏదైనా ఉందా?

వందలాది సంవత్సరాలుగా అతివారు— సెనగపిండి, పాల మీగడ నిమ్మరసం, గ్లిసరిన్, ఇంకా ఏవేవో ఉపయోగిస్తూ వస్తున్నారు వీటి మూలంగా చర్మం మెత్తబడి కాస్త మెరవచ్చు అంతేగాని చర్మాన్ని నిజంగా ఎర్రగా చేయలేవు మరొక తెగకు చెందినవి బ్లీచింగ్ పదార్థాలు ఇవి ఎంత హానికరమైనవో వేరే చెప్పనక్కర్లేదు అపురూపమైన మీ పట్టుబట్టల్ని మీరు బ్లీచ్ చేస్తారా? మీ చర్మం కూడా పట్టువలె నాజూకు అయినది పట్టుకంటె అపురూపమైనది



విజ్ఞాన విజయం!

ఫెయిర్ అండ్ లవ్లీ సహజంగా మృదువుగా తన పని చేస్తుంది

ఫెయిర్ అండ్ లవ్లీలో గల ఒక విటమిను దానిని మీరు రాసుకొన్నపుడు మీ చర్మంలో ప్రవేశించి సహజంగా మృదువుగా సురక్షితంగా, మెలానిన్ వ్యాప్తిని వెనక్కు నెడుతుంది దంతో మీ చర్మం చక్కగుండగానే ఎర్రపడుతుంది అంతేకాక, ఫెయిర్ అండ్ లవ్లీ మీ చర్మాన్ని ఎండ నుంచి కూడా సంరక్షిస్తుంది దీనిలోని ఒక పదార్థం ఎండలోని అల్ట్రావయొలెట్ కిరణాలను వడబోసి వాటి మూలంగా మీ చర్మం మరింత నల్లబడకుండా ఆపుతుంది


6 వారాలకు మీకే తేడా కనపడుతుంది!

ఫెయిర్ అండ్ లవ్లీని ఆరు వారాల పాటు నియమంగా వాడితే మీతో పాటు ఇతర్లు కూడా మీ వంటి ఛాయలో మార్పును గుర్తిస్తారు

ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమ్ నల్ల చర్మాన్ని ఎర్రబరచడంతో పాటు ఇంకా చేస్తుంది

ఫెయిర్ అండ్ లవ్లీ మీ చర్మానికి కోమలత్వాన్ని సువాసనను చేకూరుస్తుంది రోజుకు కనీసం ఒకసారి వాడండి రెండుసార్లు వాడితే మరీ మంచిది నియమంగా వాడితే మీ వంటి ఛాయ పెంపొందుతుంది అలాగే ఉంటుంది, సహజంగా మృదువుగా ఎరుపెక్కుతుంది

ఫెయిర్ అండ్ లవ్లీ —నల్లని చర్మాన్ని ఎర్రబరచడం కోసం సునిశ్చితమైన తీరు





ఫెయిర్ అండ్ లవ్లీ నల్లని చర్మాన్ని ఎర్ర బరచడం కోసం సునిశ్చితమైన తీరు

లింటాస్-FALOV 8 2315 TL



ఏకాకి కన్నీళ్ళు

పోలాప్రగడ రాజ్యలక్ష్మి

ప్రకృతి మాత ఒడిలో హాయిగా ఉయ్యాల లూగుతున్నట్లు చిరుగాలికి మెల్లగా తలలూపుతున్న చెట్లకి ఏం వచ్చిందో ఉన్నట్లుండి వీరంగం మొదలు పెట్టాయి. పిల్లలకోసం తల్లి రాల్చే కన్నీటి బొట్లులాగ ఆకాశం పొద్దుటి నుంచీ ఏడుస్తూనే ఉంది అమ్మ మాటని చెవిని బెట్టని అల్లరి పిల్లల్లాగ "ఆ! ఈ గాలీ వానా ఎప్పుడూ ఉండేదేలే!" అని నిర్లక్ష్యంగా చప్పరించి పనిపాటలకి పోయేవాళ్ళందరూ, ఎవరి ఇళ్ళూ ఎవరి గుడిసెలూ వాళ్ళు వదిలి, పనుల్లోకి పోయారు.

సరమ్మ సంతానం కూడా కరిష్యా అదే పని చేసింది. అయితే వెళ్ళేటప్పుడు మాత్రం ఇద్దరు కొడుకులూ, కోడళ్ళూ కూతురూ అల్లుడూ ఆరుగురూ ఓ అరుపు అరిచారు "ఇదిగో— ఓ ముసలమ్మోయ్— ఇయాల సంతకి ఎల్లామాక. ఈ గాలివానకి ఎక్కడేనా పడి సత్తావు ఈ పూటకి గంజి మేం ఎవరేనా పోస్తాంకాని కాస్త పిల్లలని సూసుకుంటూ పాకలకాడేఉండు" అంటూ. సరమ్మ సణుక్కుంది "గాలివానట గాలివాన. ఆల్లంతా ఎల్లొచ్చుగాని ఈ ముసిలిదాని పేణానికే బయం కాబోలు. నాకు పోసే గుక్కెడు గంజి కోసమే తన్నుకుని, సివరికి కరియేపాకూ కొత్తిమిరీ అమ్ముకుని నీ బతుకు నువ్వు బతుకు అని వొగ్గేసిన ఈ బిడ్డలు, ఇయ్యాల నాకు గంజి పోస్తారట. గంజి" విరక్తిగా నవ్వుకుని బోసి నోటినే ఓ మారు చప్పరించుకొంది.

సరమ్మ నవ్వినంతసేపు పట్టలేదు 'ఓలమ్మో ఈ గాలేంటి, ఈ వానేంటి? నా బిడ్డలందరూ గూటికి జేరేనా? ఆళ్ళొచ్చేదాకా ఈ పసికూనల్ని సూడగలనా!' అంటూ తనని కరుచుకొని దిక్కుమొహాలో ఏడుస్తూన్న మనుమల చుట్టూ చేతులేసి, భయంతో వణుకుతూ దిగాలుపడి కుంగిపోడానికి.

గాలి కెగిరిపోతూన్న జుట్టునీ చీరెనీ, గుప్పిళ్లలో అదిమి పట్టుకుని, పడుతూ లేస్తూ వచ్చిన రెండో కోడలు ముత్యాలిని చూసేసరికి ముసిలిదాని ప్రాణం కొంచెం కుదుటబడింది "ఏవే పని వొగ్గేసి వచ్చేశావా? మంచిపని చేశావు. ఆళ్ళు కూడా వొచ్చేస్తే బావుణ్ను. అదిగో నీ పంటాడు ఉయ్యాల్లో గుక్కెట్టి ఏడిసేస్తున్నాడు. అడ్డాల్లో కూసోపెట్టుకుని కాసిని పాలియ్యి" అంది. పాకలో తాటి దూలానికి వేలాడేసిన గుడ్డ ఉయ్యాల్లో గుక్కపట్టి ఏడుస్తూన్న పసివాణ్ణి తెళ్ళి గుండెలకి అదుముకుంది ముత్యాలు. పాలు తాగి వాడు నిద్రపోయాక మళ్ళీ ఉయ్యాల్లో పడుకోబెట్టింది.

ఇంతలో సరమ్మ పెద్దకొడుకు కోటయ్య రెండోవాడు సత్తెయ్య, అల్లుడు సింహాద్రి, పిచ్చి తెగింపుతో తలలు వంచి ఎదురుగాలిలో బలంగా పెడల్స్‌ని అదిమి తొక్కుతూ సైకిళ్ళని అతి బలవంతం మీద తోసుకుని

పాకలు చేరుకున్నారు. "ఓరి నాయనో ... ఓరి నాబో" అనుకుంటూ సీతమ్మ, మాలచ్మి, వచ్చి తమ తమ పిల్లల్ని సరమ్మ దగ్గర్నుంచి తీసుకుని దగ్గరగా హత్తుకున్నారు.

"ఎవరి గుడిశల్లోకి వాళ్ళు పొండి — తడిసిపోతున్నా "

"వొద్దు — ఈ గాలికి గుడిశలు ఆగేలాగ లేవు"

ఇష్... ష్... ఓ.. ఓ ..ఫెళ . ఫెళా... ధన్...

"అమ్మో... ఓరినాయనో ... లచ్మి ... అన్నయ్యా...దేవుడో . ఇటు రాకండి ... కొమ్మ ఇరిగి పడిపోతోంది..."

ఇలా కేకలతో అరుపులతో చప్పుళ్ళతో ఒక్కమారు వాతావరణం అంతా ప్రళయ భయంకరంగా మారిపోయింది.

కుండపోతగా వాన కురుస్తూనే ఉంది. మధ్య మధ్య నల్లని ఆకాశాన్ని చీల్చుకుని మిరుమిట్లు గొలిపే తెల్లని త్రాచులా మెరుపు ఒకటి మెరిసి మాయం అవుతోంది. వెంటనే గుండె లవిసేలా భయంకరమైన ఉరుము! అన్ని వేపుల నుంచీ వేళతో సహా కూలి పోతూన్న చెట్ల చప్పుళ్ళు. పాకలమీద ఆకు లెగిరిపోతున్నాయి. గాలివేగం నిముష నిముషానికీ హెచ్చిపోతోంది. సిమెంటు రేకులూ, ఇనుప రేకులూ ఎక్కడ నుంచో వచ్చి పాకల దగ్గర పడుతున్నాయి. పాకల దగ్గరున్న వేప చెట్టుతో సహా అన్ని చెట్లూ తలలు విరబోసుకుని ఊగిపోతూ ఏ క్షణాన్నైనా కూలిపోతాయి అన్నట్లున్నాయి.

రకరకాలైన ఆ ధ్వనులకి హడలిపోయి, మీద ధారగా కురుస్తూన్న వాన నీళ్ళకి వణికిపోయి, ఉయ్యాలలో ఉన్న బిడ్డ కెవ్వున అరిచాడు. తడి బట్టలతో గడగడ లాడుతూ ఓ మూల ఒదిగి నుంచున్న ముత్యాలు, ఒక్క ఉదుటున వెళ్ళి ఉయ్యాలలో బాబుగా బిడ్డని గుండెలకి అదుము కుంది.

"ఆకులన్నీ ఎగిరిపోయి, పాక విలువ నీడ లేకుండా అయిపోయింది. వేప చెట్టు కూడా ఊగిపోతోంది. ఏ క్షణాన్నైనా కూలి పోవచ్చు. ఇక్కడ ఉంటే ప్రమాదం. ఎక్కడికేనా వెళ్ళి తలదాచుకోడం మంచిది." ఇలా అనుకుని సత్తెయ్య, వంగిపోయిన పాక నిట్రాడుని తప్పించుకుని పాక యివతలికి వచ్చాడు. చుట్టూ దట్టంగా వర్షపుధారలు! నీటి తెర! అడుగు అవతల ఏం ఉందో కన్పించడం లేదు. మొహం మీద నుంచి జారుతూన్న నీటిని తుడుచుకుని అటూ ఇటూ చూశాడు పక్క పాకల్లోంచి ఏవో నీడలు కదులుతున్నట్లు కనిపించింది. అన్నయ్యా — బావయ్యా కాబోలు! ఆడోళ్ళనీ పిల్లల్నీ తీసుకుని పాక వొదిలి పడుతూ లేస్తూ ఎక్కడికో బయలుదేరారు. "వొరేయ్! నేనూ వొస్తన్నా" అని సత్తెయ్య అరిచిన అరుపు, ఫెళ ఫెళా విరిగి పోతూన్న వేపచెట్టుకొమ్మ చప్పుడులో అతని చెవులకి అతనికే వినిపించలేదు


"హమ్మో... అమ్మపాకమీద కొమ్మ విరిగి పడిపోయింది," అంటూ అటుకేసి ఒక్క ఉరుకు ఉరికాడు సత్తెయ్య. పడిపోయిన కొమ్మతాలూకు రెమ్మలూ ఆకులూ, కూలి పోయిన పాక వాసాలు గెడలూ ఆకులూ, ఒక్కొక్కటే తప్పించుకుంటూ దారి చేసుకుంటూ సరమ్మకోసం వెతకసాగాడు. కాళ్ళూ చేతులూ నీరసంతో పీకేస్తున్నాయి. కొమ్మలూ గెడలూ గీసుకుపోతున్నాయి. ఒక్కొక్క గాలి విసురుకి వచ్చిన వానధారలు ఛెళ్ళున చెంపలకి తగులుతూంటే, తూలి పక్కకి ఒరిగి పోతున్నాడు సత్తెయ్య. ఆయాసంతో నోరు ఎండిపోయి, నాలుక పిడచగట్టుకుపోతోంది. తల్లి ఏమైందా అనే ఆదుర్దా. గుండెల్లో కొండంతభయం.

ఆకాశంలో ఒక్క మెరుపుమెరిసింది. క్షణం సేపు అంతా వెలుగు పరుచు కున్నట్లయింది. ఆ వెలుగులో కూలిన తాటినిట్రాడు కింద, ముద్దగా ముడుచుకుపోయి చలనం లేకుండా పడిఉన్న సరమ్మ!

"అమ్మా" అని పిచ్చిగా అరిచి, వెర్రి ఆవేశంతో తాటినిట్రాడుని భుజం కాసి లేపి, పక్కకి పడేశాడు. తల్లి ముక్కు దగ్గర వేళ్ళుపెట్టి చూశాడు. మెల్లగా శ్వాస తగిలింది. "హమ్మయ్య" రెండుచేతులతోటీ తల్లిని ఎత్తుకుని ఇవతలకి తీసుకువచ్చాడు. తన పాకదగ్గర నిలబడి ఆహోరుగాలిలోంచే "ముత్తేలూ—సంటాడిని తీసుకుని వచ్చెయ్యి. బడి అరుగు మీదకి పోదాం. ఈడే వుంటే ఈ రేత్రి అన్యేయంగా చచ్చి పోతాం" అని ఒక్క పొలికేక పెట్టాడు. అతను ఏం అంటున్నాడో ఆ హోరు గాలిలో అర్థం కాలేదుకాని, మొత్తం మీద మావ గొంతు మాత్రం వినిపించింది ముత్యాలుకి.

చంటాడిని గుండెలకి అదుముకుని పాక ఇవతలకి వచ్చిన ముత్యాలు, నీటితెర అవతల నుంచి నీడలా కనిపించింది సత్తెయ్యకి. "సీకట్లో జాగర్త. కాళ్ళకి ఆకులూ కొమ్మలూ రేకులూ తగుల్తాయి. గాలి ఇసిరేస్తోంది. నెమ్మదిగా, నా ఎనకాలే రా" అంటూ సత్తెయ్య అడుగు కదిపాడు.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. మనిషిని అమాంతం ఎత్తి ఆమడ దూరం విసిరేస్తున్నగాలి. ముందు నడుస్తూన్న సత్తెయ్య ఎటు వెళుతున్నాడో ముత్యాలకి కనిపించడం లేదు. వెనకాల ముత్యాలు



84 టన్నుల బరువున్న "స్కైలాబ్" పడిపోతున్నదా?

అమెరికా ప్రయోగించిన అంతరిక్ష పరిశోధనాగారం యీ మధ్య భూమ్మీదకి పడిపోయే ప్రమాదం వచ్చింది. 240 మైళ్ళ ఎత్తున భూమిచుట్టూ తిరుగుతున్న 84 టన్నుల బరువుగల యీ 'స్కైలాబ్'ను అమెరికా టెక్సాస్ రాష్ట్రంలో హ్యూస్టన్‌లో వున్న జాన్సన్ రోదసీ కేంద్రంలో వున్న నిపుణులు జూలై 19 నుంచి జూలై 25 దాకా రేయింబవళ్ళు తంటాలుపడి — పడిపోకుండా తిరిగి దాని కక్ష్యలో ప్రవేశపెట్టగలిగారు. ఇప్పుడిది మరో ఏడాది కాలంపాటు భూ భ్రమణాలు కొనసాగిస్తుందని ఆశపడుతున్నారు. 1978 ఏప్రిల్ నెలలో యిది భూమ్మీద ఒక "ఉల్క" మాదిరిగా మండుతూ రాలిపోతుందేమోనన్న భయం యిప్పుడు పోయింది! — ఆ తరువాత పడిపోకుండా మరో వెయ్యి సంవత్సరాలు భూమిని చుట్టే మాదిరిగా దీన్ని అంతరిక్ష కక్ష్యలో పడేయడానికి 1979 అక్టోబరులో అమెరికా ఆకాశంలోకి పంపించనున్న "స్పేస్ షటిల్" రోదసీ శకటం ఉపయోగపడుతుంది. ఆ "స్పేస్ షటిల్" శకటం మీద యీ "స్కైలాబ్"ని మరింత స్థిరంగా వుండే "భూ కక్ష్య" లోకి త్రోసేయడానికి చాలినంత బలం గల రాకెట్‌ను పంపిస్తారు... దాంతో "స్కైలాబ్"కు భూపతన ప్రమాదం తొలగిపోతుంది. ప్రస్తుతం యిది ఒక మూల క్రిందకి యీడ్చినట్లు వ్రాలుతూ అది వున్న ఎత్తు నుంచి సుమారు 30 మైళ్ళు దిగజారిపోడానికి కారణం సూర్యగోళం మీద వున్న నల్లని మచ్చలేనట! ఈ నల్లని మచ్చలు భూమికి చుట్టూ వున్న అంతరిక్ష వాతావరణాన్ని బాగా వేడి నెక్కించేస్తాయి. దాంతో అది వ్యాకోచం చెంది— యిట్లా ఆకాశంలో తిరుగుతున్న రోదసీ శకటాలను క్రిందికి గుంజుతాయి!

మొత్తంమీద 25 రకాల తంటాలు పడి— స్కైలాబ్‌ను — సుమారు 2340కిలోగ్రాముల "యింధన శక్తి"తో పైకి నెట్టగలిగారు.

స్కైలాబ్ పడిపోతే నేరుగా వాతావరణంలో చొరబడి అది మండుతూ భూమిని తాకుతుంది—ఇది ఒక "ఉల్కాపతనం" లాంటిదే నన్నారు శాస్త్రవేత్తలు. దీనిమీద మానవ భద్రతకి ప్రమాదం వాటిల్లగలదన్న గోలకి సమాధానంగా గడచిన రెండు వందల సం.ల కాలంగా వున్న రికార్డులు చూడగా— ఉల్కాపతనం వల్ల ఒక్కరూ కూడా చావలేదు. 8 మందికి గాయాలైనాయిట అంతే! [★★★]

వస్తుందా లేదా అని ఆగి చూసే అవకాశం సత్తెయ్యకి లేదు. రెండు చేతుల మీదా బరువుగా తల్లి శరీరం. తన వంట్లో శక్తి క్షణానికి తరిగి పోతూన్న నీరసం. కాళ్ళు తూలిపోతున్నాయి. గాలి తోసేస్తోంది. అడుగు పడటం లేదు. చిందరవందరగా పడిపోయిన ఆకులూ, కొమ్మలూ, రేకులూ, కాళ్ళని కోసేస్తున్నాయి. కాళ్ళు ఎలా వేస్తున్నాయో ఎక్కడ పడుతున్నాయో బాట్టు, మొహం, బట్టలూ అన్నీ తడిసి ముద్దయిపోయాయి. కాళ్ళ గాయాల్లోంచి కారుతూన్న రక్తాన్ని ఒంటిమీంచి కారుతూన్న నీళ్ళు కడిగేస్తున్నాయి. పడుతూ లేస్తూ వచ్చి పట్టుదలతో మొత్తంమీద బడి అరుగు చేరుకుని పేరమ్మ శరీరాన్ని అక్కడ ఒక గోడకి చేరేస్తూ 'హమ్మయ్య' అని గాలి పీల్చుకున్నాడు సత్తెయ్య. అప్పటికే ఓ గంట క్రితమే భార్య పిల్లలతో అక్కడికి వచ్చిపడి చేరుకున్న కోటయ్యా సింహాద్రీ ఒంటి మీన్న బట్టలు పిండుకుంటూ "వచ్చావా? ముసలావిడ్ని మోసుకొచ్చావు బాగానే ఉంది. కాని ముత్తెలు ఏదిరా?" అన్నారు.

కుక్క కన్నీళ్లు

సత్తెయ్య గుండె గుభిల్లుమంది. "అవును. ముత్తెం లేదే?" వెనక్కి తిరిగి చూశాడు. నల్లని కాటుక కొండలా భయంకరమైన చీకటి— ఆ చీకట్లోంచి రేకులు వచ్చి ఎగిరిపడుతూన్న చప్పుళ్ళూ, చెట్లు విరిగి పడిపోతూన్న శబ్దాలూ, తను లాగే పూరి పాకల్లోంచి పారిపోయి వస్తూన్న వందల పేద నిర్భాగ్యుల ఆక్రందనలూ అరుపులూను.

ఓ పక్క నుంచి ప్రకృతి ఘోష
మరోపక్క నుంచి మానవ ఘోష
సృష్టికి అవే అంతిమ ఘడియలు
అనిపిస్తున్నాయి.

వెర్రిగా బిక్కుబిక్కుమంటూ అరుపు అరిచి "నా ముత్తెలో—నా సంటాడో!" అంటూ తిరిగి ఆ గాలి వానలోపడి వెనక్కి వెళ్ళబోయాడు సత్తెయ్య.


"ఈ చీకట్లో ఎక్కడని వెతుకుతావు — అసలు దారి తెలిస్తే ఏమన్నా అనుకోవచ్చు అని— అయినా పెనుగాలి పాలబడి ఏ చెట్టో కూలి పోవడమే కాని, ముత్తెలూ సంటాడూ ఈ పాటికి ఏ డాబా యింట్లోకో చేరి, ప్రాణాలు దక్కించుకునే ఉంటారు. తెల్లారేక చూసుకుందాంలే కూసో" అంటూ కోటయ్యా సింహాద్రీ చెరో రెక్కా పట్టుకుని సత్తెయ్యని ఆపుజేసేశారు.

చేసేదేంలేక గుడ్లనీరు కుక్కుకుంటూ వానలోకి శూన్యంగా చూస్తూ, భయంకరమైన శబ్దంతో వచ్చి తనముందే పడి ముక్కలు ముక్కలుగా విరిగిపోతూన్న సిమెంటు రేకుల చప్పుళ్ళు వింటూ, నిస్సహాయంగా కూర్చుని ఆ కాళరాత్రిని క్షణం ఒక యుగంగా గడిపాడు సత్తెయ్య.

గాలివేగం తగ్గింది. సన్నగా చినుకు మాత్రం పడుతోంది. తూరుపు దిక్కు కొద్దిగా తెల్లబడుతోంది. సత్తెయ్య లేస్తూ "అన్నయ్యా అమ్మని చూస్తూ ఉండు. నేనువెళ్ళి ముత్తెన్ని సంటాడ్నీ వెతుక్కొస్తాను" అంటూ ముద్దగా పడిఉన్నపేరమ్మ శరీరాన్ని కోటయ్యకి అప్పగించి, తాను తిరిగి తన గుడిసెవైపు బయలుదేరాడు.

తెల్లవారుతూ ఉన్నా, పక్షుల కూతలేం వినిపించడంలేదు. చెట్లని ఆశ్రయించుకొన్న ప్రాణాలు ఆ చెట్లతో పాటే పోయి ఉంటాయి.

హార్లిక్స్



ఆరోజుకు ఆరోజు రోగనివారణ శక్తిని పెంచి ఆరోగ్యాన్ని కాపాడే పౌష్టికాహారం.

హార్లిక్స్ నిత్యం సేవించినట్టయితే, మీ కుటుంబానికి రోగాలు రాకుండా తట్టుకునే శక్తి పెరుగుతుంది. వారికి సంపూర్ణమయిన ఆరోగ్యం చేకురుతుంది. ఆరోగ్యం మహాభాగ్యం.

హార్లిక్స్, ప్రపంచం అంతటా డాక్టర్లు సిఫార్సు చేసేది ఇది ఒక్కటే, మీకు అత్యధికంగా పుష్టి ఇచ్చేది ఇది ఒక్కటే ఎందుచేతనంటే ఇందులోను సంపన్నమయిన స్వచ్ఛమయిన పదార్థాలు; అపూర్వమయిన హార్లిక్స్ పద్ధతి ప్రకారం సమ్మిళితమితాయి, దీనివల్ల వీటి సహజ సద్గుణాలు నష్టంకావు. అవి సులువుగా జీర్ణం అవుతాయి.

అందువల్లనే సుచిత్ర హార్లిక్స్‌ని తన కుటుంబ జీవితంలో భాగంగా చేసుకుంది.

సుచిత్ర మోస్తరుగానే మీరుకూడా మీకుటుంబానికి ప్రతిరోజు హార్లిక్స్ ఇవ్వండి వారు ఆరోగ్యంగా, బలంగా పెరగడం మీకు కనబడుతుంది.

"హార్లిక్స్ ప్రధానమయిన పుష్టి సాధనం. మీకుటుంబంలోనివారికి వ్యాధులు రాకుండా తట్టుకునే శక్తి పెరిగేందుకూ వారు ఆరోజుకారోజు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేందుకూ నేను హార్లిక్స్‌ను సిఫారుసు చేస్తున్నాను"



హార్లిక్స్ మంచి పుష్టికరమైనది

హార్లిక్స్ రిజిష్టర్డ్ ట్రేడ్ మార్క్.

మక్కా కన్నీళ్ళు

నేస్తుతోసహా కూలిపోయిన పాపాయిలు. బదాసంధుణ్ణి చీల్చేసినట్టు నిలువునా రెండుగా చీలిపోయిన చెట్లు కొమ్మలూ, ఆకులూ పూర్తిగా పోయి మొండిగా నిలబడి ఉన్న మానులు. ఉప్పుగాలికి నల్లగా మాడిపోయిన లతలూ తీగెలూను. అడ్డంగా నిలువుగా చిందరవందరగా పడిపోయి ఉన్న కొబ్బరి చెట్లూ తాటిచెట్లూ, మెలికలు తిరిగిపోయి వంగిపోయిన లైటు స్తంభాలు గాలికి తెగిపోయి నేలమీద చిక్కులు పడుతూ జీరాడుతూన్న ఎలక్ట్రిక్, టెలిగ్రాఫ్ తీగలు, మధ్య మధ్యలో కూలిపోయిన పాకలూ, ఎగిరివచ్చి పడిన తాటాకులూ, విరిగి ముక్కలు ముక్కలుగా చిట్లబడ్డ సిమెంటు రేకులూ, ఒక్కొక్క చెట్టుకింద, ఒక్కొక్క పాకలో కూలిన తాటిదూలం కింద పడ్డ శవాలు వదిలిన [illegible], సత్తెయ్యగుండె చెదిరిపోతోంది. ఉండుండి వేగంగా కొట్టుకొంటోంది. మళ్ళీ ఒక్కసారిగా ఆగినట్టు అనిపిస్తోంది. "ఈ చచ్చిపోయిన వాళ్ళల్లో తన మామ లేడు కదా...?"— సత్తెయ్యకి వెర్రి బాధ వచ్చి ఆ కొమ్మల మధ్య చదికిలబడి బావురు మని ఏడ్చాడు. కాస్సేపటికి సర్దుకుని కళ్ళు తుడుచుకుంటూంటే, పక్కనే మూలుగు వినిపించింది. అటు చూశాడు. బాగా తన కాలంత లావు కొమ్మకింద, [illegible] పడి ఉన్న ముత్యాలు. "నా ముత్యాలు బతికేవుంది" అనే సంబరంతో గబగబా వెళ్ళి మీదపడి ఉన్న కొమ్మ తప్పించి, నుదుటి మీంచి కారుతూన్న రక్తాన్ని తుడిచి, ఆమె తలని తన తొడమీద పెట్టుకుని చెంపలు నిమరసాగాడు.

కాస్సేపటికి ముత్యాలు నీరసంగా కళ్ళు తెరిచి ఎదురుగ్గాని చూసి బావురు మని ఏడ్చింది. కాస్సేపటికి స్థిమితపడి "మన సంటాడు ఏడి మావా?" అంది. సత్తెయ్య గాభరాగా "ఏదేంటి? నువ్వొక్కదానివే ఈ కొమ్మ కింద పడున్నప్పటికి నీ సంకలో లేడా?" అని అడిగాడు. ముత్యాలు వెక్కిళ్ళు పెడుతూ "ఏమో మావా! ఏ ఎరకాల పడిపోయి వాణ్ణి [illegible]?... నా పెయ్యి [illegible] పోయింది. పెద్ద గాలొచ్చింది. సంటాడు సంకలోంచి ఎక్కడో [illegible] పడ్డాడు.

కాక్టూస్

విద్యార్థుల విజ్ఞానాన్ని పరిశీలించడానికి దోహదం కల్పించిన ఎలక్ట్రానిక్ యంత్రం, నేడు విద్యాబోధనకు సైతం విస్తృతంగా వినియోగపడుతూంది. 'కాక్ట్యూస్' అనే రష్యన్ మరమనిషి, విద్యార్థుల వర్తమాన అభివృద్ధిని అజమాయిషీ చేయడానికి అపూర్వమైన ఉపకరణం'.

చాలా కాలంగా సోవియట్ యూనియన్‌లోని విశ్వవిద్యాలయాలు, కాలేజీలు యీ యంత్రాలను పరీక్ష సమయంలో విద్యార్థుల ను అజమాయిషీకి వినియోగిస్తున్నారు. ఇంతకు ముందు వాటిని ప్రతి పాఠానికీ ఉపయోగించగలిగే వారు కాదు. ఎందుచేతనంటే, ప్రతి కొత్త ప్రశ్నకు వాటిని చాల సర్దుబాటు చెయవలసి వుండేది. కానీ, 'క్షాక్ట్యూస్'కు ప్రశ్నావళిలో నింపిన కార్డులున్నాయి. వాటిని తయారు చేయడానికి పర్యవేక్షకులకి చాలా తక్కువ వ్యవధి తీసుకుంటుంది.

సోవియట్ ఉన్నత విద్యా సంస్థల్లో సాంకేతిక సదుపాయాల సహాయంతో విద్యార్థుల అజమాయిషీకీ, వారి భోధనకూ విస్తృతావకాశాలున్నాయి నేడు, విశ్వ విద్యాలయాలు, కళాశాలలు విద్యాబోధనకూ, విద్యార్థుల అజమాయిషీ యంత్రాలు, అధునాతన పరికరాలతో కంప్యూటర తో సహా, తమ స్వంత టి.వి. కేంద్రాలు, భాషా పరిశోధనాగారాలు, సినిమా థియేటర్లు నిర్మించుకుంటున్నాయి.

అయ్యో... నాయనోయ్ అంటూ ఆ సీకట్లో అటూ ఇటూ ఆడికోసం ఎతుకుతూనే ఉన్నా ...ఇంతలో ఈ కొమ్మ వొచ్చి కణత మీద పడింది...'' సత్తెయ్య గుండె గతుక్కుమంది. "అమ్మ ఎక్కడ సచ్చిపోతుందో అని తను అమ్మ సంగతి చూసుకున్నాడు గాని, అన్నయ్యా బావయ్యల లాగ పెళ్ళాం పిల్లల సంగతే చూసుకుంటే... "సత్తెయ్య కడుపులో ఎవరో కెలికినట్టయింది... ఛీఛ్ ...ఇదేం ఆలోసన ? పాడు ఆలోసన ?... సంటాడు కంటే అమ్మ ఎక్కువ కాదూ తనకి? అవును... కాని... కాని... తనకి ఇద్దరూ కావాలి... అమ్మా... సంటాడు... ఇద్దరూ..." ఇలా దిగాలుపడి చాలాసేపు జీవచ్ఛవంలా కూర్చుండిపోయాడుసత్తెయ్య. తర్వాత ముత్యాలు దుఃఖాన్ని తన ఆవేదననీ ఎలా తగ్గించుకోవాలో తెలియక ఏదో పిచ్చివాడిలా, అటూ ఇటూ మతి లేకుండా, చంటాడి కోసం వెతికిన చోటే వెతకసాగాడు. ఉన్నట్టుండి ఓ పెద్ద తాటాకు కింద ఏదో కదిలిన చప్పుడైంది. చటుక్కున తాటాకు ఎత్తాడు.

అంతే! "ముత్తేలూ" అంటూ సంతోషంతో ఒక్క కేకేశాడు. ఏడ్చేడ్చి సొమ్మసిలి నీరసంగా నిద్రపోతూ చంటాడు ఆ తాటాకు కింద కనిపించాడు. "నీసేతిలోంచి పడిపోయిన చంటాడిమీద దేవుడే వొచ్చి ఈ ఆకు కప్పేడే!" అంటూ సంబరంగా పిల్లాడిని లేవదీసి గుండెలకి హత్తుకుని ముత్యాలికి అందించాడు.

మధ్యాహ్నానికి పెళ్ళాన్నీ పిల్లాడినీ తీసుకుని బడి అరుగు చేరుకున్న సత్తెయ్యకి అక్కడ కోటయ్య కుటుంబంకాని, సింహాద్రి కుటుంబంకాని, ఆఖరికి వచ్చే పోయే ప్రాణంతో గుటగుట లాడుతూ పడివున్న సరమ్మకాని, కనిపించలేదు. అక్కడ తల దాచుకుని ఉన్న వాళ్ళని అడిగి చూశాడు. కనీసం ఎటు వెళ్ళారో కూడా వాళ్ళు చెప్ప లేక పోయారు

ఆ తర్వాత నాలుగైదు రోజులదాకా నిరాశ్రయులైన వేలాది ప్రజలతో కలిసి,

ఋణం

కొన్నే క్షణాలైనా
నువ్వు కోపంతో
మౌనం వహిస్తే......
నా గుండె ఎందుకింతగా నలిగిపోతుందో ?
ఎవ్వరూలేనిఏకాకిననిపిస్తుంది...
తక్షణమె అనంతవాయువుల్లో
కలిసిపోవాలనిపిస్తుంది–
ఎందుకు ?... ఎందుకు ? ?...
గత జన్మలో
తీర్చలేనంతగా ఋణమిచ్చి ఉంటావు–
అందుకే... అందుకే......
కసిగా నా అంతులేని అనురాగాన్ని
వడ్డీతో సహా వసూలు చేసుకుంటున్నావు !

— శారద సదానంద్.

దాతలు పెట్టిన అన్నం తింటూ, ప్రభుత్వం వాళ్ళు ఇచ్చిన బియ్యం వండుకుంటూ సత్తెయ్య తన భార్యా పిల్లాడితో కాలం గడిపాడు. వారం గడిచాక తెలిసింది "ఏసు ముత్యాల్ని వెతుక్కుంటూ బయలుదేరిన మరో గంటకి అమ్మ చచ్చిపోయిందనీ గాలివానలో చచ్చిపోయినవాళ్ళ కుటుంబానికి గవర్నమెంటు వాళ్ళు వెయ్యేసి రూపాయలు ఇస్తారని తెలిసి, ఆ వెయ్యిలో తనెక్కడ వాటాకి వస్తాడో అని భయపడి అన్నయ్యా బావయ్యా అమ్మ శవాన్ని తీసుకుని వెళ్ళిపోయారనీ, తర్వాత తహసీల్దారు దగ్గర ఆ డబ్బు తీసుకుని ఇద్దరూ పంచుకొన్నారనీ, ఆ తర్వాత అమ్మని అథమం దహనం అయినా చెయ్యకుండా స్మశానంలో పూడ్చి పెట్టారనీ"ను

సత్తెయ్య బావురుమంటూ స్మశానానికి వెళ్ళాడు. సరమ్మని పూడ్చిపెట్టిన చోటు దగ్గర 'అమ్మా' అంటూ కుప్పగా కూలి పోయాడు "ఏడవకు మావా. నువ్వు అత్తని అలా రచ్చించావు అందుకే మన సంటాడిని దేవుడు ఇలా బతికించాడు అనుకో. అత్త కోసం ఏడవమాకు" అంటూ సత్తెయ్య కన్నీళ్ళనయితే ముత్యాలు తుడిచింది. కాని, ఇన్నాళ్ళూ సరమ్మ అన్నం తిన్నాక కంచం, అన్నం గిన్నె, కడిగేసిపోసిన మెతుకులు తింటూ, ఆమె పాక దగ్గరే పడుకుని ఉండే కుక్క, ఈ తుఫానులో ఎలాగో బతికి, అక్కడికి చేరుకుని సత్తెయ్య పక్కనే కూర్చుని అతనితోపాటు కన్నీళ్ళు కారుస్తూంది. మరి దాని కన్నీళ్ళు ఎవరు తుడుస్తారు ?

సీరియల్

రాగద్వేషాలు

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

(గత సంచిక తరువాయి)

ఉభయులూ అనుకుని తాంబూలాలు పుచ్చుకున్నారు. లగ్నాలు నిర్ణయించుకున్నారు. మరో పది రోజుల్లోనే కుదిరింది ముహూర్తం! ఆనంద్ తల్లిదండ్రులు వాళ్ళ వూరు వెళ్ళి అన్ని ప్రయత్నాలతో మళ్ళీ వస్తామన్నారు.

పది రోజుల్లోనే అన్ని ఏర్పాట్లూ ఘనంగా చేశారు రావుగారు! కళ్ళు మిరుమిట్లు గొల్పేట్లు ఉన్నాయి శుభలేఖలే-

వివాహ వేదిక అందం చెప్పనే అక్కర లేదు! రంగు రంగుల లైట్లు, తోరణాలు! ఆకాశమంత పందిరి — భూదేవంత వేదిక లాగే వుంది నిజంగా!

కవి సమ్మేళనం— పాటకచ్చేరీ ఏర్పాటు చేశారు పెళ్ళి రెండు రోజుల్లోనూ! అసలాది జనం వచ్చారు! అన్నదానం బాగా జరిగింది! దానితో పాటు వస్త్రదానం కూడా! పెళ్ళి చాలా గ్రాండ్‌గా జరిగింది! అన్నీ రూఢా విధిగా జరిపించారు రావుగారు!

స్నాతకం, వరపూజ, పెళ్ళిముహూర్తం, స్థాలీపాకం, నాగవల్లి, సదస్యం, అప్పగింతలు అన్నీ శాస్త్రోక్తంగా జరిగాయి. వేద-శాస్త్రాలు బాగా చదువుకున్న పండితుల్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి రప్పించి వేద పఠనం చేయించారు! ఆడబడుచు లాంఛనాలు, అత్తగారి లాంఛనాలు, కట్నాలు, కానుకలూ, వాళ్ళు అడిగినదానికన్నా రెట్టింపుగా ఇచ్చారు! వాళ్ళు పరమానంద భరితులయ్యారు! ఊళ్ళో పెద్ద లందరికీ గ్రాండ్ డిన్నర్ ఏర్పాటు చేశారు. అల్లుణ్ణి ఎంతో గర్వంగా తృప్తిగా అందరికీ పరిచయం చేశారు!

కన్యాదాన సమయంలో కళ్ళనీళ్ళొచ్చాయి ఆయనకి గీతని తల్చుకుని! అప్పగింతలప్పుడు చెప్పనే అక్కర్లేదు! ఆయన పరిస్థితి వర్ణనాతీతం! అల్లుడి చేతులు పట్టుకుని చిన్న పిల్లాడిలా ఏడ్చారు రావుగారు.

"నాయనా ఎట్లా చూసుకుంటావో... ఇంకనించీ దానికి తల్లీ— తండ్రీ— భర్తా— అన్నీ నువ్వే— చిన్నప్పటినించీ ప్రాణంలాగా పెంచుకున్నాను— తల్లి లేని పిల్ల...!" ఆపైన మాట్లాడలేక పోయారాయన! గొంతు పెగిలి మాట పైకి రాలేదు. దుఃఖంతో పూడుకు పోయింది గొంతు.

"ఏం ఫరవాలేదండీ! పువ్వులాగా చూసుకుంటాను. ఆమె బాధ్యత నాది — ఏ కష్టమూ రానివ్వను—సరేనా?" అన్నాడు ఆనంద్.

ఆనంద్ తల్లీ — తండ్రులనూ — ఇంటదగ్గ ఆడబడుచులనూ కూడా ఆదేవిధంగా చూసుకున్నారాయన.

వాళ్ళూ "మా కన్నకూతుర్లా చూసుకుంటాం" అని "మా స్వంత చెల్లెలిగా చూసుకుంటాం" అని అభయమిచ్చారు.

అయినా ఆయన మనసు ఆగలేదు. కూతురికెన్నో బుద్ధులు గరుపుతూ—నీతులు చెప్తూ — హితబోధలు చేస్తూ వుండిపోయారు!

ఆ పరిస్థితిలోని తండ్రి హృదయం — తండ్రికే తెలుస్తుంది! కూతురికి పెళ్ళి చేశానన్న తృప్తి—కూతుర్ని విడిచి వుండాలే అన్న బాధ! బాధ్యత నిర్వర్తించానన్న భావన—కుమార్తె వియోగానంతరం కలిగే ఒంటరితనాన్ని తల్చుకుని పడుతున్న ఆవేదన! అది అనాటి కణ్వ మహర్షికే తప్పలేదు!

జరిగిన కథ 3: లక్షాధికారి హనుమంత రావుగారు వివాహమాడిన బెంగాలీ యువతి గీత, ఇందిరను కనిన కొంతకాలానికి మరణిస్తుంది. ఆయన అక్క సుగుణ తన కొడుకు ఫారిన్ రిటర్న్‌డ్‌ను ఇందిరకు ఇచ్చుటకు ఆమె అత్తమామలు నిరాకరించారని ఉత్తరంలో విచారం వెలిబుచ్చుతుంది. ఇందిరను చేసుకునే విషయములో విశ్వనాథం వ్రాసిన ఉత్తరం హనుమంతరావుని గుండెపోటుకు గురిచేయగా, ఆయన కుమారుడు శ్రీకర్ వ్రాసిన ఉత్తరం ఊరట కల్గిస్తుంది. హనుమంతరావు గారు ఇందిరకి వేరే సంబంధాలు చూస్తుంటారు.

7

కూతుర్నీ— అల్లుణ్ణీ హనీమూన్‌కి పంపించారు రావుగారు. ఆయన మాత్రం కావాలనే బిజినెస్ వ్యవహారాల్లో మునిగిపోయారు. కూతురు ఇంట లేదన్న భావం మనసులోకి రాకుండా వుండడానికి శ్రమ పడుతున్నారు.

భర్తతో వున్న ప్రతిక్షణమూ ఎంతో విలువైనదిగానూ— అత్యంత మధురంగానూ వుంది ఇందిరకి. తండ్రితో కలిసి చూసిన కాశ్మీరే ఆనంద్‌తో చూసినప్పుడు వేరుగా కనిపించింది— ఇందిర కళ్ళకి! కొత్త అందాలు గోచరించాయి ఆమెకి! తాను చూసిన ప్రదేశాలు, అన్నీ తన కోసమే సృష్టించబడినట్లు తోచాయి ఆమెకి! రైల్లోనూ, బస్‌లోనూ, విమానంలోనూ— ఆనంద్‌తో బాటు ప్రయాణం చేస్తుంటే— స్వర్గ లోకంలో విహరిస్తున్నట్లుగా వుంది!

పోటీ గడువు 31-8-78 వరకు పొడిగింపబడినది

సుప్రసిద్ధసినిమానటి కుమారి జయసుధ ద్వారా

నాటినుండి నేటివరకు కేశాలంకరణ

పోటీలో పాల్గొని బహుమతులు పొందండి



ఒక్కొక్క ఎంట్రీతో రీటా అట్ట పెట్టెయొక్క పైభాగము కత్తిరించి పంపవలెను. రీటా రెగ్యులర్ సైజు అయినచో నాలుగు, సూపర్ ఎకానమీ సైజు అయినచో ఒకటి ఎంట్రీతో జతపరచి పంపవలెను.



100 ఎమ్ ఎల్
(సూపర్ ఎకానమి)

20 ఎమ్ ఎల్
(రెగ్యులరు)

మీ కేశ సంపదకు రీటా



ప్రతీ రీటా పెట్టెలోను
ఎంట్రీ కూపను కలదు.

మీ ఎంట్రీలు మాకు చేరవలసిన
ఆఖరు తేది 31-8-1978.

10 మాటలలో రీటా గురించి
స్లోగను వ్రాయవలెను.

"నాటినుండి నేటివరకు"
కేశాలంకరణ పోటీ ఎంట్రీ కూపను



1 __________



2 __________



3 __________



4 __________



5 __________



6 __________



7 __________

పేరు __________


చిరునామా __________

ఈ క్రింది చిరునామాకు
పంపవలెను.
VETO COMPANY
16 JONES ST. MADRAS-600001

ఈ దిగువ ఇచ్చిన సమాధానములు
ఏ బొమ్మకు సరిపడునో వ్రాయవలెను.

1. ఆధునిక	2. జపాన్	3. ఈజిప్ట్
4. చైనా	5. 1000 బి.సి.	6. రాజస్థాన్
7. మహాబలిపురం	8. సుమేరియన్	9. విజయనగర్
10. ఫ్రాన్సు	11. గ్రీసు	12. బర్మా

వీటో కంపెనీ, బొంబాయి, కలకత్తా, మద్రాసు





రాగద్వేషాలు

ఆనంద్ కూడా అన్ని వేళల్లోనూ ఆమెని అంటి పెట్టుకునే వున్నాడు. అందాలన్నీ తమవే నన్నట్టుగా— ఆనందమంతా తమదే నన్నట్టుగా— పరిసరాలు మర్చి గడిపారు. హనీమూన్ అంతా అత్యంత మధురంగా గడిచి పోయింది!

తిరిగి వచ్చిన ఇందిరని చూసి సంతోష పడి పోయారు రావుగారు. ఇంటికి తిరిగి కళ వచ్చినట్టుగా వుంది! ఇందిరని వదల లేకపోయారు— పదిరోజులు ఇందిర దగ్గిర లేకపోతేనే చాలా బెంగపడి పోయారు పదిరోజుల కబుర్లూ చెప్పాలని తహ తహ లాడి పోయారు! ఇందిర కూడా తండ్రిని చుట్టేసి కన్నీళ్ళు కార్చింది. ఆ తండ్రీ కూతుళ్ళని వింతగా చూస్తూండి పోయాడు ఆనంద్.

రాంగానే ఇంట్లో పర్చుడు — విశ్రాంతి సరిపోయాయి. తండ్రితో మాట్లాడడానికి టైమే దొరకలేదు ఇందిరకి. ఆ రాత్రి భోజనాలయ్యాక ఆనంద్ నిద్ర వస్తోందంటూ గదిలోకి వెళ్ళిపోయాడు.

ఇందిర తండ్రి దగ్గిరే కూర్చుని కబుర్లు చెప్తోంది! మామూలుగా రాత్రిళ్ళు పక్ని గారికి గార్డెన్లో కూర్చుని కబుర్లు చెప్ప కోవడం కష్టసుఖాలు చర్చించుకోవడం అలవాటే తండ్రీ కూతుళ్ళకి!

కానీ పదిన్నర దాటినా ఇందిర రాకపోయే సరికి ఆనంద్‌కి కోపం వచ్చింది.

పదకొండు దాటుతుండగా పాలగ్లాసుతో ఇందిర గదిలోకి వచ్చింది.

అప్సరసలాగా అలంకరించు కుందామె!

తెల్లని ఫారిన్ నైలెక్స్ చీర, తెల్ల బ్లౌజు ఆమె ఒంటి రంగుతో అవి పోటీ పడుతున్నాయి!

ముత్యాల నెక్లెస్, ముత్యాల గాజులు, దిద్దులు, తలలో మల్లెలు! చాలా అందంగా వుంది!

డన్‌లప్ పరుపులు, తెల్లని ఖరీదైన దుప్పట్లతో మెరిసి పోతున్నాయి! కానీ— పక్కమీద ఆనంద్ లేడు! అంతా వెతికింది. ఎక్కడాలేడు. కంగారు పడుతూ డ్రాయింగు రూములో కొచ్చింది. అక్కడ మూలగావున్న ఒక సోఫాలో కూచుని వున్నాడు ఆనంద్. కాళ్ళు చిన్న స్టూలుమీద చాపుకుని- తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకుని వున్నాడు.

నిజానికి అంతదాకా కళ్ళు తెరిచే వున్నాడు. ఇందిర వచ్చే అలికిడి వినగానే కళ్ళు కావాలని మూసుకున్నాడు.

ఆనంద్ నట్లా చూసి మరింత కంగారు పడింది ఇందిర. మెల్లగా చప్పుడు చెయ్య కుండా సోఫా వెనక్కి వచ్చి పిల్చాని అతడి నుదుటిమీద చెయ్యి వేసింది. చల్లగానే వుంది. జాలిగా నిట్టూర్చింది! ఆనంద్ చలించలేదు. అతడి రెండు కళ్ళూ మూసేటి.

ఆ రెండు చేతులూ తీసేస్తూ— "ఏం పాపం— అప్పుడే వచ్చావేం? ఇంకా రెండు గంటలయ్యాక రాబోయావా?" అన్నాడు కోపంగా!

చిరునవ్వు నవ్వింది ఇందిర. "ఓహో— అందుకా అలక అబ్బాయి గారికి? తప్పయింది క్షమించండి? ఇంకెప్పుడూ చెయ్యనుగా?" ముందుకి వచ్చి కూర్చుంది.

"ఎట్లా నిన్ను నమ్మడం?"

"ఇదిగో ప్రామిస్!"

ఆనంద్ చెయ్యందుకుని, ఆ చేతిలో తన చెయ్యి వేసింది.

చెయ్యి వదలకుండానే దగ్గిరకి తీసుకున్నాడామెని, ఆనంద్.

"ఇందూ, నువ్వు నన్ను ఎప్పుడూ వదలి వుండకూడదు క్షణమైనా నువ్వు నాకు... కనబడకపోతే ... పిచ్చెక్కినట్లుంటుంది నాకు..."

ఆ మాటతో పరవశించిపోయింది ఇందిర.

"నేను మాత్రం మిమ్మల్ని విడిచి వుండ గలనా చెప్పండి? కానీ.. నాన్న..."

"ఛ...ఇంకేమీ చెప్పద్దు నాకు. నేనన్న దానికి అవునను...చాలు!"

ఇద్దరూ నవ్వుకుంటూ లోపలికి వెళ్ళారు.

* * *

తెల్లవారింది. లేపనివ్వడు ఆనంద్, ఇందిరని.

"ఇందూ, ఇప్పుడు నువ్వు అవతలికెళితే నాకు మళ్ళీ నువ్వు ఎప్పుడో కనిపించేది, నిన్ను నేను వదలలేను..."

"మరీ ఏమిటండీ చిన్నపాపాయి లాగా? మీకు నేనెందుకు కనిపించను? మీరూ లేచి రెడీ అయిరండి, కలిసి కాఫీ తీసుకుందాం" అతడి చెయ్యిని తీసేస్తూ అంది ఇందిర.

"అంతేనా? ఇదేనా నీ ప్రేమ నామీద?"

"అయితే ఏం చెయ్యమంటారు చెప్పండి!"

"చెప్పనా. ఇదిగో ఈ బాత్‌రూమ్‌లోనే ముఖం కడుక్కో. సర్వెంట్‌ని కాఫీ తెమ్మను. ఇద్దరం ఇక్కడే తాగుదాం కాఫీ..."

"మరి... మరి... నాన్న?"

"ఏం మీ నాన్నకి కాఫీ ఇచ్చేవాళ్లే లేరా ఈ ఇంట్లో?"

అతడి ధోరణి వింత అనిపించింది ఇందిరకి.

"స్వామీ! మీరు ఇన్నేళ్లనించీ ఫారిన్‌లో వుండి ప్రేమలూ, అభిమానాలూ అన్నీ కొరవడ్డట్లున్నాయి! లేక మన దేశాచారాలు మర్చిపోయారా? పెళ్లవంగానే తండ్రినీ, తల్లినీ, అక్క చెల్లెళ్లనీ మర్చిపోడమేనా?" హాస్యంలోకి దించేసింది.



కబుర్లు చెప్తూనే తను ముఖం కడుక్కుంది. అతడు తేని ముఖం కడుక్కునేట్లు చేసింది. అంతదాకా అక్కడే వుంది అతడికి కోపం రాకుండా!

ఇద్దరూ కలిసే రూము బయటికొచ్చారు.

డైనింగ్ టేబిల్ దగ్గరకి వచ్చేటప్పటికి చల్లారిపోయిన కాఫీ ముందు పెట్టుకుని చేతిలో పేపరుతో అట్లాగే ఏదో ఆలోచిస్తూ కూర్చుని వున్నారు రావుగారు.

తండ్రినట్లా చూస్తూనే కదిలిపోయింది ఇందిర మనసు.

"నాన్నా ఇంకా కాఫీ తాగలేదా?"

కూతురి మాటలతో ఈ లోకంలోకి వచ్చారు.

"అమ్మా ఇందూ! వచ్చావా తల్లీ? నీ చేత్తో కాఫీ ఇస్తేగాని నాకు తాగినట్లుండ దమ్మా!" అంటూ ఆనంద్‌ని చూశారు.

"హల్లో— ఆనంద్ మీరు కూడా లేచేశారే! గుడ్‌మార్నింగ్ రండి కూచోండి. అమ్మా ఇందూ నాకూ అల్లుడుగారికీ కాఫీ తీసుకు రామ్మా."

ఆనంద్ మామగారి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

ఇందిర చల్లారిపోయిన కాఫీ కప్పుతో వంటింట్లోకి వెళ్లింది. మరో అయిదు నిమిషాల్లో పొగలు కక్కే కాఫీ మూడు కప్పుల్లో పోసి తీసుకువచ్చింది. ముగ్గురూ తాగారు.

ఆనంద్‌కీ పద్ధతి చిరాకనిపించింది.

ఇందిర మాత్రం "తండ్రీ — భర్తా ఇద్దరూ నన్ను వదల్లేరు ఇద్దరికీ నేనంటే ప్రాణం! ఎంత అదృష్టం నాది?" అనుకుంది..

* * *

"ఇందూ సాయంత్రం మనం షాపింగ్‌కి వెళ్లాలి" అన్నాడు ఆనంద్.

"సరే" అంది ఇందిర.

"నీకో మంచి చీర కొని పెట్టాలని వుంది నాకు. సాయంత్రం అయిదు గంటలకు వెళ్దామా?"

"ఊఁ" అంది

చక్కగా ముస్తాబైంది సాయంత్రం. లెమన్ ఎల్లో అమెరికన్ జార్జెట్ చీర కట్టుకుంది అదే కలర్ బ్లౌజు. నగలన్నీ తీసేసింది జడ దువ్వుకుని వదిలేసింది. ముఖం మీద ఎల్లో కలర్ బొట్టు,

పెట్టుకుంది. చాలా స్టైలిష్‌గా వుందా డ్రస్సులో ఇందిర.

"ఒన్సీ" అన్నాడు ఆనంద్ తదేకంగా ఆమెనే చూస్తూ.

అతడూ 'అప్‌టుడేట్' గానే రెడీ అయ్యాడు. బ్లాకలర్ పాంట్, వైట్ హాఫ్ స్లీవ్ షర్టు టక్ చేశాడు.

ఇద్దరూ బయల్దేరారు కారులో. చాలా షాపులు తిరిగారు. ఏదీ ఆనంద్‌కు నచ్చలేదు.

"నేనిచ్చే ఈ మొదటి ప్రేమ కానుక నాకూ నీకూ కూడా బాగా నచ్చాలి. దీన్ని నువ్వెప్పుడు చూసినా, కట్టుకున్నా నేను గుర్తుకు రావాలి తెల్సిందా ?"

"ఏమిటండీ అన్నీ చిత్రంగా మాట్లాడతారు ? దాన్ని చూసినప్పుడు మీరు గుర్తుకు రావడమేమిటి ? మిమ్మల్ని చూసినప్పుడల్లా ఆ చీర గుర్తుకి రావాలనండి ! మనిద్దరం జీవితాంతం కలిసే వుండాలి. కలిసేవుంటాం" అంది ఇందిర అతన్ని ఆనుకుంటూ !

"అసలు మీ ప్రేమ కానుకలతో వెలకట్ట లేనిది ! అమూల్యమయినది అదే నాకు లభించింది. ఇంక నాకేం కావాలి ?" ఆరాధనగా భర్తని చూస్తూ అంది ఇందిర తనే !

"అవును ఇందూ. మనిద్దరి ప్రేమా సామాన్యమైనది కాదు. అది ప్రత్యేక

ముస్తాబై మృత్యువు

డా॥ సి. నారాయణరెడ్డి

దండలుగా అల్లుకున్న
ఎన్నెల దారాలతో
గుండియపై కప్పుకున్న
చీకటి హారాలతో
ముస్తాబై మృత్యువు నా
ముందర నర్తిస్తుంటే
తప్పేమిటి ? నా ఊపిరి
మృత్యువును హరిస్తుంటే.

రాగద్వేషాలు

మయినది కదూ?..." నవ్వాడు ఆనంద్— ఆమె బుగ్గమీద చిటికె వేస్తూ !

"ఇంటగా నీ పాస్‌పోర్టు కోసం అప్లయి చెయ్యాలి కదూ? రేపట్నుంచే ఆ పనులన్నీ మొదలు పెడదాం. వీలయితే నవంబరులో అమెరికా వెళ్దాం సరేనా?"

మౌనంగా తలూపిందామె.

'పాస్‌పోర్టు తొందరగా రాకపోతే...? అతడు తాత్కాలికంగా నయినా తనకు దూరమవుతాడన్న ఊహ భరించలేకపోతోం దామె. ఏదో దిగులుగా వుంది. అందుకే మౌనంగా వుండిపోయిందామె.

ఆ పరధ్యానాన్ని గమనించిన ఆనంద్ అమెరికా గురించి, అమెరికన్ల గురించి ఏవేవో కబుర్లు చెప్పడం ప్రారంభించాడు.

ఆ కబుర్లు వింటూ స్టోరు చేరిపోయింది ఇందిర.

చివరికి ఒక షాపులో ఇద్దరికీ నచ్చిందో బెంగాలీ సిల్కు చీర. లేత గులాబీరంగు— చీరంతా అందమైన జరీవర్కు వుంది. చాలా బావుందది. అంతటితో తృప్తి చెందలేదు ఆనంద్...

నగల షాపుకి తీసికెళ్ళాడు.

'ఎన్నో వున్నాయి నాకు' అని ఇందిర చెప్తున్నా వినకుండా కొత్త మోడల్ నెక్లెసు— దానికి మాచ్ అయ్యే గాజులు— కమ్మలూ— ఉంగరం కొన్నాడు !

బిల్లు చాలా అయింది. అతడికి తనమీద వున్న ప్రేమానురాగానికి ముగ్ధురాలయి పోయింది ఇందిర.

అతడి పక్కన నడుస్తున్నా, కార్లో కూర్చున్నా అదో గర్వంగా వుందామెకి ! అతడి మాటలకి కోరికలకి దేనికీ ఎదురు చెప్పాలనిపించలేదామెకి !

షాపింగయ్యాక మంచి హోటల్ కి వెళ్లారు. కబుర్లు చెప్పుకుంటూ కేరింత లాడుకుంటూ భోజనం చేశారు. భోజన మయ్యాక సెకెండ్ షో సినిమాకి వెళ్దా మన్నాడు ఆనంద్. ఎదురు చెప్పలేదు ఇందిర. ఇంటికి వచ్చేటప్పటికి అర్ధరాత్రి దాటింది.

"వచ్చారామ్మా ఇందూ ? రండి భోజనం చేద్దాం" అంటూ వచ్చారు రావుగారు తమ గది నుండి. గతుక్కుమంది ఇందిర.

"మా భోజనమయింది నాన్నా ! ఇంతసేపు మీరెందుకు తినకుండా వున్నారు నాన్నా ? మీ ఆరోగ్యం పాడవదూ ? రండి మీకు వడ్డిస్తాను..."


"వద్దమ్మా! నాకేమీ ఆకలి లేదు. కాసిని మజ్జిగ ఇవ్వు చాలు."


మజ్జిగ తాగి—

"ఇంక పడుకోండమ్మా ! పొద్దు పోయింది" తమ గదిలోకి వెళ్ళిపోయారు.


ఇందిర గదిలోకి వచ్చింది.

ఆనంద్ అశాంతిగా పచార్లు చేస్తున్నాడు! ఇందిర రాంగానే— "ఇందూ నే నొకటి అడుగుతాను— కోపం తెచ్చుకోవద్దు మీ నాన్న నిన్ను అంతగా వదలలేని




ఛాంపియన్ డిటర్జెంట్ కేక్!
1 అప్
మురికిపై విజయం!
అధిక శక్తిగల వన్-అప్ మురికిని నామరూపాలు లేకుండా తుదముట్టించి మురిపించే మెరిపించే శుభ్రత నిస్తుంది!
బట్టలకు సంరక్షణ!
సుతిమెత్తని వన్-అప్ మీ బట్టలను పూర్తిగా సంరక్షించి, వాటికి సుగంధాన్నిచ్చే ఓ తాజాదనాన్ని తెస్తుంది!
1up
డబ్బు ఆదాతో ఉపకారం!
వన్-అప్‌లోని మన్నగల శక్తి, మరీ మరీ. ఉతికిన ప్రతిసారీ డబ్బును ఆదా చేస్తూనే ఉంటుంది!
POWER PLUS
UP
THE CHAMPION DETERGENT CAKE
1 అప్
శుభ్రతా, సువాసనా, మెరుపూ
సమకూర్చే ఛాంపియన్!
ASP/WL-1 UP IA
విట్కో లిమిటెడ్, కాలోల్ 389 330, గుజరాత్.

ధర్మపథం



బులుసు వేంకటరమణయ్య

ధర్మాధర్మనిర్ణయం

ధర్మాలన్నీ అందరికీ సమానంగా అనువర్తించవు. కొన్ని ధర్మాలు కొందరికి సాధ్యం కావు. వాటిని ఆచరించలేనివారు అధర్మప్రవర్తకులని అనుకోవడం సరికాదు. సత్యం, అహింస, ఆస్తేయం, పరోపకారం మున్నగు కొన్ని ధర్మాలు సర్వ జనులకూ సమానములైనవే! వాటిని అనుసరించి ప్రవర్తించవలసినదే! కాని, ఆయా వర్ణాలకూ ఆశ్రమాలకూ విధించిన కొన్ని ధర్మాలు అందరికీ వర్తించవు. ఎందుచేతనంటే— మానవుల మనస్తత్వాలు, శరీరపరిస్థితులు, అనేకరకాలుగా ఉంటాయి. అందరికీ చెందే ఒకే ధర్మమును నియమించడం సాధ్యమైన పనికాదు.

ఆరోగ్యంగా ఉన్నవానికీ, విక్కువ

దాహంతో ఉన్న వ్యక్తికి చల్లని మంచినీరు ఎంతో ఆనందాన్ని కూరుస్తుంది. జ్వర పీడితుడై ఉన్నవానికి ఆ చల్లని నీరు అపకారాన్నే కలిగిస్తుందిగాని మేలుచేయదు. ఇది అందరికీ తెలిసినదే! ఆయారోగాల ననుసరించి వైద్యుడు ఒక రోగికి చల్లని నీటిని, మరియొకరోగికి వేడినీటిని ఇవ్వాలని చెప్పినప్పుడు—అతనికి ఒక రోగిమీద అభిమానమున్నదనీ, మరియొకని మీద అభిమానం లేదనీ అనుకోగలమా? ఒక వ్యక్తికి ఆనందాన్నీ, మరొక వ్యక్తికి అపకారాన్నీ కలిగించే ఆ చల్లని నీటిని నిందించగలమా?

ఆ విధంగానే మనమతం ఆరోగ్యస్థితి

అర్హతను అనుసరించి, వృత్తులననుసరించి ప్రత్యేకంగా ధర్మాలను నిర్ణయించింది. కొందరికి నియమించినధర్మాలు మరికొందరికి అనుకూలించవు. కాయకష్టం సహించక అధ్యయనం, అధ్యాపనలతో కాలము వెళ్ళబుచ్చే విప్రుడికి అరుణోదయం మొదలుకొని మధ్యాహ్నం వరకూ జపం, తపస్సు, పూజాదులు నిర్ణయించబడినవి. వేకువనే లేచి పొలానికిపోయి శరీర శ్రమతో వ్యవసాయం సాగించే వ్యక్తికి ఇవేవీ అవసరం లేదు. అతడు జపాలతోనూ, పూజలతోనూ కాలంగడిపితే వ్యవసాయం సాగదు. కర్షకుడికి జపాదులు అధర్మం క్రిందకే లెక్కకు వస్తాయి.

మన ప్రాచీనులు నిర్ధారించిన పద్ధతులన్నీ స్వక్రమమైన ప్రవర్తనకు దరిమార్పెట్టేవాడు వ్యక్తియొక్క శక్తి సామర్థ్యాలను అనువర్తింపవలసి వుంటుంది. అందువల్లే మన ధర్మాలు ఆయా వృత్తులననుసరించీ, వ్యక్తులననుసరించీ ఉంటున్నవే కాని, అందరూ ఒకేరీతి ధర్మాన్ని అనుసరించవలెననే పద్ధతిలేదు. ఏ ధర్మంకాని, ఏ విధానంకాని వ్యక్తికి ఉండే అధికారంపైని, అర్హతపైని ఆధారపడివుంటుంది. ఇందువల్లనే కొన్ని ధర్మాలు కొందరికి ఆచరణ సాధ్యంకాకుండా వుంటాయి. ప్రాచీనులు నిర్ణయించిన ఏ పద్ధతినీ మనంనిందించడం తగదు.

రాగద్వేషాలు

వాడంగాతే నీకు పెళ్ళెందుకు చేసినట్టు?" అన్నాడు ఆనంద్!

అసలే అశాంతిగా వుంది ఇందిర మనస్సు. సాంగంత్రం ఉన్న ఉత్సాహమంతా చల్లారిపోయింది. ఆనంద్ మాటలకి మరింత బాధేసింది. ఏం మాట్లాడలేదామె. ఆమెకి కష్టంగానే వుంది. ఎటూ చెప్పలేదు తను కూడా!

కాసేపు గడిచాక ఆనంద్ తనని తానే సంభాళించుకుని ఇందిర దగ్గరికొచ్చాడు.

"ఏ మనసు నొప్పిస్తే నన్ను క్షమించు ఇందూ..." తలమీద చెయ్యేశాడు.

అతడి గుండెలమీద వాలిపోయిందామె. అతడు చెప్పే తియ్యని మాటలు వింటూ తన బాధని మర్చిపోయింది ఇందిర.

తరువాత రోజు భర్త కోరికమీద అతడు కొన్న చీర కట్టుకుంది.

నగలు ఒక్కొక్కటీ తనే అలంకరించాడు ఆనంద్. ఆమెని చూస్తూ మురిసిపోయాడు.

మైమరిచి పోయింది ఇందిర.

తన దగ్గరున్న కలర్ కెమేరాతో ఇందిరకి అనేక కోణాల్లో ఫొటోలు తీశాడు ఆనంద్.

ఇందిర బలవంతంమీద ఒక స్టూడియోకెళ్ళి ఇద్దరూ జంటగా కూడా ఫొటో తీయించుకున్నారు.

అతడి ప్రతి చర్యా పన్నీరు చిలికినట్టుగా వుంది ఇందిరకి. తండ్రిని వెయ్యి కళ్ళతో కనిపెట్టుకుంటూనే భర్తకేలోటూరాకుండా చూసుకుంటోంది ఇందిర. తండ్రి మనసు నొప్పించకుండా, భర్తకి కోపం తెప్పించకుండా మసులుకుంటోంది.

ఆనంద్ ఇందిర పాస్‌పోర్టు వీసాలకోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

రావుగారు తనకున్న పలుకుబడితో తొందరగా తెప్పిస్తారు— పాస్‌పోర్టూ అవీను. ఇందిరకా సంగతి తెలుసు! కానీ భర్త ప్రయత్నిస్తున్నాడుగదా అని వూరుకుంది ఇందిర. తండ్రితో ఆ సంగతి ఎత్తలేదు. కూతుర్ని మరి కొన్నాళ్ళు దగ్గరుంచుకొని పంపిద్దామని రావుగారి తలంపు.

(ఇంకా వుంది)



సీరియల్

మోహనరూప

మాదిరెడ్డి సులోచన

అతను బస్ దిగి నేరుగా మిస్ గంగ యింటికి వెళ్లాడు. అతనికి గేటు దగ్గరే ఒక ముసలాయన ఎదురుపడ్డాడు.

"ఊఁ! అబ్బాయ్ వివాహం అయిందా ?"

"లేదండీ..."

"లేదూ! ... ఊఁ ... ఇలా .. ఇలా ... ఈ గదివైపు రా...' ప్రక్కదారిగుండా లోపలికి తీసుకువెళ్లాడు. అందమైన డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు.

"ఊఁ! చెప్పు ... అసలు సంగతేమిటి ?"

అతని చూపులు ఇంద్రమోహన్ బట్టలమీద పడ్డాయి. వాటిని చూచి, ఆర్థిక పరిస్థితి అంచనా వేస్తాడు కాబోలు. అవి స్యామ్సన్ ప్రజెంట్ చేశాడు. అమెరికా నుండి అతని స్నేహితుడు తెచ్చాడట.

"నాకెందుకురా..." అని మొహమాట పడ్డాడు.

"ఒరేయ్ అడ్డగాడిదా! మన స్నేహము, అభిమానము అప్పుడే మరిచిపోయావ్రా!" కొట్టడానికి చెయ్యి యెత్తాడు స్యామ్.

"అబ్బ! తీసుకు వెడతోన్లేరా..." అని తీసుకున్నాడు. సరదాగా వేసుకున్నాడు.

"మనకేపాటి ఆస్తి, పాస్తులున్నాయి బాబూ ?"

"ఆఁ ... మాకు సరిపడా వున్నాయండి..." అన్నాడు.

"ఉన్నవాళ్లున్నాయని చెబుతారుటయ్యా ?" నవ్వాడు. పళ్లన్నీ బయటపడ్డాయి. కొందరు ముఖం మూడ్చుకుంటేనే చూడగలం.

"ఇదిగో ఎవరక్కడ ? గోపన్నా కాఫీ పంపించు." ఇంట్లోకి చూచి అన్నాడు.

"అబ్బే ... అక్కరలేదండీ, మిస్ గంగను పిలిస్తే..."

"చూడు బాబూ! మిస్ గంగను నమ్ముకుని వస్తే నీ అంత మూర్ఖుడు మరొకడు లేడు. కనిపించిన అబ్బాయినల్లా పిలుస్తుంది. తనకు తగరని పంపివేస్తుంది..."

"నేను..." చెప్పబోయాడు. చెప్పనిస్తేగా.

"నేను ... నువ్వూ అని భేదం పెట్టకు. మనము అనుకుందాం. మనము పూనుకుని ఓ పని చేయాలి. దీని చెల్లెలు మంగ వుంది. ఒక ఏడాది అటు యిటు అయినా, అందమయినది. నువ్వు చేసుకో బాబూ. ."

(గత సంచిక తరువాయి)

"ఏమిటి పెళ్లా ?"

"ఆఁ! పెళ్లే...మంగ చాలా మంచిదయ్యా! గోపన్నా ఏదయినా టిఫిన్ వున్నా పట్రావయ్యా."

"సార్! నాకు మొదట ఉద్యోగం కావాలండీ, ఉద్యోగం..."

"ఆఁ ... నువ్వు దొండపాడు వాళ్లబ్బాయివి కదూ!"

"కాదండీ! మల్లె రామలింగంగారబ్బాయిని" అన్నాడు.

"ఫోన్‌లో విని వేరుగా అనుకున్నాను. లేవయ్యా, లే."

ఇంద్రమోహన్ లేచాడు. గోపన్న ఉప్మా, కాఫీ తీసుకువచ్చాడు. అతను ముఖం చిట్లించాడు

"గోపన్నా! నీకు బుర్ర లేదయ్యా నేను యిక్కడికి తెమ్మన్నానా! డైనింగ్ హాల్లో పెట్టు." అతడిని తరిమికొట్టి, తను లోపలికి వెళ్లిపోయాడు. ఇంద్రమోహన్ ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయాడు.

"పదండి బాబూ! తలుపు వేస్తాను "

గోపన్న వచ్చాడు విసుగ్గా. ఇంద్రమోహన్ ముందుకు నడిచాడు.

"నన్ను ఎందుకు పిలిచినట్టు ?"

"ఇంకా అర్థంకాలేదా బాబూ! మా అయ్యగారికి ఇద్దరు మేనగోడండ్లు. వీళ్ళ వెతుకుతుండగానే, ఇద్దరూ ముసలివారవుతున్నారు గాని, ఆ పెళ్లికొడుకులు దొరకరు" అన్నాడు

"మిస్ గంగ పెళ్లికొడుకును వెతుకుతుందా ?" ఆశ్చర్యంగా చూచాడు.

"ఆమె తనకోసం ఆహ్వానిస్తే ఈ ముసలాయన చిన్నమ్మాయికోసం వల వేస్తాడు. ఇక్కడ ఎందుకు బాబూ. హాయిగా ఎక్కడయినా బ్రతుకు..."

అతని మాటలు మననం చేసుకుంటూ బయటికి వచ్చాడు. అరగంట గడిచాక మిస్ గంగ వద్ద నుండి పిలుపు వచ్చింది, వెళ్లాడు.

"రా ... రా ... కూర్చో. ఇ. సి. ఐ. ఎల్‌లో వేకెన్సీలున్నాయని తెలిసింది. వెడతావా?" అన్నది.

అమాంతంగా ఆమె కాళ్లమీద పడిపోదాం అనుకున్నాడు కాని బల్ల అడ్డం వచ్చింది.

"తప్పకుండా వెడతానండీ" అన్నాడు కూర్చుంటూ.

"ఊఁ ... ఈ జాబ్ వస్తే నాకేం ఇస్తావ్?"

"మీరేదడిగితే అదిస్తాను..." అన్నాడు తెల్లబోతూ.

"అయితే ఓ వెయ్యిరూపాయలు ... ట్రా! ఆదివారం వరకు గడువు. ఇక వెళ్ళు."

"ల...లంచమా!" ఆశ్చర్యంగా చూచాడు.

"కాదు పరస్పర సహకారం! నాకు ఒక్కరాత్రి బెర్తు యిచ్చినందుకు, ఉద్యోగం

జరిగిన కథ - 9 : స్నేహితులు విశ్వం, ఇంద్రమోహన్, పాషా, స్యామ్సన్, చక్రిలు విహారయాత్ర ముగించుకొని హైదరాబాద్ చేరినపుడు ఇంద్రమోహన్ ఐ. డి. పి. ఎల్‌లో ఇంటర్వ్యూకి వెళ్ళగా; మిగిలిన స్నేహితులు, అక్క సుగుణ, బావలతో కలిసి ఒక సంబంధం చూస్తాడు విశ్వం. ఆమె శ్రీహరి, రుక్మిణిల ఏకైక కుమార్తె డాక్టర్ రూప. ఆమె ఆహ్వానంమీద ధనికుడైన విశ్వం బీదవాడైన ఇంద్రమోహన్‌తో నర్సింగ్‌హోమ్ చూడటానికి సాగర్ వెళ్తాడు కానుకలన్నా కోరలేదన్న కారణంగా తనకు, తన చెల్లెలు పూర్ణకు కుండమార్పిడి సంబంధం విఫలమవడం, ఉద్యోగ ప్రయత్నంలో మోసగింపబడడంవల్ల ఇంద్రమోహన్ నిరాశా నిస్పృహలకు లోనవుతాడు. రూప తండ్రి విదేశాలకు వెళ్ళిన సమయంలో ఇంటి వ్యవహారాలు చూసే ఉద్యోగం చేస్తూ ఆమె నడవడి కనిపెట్టటానికి ఇంద్రమోహన్‌ను పంపుతాడు విశ్వం. రూప దూరపు బంధువైన శోభన్, ఇంద్రమోహన్‌లతో చనువుగా ఉండటాన్ని క్లినిక్ ప్రారంభోత్సవానికి వచ్చిన విశ్వం గమనిస్తాడు దురలవాట్లకు లోనయిన విశ్వం ప్రవర్తనను గురించి రూప, ఇంద్రమోహన్‌ని ప్రశ్నిస్తుంది. ఇంద్రమోహన్‌కు తప్పిపోయిన సంబంధం తాలూకు అమ్మాయి, సావిత్రి, అబార్షన్ చేయించుకొనే నిమిత్తమై రూప నర్సింగ్‌హోమ్‌లో చేరుతుంది. రూప, ఇంద్రమోహన్‌లు మరింత సన్నిహితులవుతారు. తనకు, శోభన్‌కు అక్రమ సంబంధం అంటకట్టాడని విశ్వాన్ని, డైరీ చూచి ఇంద్రమోహన్‌ని, వెళ్లగొడుతుంది రూప.

యిప్పించమని అడుగుతున్నావ్. మరి నాకు ఏదో ఆశ వుంటుంది కదా.'' అన్నది. ఆమె నిర్మొహమాటానికి ఆశ్చర్యం కల్గింది. ఆమె వంటవాడి గురించి అడగడంకూడా మరిచిపోయాడు.

''వస్తానండీ...'' ఆమె యింకా ఏదో అడుగుతున్నా వినిపించుకోలేదు. అలసికి తల తిరిగిపోతుంది. మిస్ గంగ అన్న మాట నిజమే అయినా నిజం అంత చేదుగా వుంటుందని వూహించనైనాలేదు మెల్లగా బస్స్టాండుకు వచ్చి, బస్సెక్కాడు.

అతను ఇల్లు చేరేసరికి, బయట గేటు దగ్గర తచ్చాడుతుంది పూర్ణ.

''చీకటి పడుతుంది బయట నిలబడ్డావేమ్మా ?''

''నీకోసమే అన్నయ్యా.'' ఆందోళనగా చూచిందామె.

''అన్నయ్యా ! నువ్వటు వెళ్ళగానే పట్నం మామయ్య వచ్చాడు. నర్సారావుపేట దగ్గర భూస్వాములట. వాళ్ళకు లేక కాదట, పరువు ప్రతిష్ఠలకోసం కట్నం అడుగుతున్నారట. అమ్మా, నాన్న అతని మాటలకు కరిగిపోయారు.''

''నీకేం అభ్యంతరం ! పల్లెటూరివాడనా ?'' బొమ్మలు ముడిపడ్డాయి. పూర్ణ యింతగా ఎదిగిందంటే నమ్మలేకపోతున్నాడు

''అది కాదన్నయ్యా ! కట్నం అడుగని కరుణాత్ముడెవరయినా వుంటే చెప్పు. పాకినాడయినా లడ్డం చెబితే అడుగు.'' అన్నది బాధగా

''ఛ ... ఏమ్మాటలే.'' చెల్లెలి భుజం తట్టాడు.

''నీతో సంప్రదించి ఇల్లు అమ్ముతారట...''

''ఎన్ని వేలు కావాలట కట్నం ?''

''పదిహేనువేలు వాళ్ళు అడిగారట. పదికి మామయ్య ఒప్పిస్తాడట.'' అన్నది దిగులుగా.

''పెళ్ళంటే సంబరపడతారుగాని ఏడుస్తారటమ్మా.'' నవ్వాలని ప్రయత్నం చేశాడు.

''అన్నయ్యా ! మీకున్న ఈమాత్రం నీడ కూడా లేకుండా చేసి నేను సుఖంగా వుండాలా ?'' దాదాపు ఏడ్చినట్టే అడిగింది. చెల్లెలి వీపు నిమిరాడు.

''ఊర్కో ..ఊర్కో నేను చూసుకుంటానుగా నీ పెళ్ళికోసం కాకపోయినా చందు చదువుకోసం అయినా ఇల్లు అమ్మక తప్పదు...'' చెల్లెలి నడుముచుట్టూ చెయ్యి వేసి నడిపించుకువచ్చాడు లోపటికి.

''రావయ్యా అల్లుడూ రా. నిన్ను చూస్తుంటే ఆడపిల్ల లేదే అని బాధ కల్గుతుంది.'' అన్నాడు.

''అయితే ఓ పాపను కనెయ్యండి మామయ్యా.'' చందు సలహా యిచ్చాడు

''చందూ !'' ఇంద్ర ఉరిమిచూడగానే వెళ్ళిపోయాడు.

''అననీరా అననీ. ఈసారి ఈ సంబంధం వదులుకుంటే మళ్ళీ పూర్ణకు పెళ్ళి చెయ్యలేమురా.'' ఒకటికి పదిసార్లు అమ్మాయి అదృష్టం పొగిడాడు. అబ్బాయి ఆస్తి, పాస్తులు పొగిడాడు. అన్నీ వివరంగా చెప్పాడు.

''సరే మామయ్యా ! అమ్మాయిని వచ్చి చూడకు వెళ్ళమను, నచ్చితే మాట్లాడుదాం'' అన్నాడు. పూర్ణ అన్నను కొర, కొర చూచింది

మోహనరూప

కళ్ళతోనే ఆమెకు పరవాలేదన్నట్టు చెప్పాడు

''అయితే రేపు ఆదివారం అబ్బాయిని తీసుకువస్తాను. తండ్రి అన్నాడు, 'వాడికి నచ్చితే చాలండీ' అని. ఖర్చు వుండదు'' అన్నాడు నిశ్చింతగా.

''కట్నంనచ్చిందిగా...''అన్నది కోపంగాపూర్ణ

''ఏమిటే కోడలుపిల్లా ! ఏమో అంటున్నావ్ ?''

''పూర్ణా ! కాసిన్ని మంచినీళ్ళు తెచ్చిపెట్టమ్మా.'' ఇంద్రమోహన్ తీక్షణంగా చూచాడు చెల్లెలిని.

''అలాగే...'' ఆమె లోపటికి వెళ్ళిపోయింది

''మన సంగతి తెలుసుగా మామయ్యా ! మరో, రెండు మూడేళ్ళు ఆగితే పూర్ణ ముఖంలో వున్న ఈ వర్చస్సు వుండదని అంగీకరిస్తున్నాం లాంఛనాలు, లావాదేవీలంటే మావల్లకావు.''

''అవన్నీ అడగడానికి ఎవరున్నారనిరా. తల్లీ, తండ్రే ఆ విషయములో నిశ్చింతగా వుండు.'' లేచాడాయన.

''భోజనముచేసి వెళ్ళు అన్నయ్యా.''

''నువ్వు అడుగుతుంటే కాదంటే ఏం బావుంటుంది. అలాగే వడ్డించెయ్యి. ఈ సంగతి విన్నావుట్రా ! ఆ సుబ్బారాయుడు లేడూ !''

''మామయ్యా ! మన విషయాలే మనకు బోలెడున్నాయి. ఇతరుల సమస్యలు ఎందుకు చర్చించటం !'' విసుగ్గా చూచాడు. దాంతో ఆయన నీళ్ళు మింగాడు. జయమ్మ వడ్డించానని పిలువగానే అందరూ లేచారు.

19

పెళ్లి రోజుల్లోకి వచ్చింది అందరికి శుభలేఖలు పంపించి వచ్చాడు ఇంద్రమోహన్. ఇల్లు పద్దెనిమిదివేలకు అమ్మారు. పదివేలు కట్నం. ఎంత క్లుప్తంగా చేసినా పైన మరో అయిదువేలు అవుతున్నాయి. మూడువేలు చందు చదువుకోసం దాచారు. మొదట పూర్ణను అత్తవారింటికి పంపటమే వాళ్ల లక్ష్యం.

''అన్నయ్యా ! డాక్టరుగార్కి ఆహ్వాన పత్రిక పంపావా ?'' పూర్ణ అడిగింది. అక్కడ జరిగిందేమిటో పూర్తిగా తెలియకపోయినా, భేదాభిప్రాయాలు వచ్చాయని, అందుకే వచ్చేశాడని తెలుసు పూర్ణకు.

''పంపాను. అనుమానమయితే నువ్వూ పంపు'' అన్నాడు నవ్వుతూ.

''మరి అక్కడ ఇంకో డాక్టరుంటారుకదా. ఆయనకు పంపావా ?'' కొంగు వేలుకు ముడి పెట్టుకుని అడిగింది.

''శోభన్ కా ! ఈరోజు స్వయంగా వెడుతున్నాను. ఇచ్చి వస్తాను'' అన్నాడు, కొన్ని కార్డ్సు తీసుకుని కొందరి పేర్లు వ్రాస్తూ.

''అన్నయ్యా ! అమ్మకు ఒక్క చీర సరియైంది లేదు. ఓ మాధవరము చీర పట్రా'' అన్నది, తల్లి యెక్కడ వింటుందోనని అటు, ఇటు చూస్తూ.



"అవును మరిచేపోయాను చందూ, ఒరేయ్..." తమ్ముడిని కేకలువేశాడు. తలుపులకు రంగు వేస్తున్నవాడల్లా పరుగెత్తుకు వచ్చాడు.

"పిలిచావా అన్నయ్యా ?"

"అవున్రా ! నేను సిటీ వెడుతున్నాను. నీకు బట్టలు తేవాలా, నువ్వే వెళ్లి తెచ్చుకుంటావా?"

"ఈ మహాతల్లి పెళ్లి ఏమోగాని ఒక్క క్షణం తీరికలేదు. రేపు ధనవంతులయిన అత్తగారింట్లో వుండి మనల్ని పలుకరిస్తుందో లేదో..."

"చూడన్నయ్యా." పూర్ణ అరిచింది.

"ఒరేయ్ ! నేను ఏమడిగాను, నువ్వేం చెబుతున్నావ్ ?"

"అన్నయ్యా ... మరేమో..." మెడమీద గోకుతూ నిల్చున్నాడు.

"నీ మరేలు కట్టిపెట్టరా... నువ్వు వెడతావా ?"

"నీకు స్యామన్నయ్య ఇచ్చిన ప్యాంటు, చొక్కా ఇస్తే చాలు." అన్నాడు కాస్త బిడియపడుతూ.

"నేను అనుకుంటూనే ఉన్నాను నీ కళ్లు వాటిమీద పడ్డాయని..." అన్నది పూర్ణ.

"ఏం మీ ఆయనకు తీసుకువెడతావా ?" వెక్కిరించాడు చందు.

"తీసుకోరా ! అలాగే తీసుకో" అన్నాడు ఇంద్రమోహన్.

అతను అందరూ వ్రాయించిన లిస్ట్ తీసుకుని హైదరాబాద్ వెళ్లాడు. అన్నీ కొని శోభన్‌కు పత్రిక ఇచ్చి ఇంటికి వచ్చాడు. అతనికి యెదురు వస్తూ, పూర్ణ, చందూ కుస్తీలు పడుతున్నారు. ఒకరి నోరు ఒకరు మూశారు. ఏమిటో అర్థం కాలేదు.

"ఏయ్... నేనే అన్నయ్యకు చెప్పాలి."

"కాదు నేను చెప్పాలి."

"కాదంటే..." ఒకరిని ఒకరు త్రోసు కుంటున్నారు.

"అబ్బబ్బ ఏమిటర్రా ?"

"మీ ఇద్దరికి ఆ అవకాశం లేదు. నేను చెబుతున్నాను." జయమ్మ వచ్చింది

"అమ్మో..." ఇద్దరూ తల్లి నోరు మూశారు.

"అన్నయ్యా! నీకు నాగార్జున్‌సాగర్ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది..." ఇద్దరూ కోరస్‌గా చెప్పారు.

"అదా సంగతి..." ఇంద్రమోహన్ మైమరిచి నట్టు తనవాళ్లను చూచాడు. పూర్ణ దాదాపు నెల రోజుల నుండి విచారంగా ఉంది. కిల, కిల నవ్వింది చూడలేదు. ఈ రోజు యెంత ఉత్సాహంగా ఉంది. ఈమధ్య తరగతి కుటుంబాలకు నవ్వే కదా ప్రాణం. ఈ ఆత్మీయతే ఆస్తి, పాస్తి.

"అన్నయ్యా నోరు తెరువు..."

"మహా ! నేను చేసిన స్వీటు తను పెడతా డట .." అలక సాగించింది పూర్ణ

"ఇద్దరూ పెట్టండర్రా, తింటాను." పెద్దగా నోరు చాపాడు. తల్లి ఈలోగా మిఠాయి కొడుకు నోట్లో పెట్టింది.

"ఊఁ... నేను కష్టపడి చేశాను." పూర్ణ రాగాలు తీసింది. చందు ముఖం మాడ్చుకున్నాడు.

ఇంద్ర మిఠాయి నమిలి మింగాడు.

"ఒరేయ్ ఈ సంఘటనతో ఏం నేర్చు కున్నారు ?"

"మిఠాయి ఉంటే ముందు మనము తినాలని..." కసిగా అన్నాడు చందూ.

"ఒఠ్ఠి బుద్ధూగాడివిరా. ఏ విషయములో నయినా ఇద్దరు కొట్లాడితే మూడోవాడికి లాభం తెలిసిందా ? అమ్మా ! ఈ స్వీట్ సరిపోదే ఆకలవు తుంది" అంటూ, తల్లి వెనుకాల నడిచాడు

"అన్నయ్యా ! నీ మొదటి జీతం - రాగానే నాకు గాజులు చేయిస్తానన్నావు..." పూర్ణ అడిగింది.

"ఆఁ ఆఁ ! గాజులు కడుపు నింపవు. అన్నయ్యా ! లైబ్రరీ పుస్తకాలంటూ నా బ్రైన్ వేస్ట్ చేయాలనుకోవటంలేదు. పుస్తకాలు కొనాలి" గునిశాడు చందు.

"ఏం ? లైబ్రరీలో తెచ్చుకుంటే అరిగి పోతావా ? అన్నయ్యా గాజులు..."

"గాజులు !" వెక్కిరించాడు. బంగారు గాజులు పది, ఇరవై రూపాయల్లో వస్తాయా ! అన్నయ్యా పుస్తకాలు కొనగా మిగిలిన డబ్బులో ఓ రెండో మూడో పడేస్తాం. రంగు రంగుల గాజులు కొనుక్కో" చందు దర్జాగా చెప్పాడు.

"అవి మీ ఆవిడకు దాచుకో, అన్నయ్య చేయిస్తాడు "

"మీ ఆయనను అడగరాదూ !" చంద్ర మోహన్ వెక్కిరించాడు, రెండు చేతులు ఇంత వెడల్పు చేస్తూ. కాయకష్టం చేయటంవల్ల కాబోలు, పెళ్లికొడుకు ఆరోగ్యంగా. కాస్త లావుగా ఉన్నాడు.

"చూడన్నయ్యా..." పూర్ణ ముఖం మాడ్చు కుంది.

"ఒరేయ్ ! నీకో పిప్పళ్ల బస్తా ఒస్తుందో, నీళ్ల పీపా వస్తుందో యెవరికి తెలుసు ?" ఇంద్ర మోహన్ తమ్ముడి చెవి పిండాడు.

"ఒక్క నిముషం ఊరుకోరు ఇంద్రా ! చస్తున్నాననుకో" జయమ్మ సగం నవ్వుతూ సగం కోపంతో చెప్పింది.

"పోనిలేమ్మా ! పూర్ణ అత్తవారింటికి. చందు చదువులకు హైదరాబాద్ వెళ్లిపోతే, మనకు మాత్రం ఏం తోస్తుంది ! ఉన్నంతసేపయినా ఉత్సాహంగా ఉండనీ..."

"ఇంద్రా ! ఆ ఏడుకొండలవాడు యెంత దయామయుడు ! ఇల్లమ్ముకుని ఈ ఊళ్ళో ఎలా వుండాలా అని మధనపడుతున్న సమయాన, నీకు ఉద్యోగం రావడం అదృష్టంరా" అన్నది కళ్ళు ఒత్తుకుని.

"ఇది మరీ బావుందమ్మా ! రాత్రింబవళ్ళు కష్టపడింది నేను. క్రెడిట్ ఏమో నీ ఏడుకొండల వాడికి అంటగడతావా ?" అన్నాడు హాస్యంగా.

"పోరా వాడి దయలేనిది ఏది జరగదు."

"అమ్మా ! అర్జంటుగా ఆ దయామయుడిని ఓ అయిదువేల రూపాయలు ఇమ్మను నేను స్కూటర్ కొంటాను..." చందూ అడిగాడు

"స్కూటరే కొంటావో మోటారే కొంటావో యెవరు చూడవచ్చారు ? మొదట చదువు కానియ్యి" అన్నదామె.

ఇంద్ర స్నానంచేసి వచ్చాక ముగ్గురికి వడ్డించింది.

"నువ్వూ రామ్మా."

"మీ నాన్నను రానియ్యరా. ఆయనకు ఇల్లు వదలాలంటే బాధగా వుంది. ఉన్నంతలో అన్ని హంగులతో కట్టుకున్నామాయె" అన్నది తనూ బాధపడుతూ.

"ఆ మాట పదే, పదే అనుకుని ఏం లాభం ! నీ నగలు పోలేదా ? కొంత పొలం పోలేదా ?"

"నా చదువు పూర్తి అయ్యేలోగా ఆ వున్న పొలమూ పోవచ్చు. అందుకని, తల్లీజీ మాతృశ్రీ ! మధనపడకు. మనము అంటే చంద్రమోహన్ ద గ్రేట్ ... బైదిబై సినిమా హీరో కాదు. ఈ చంద్రమోహన్ ఇంజనీరయ్యాక, లంకంత ఇల్లు కడతాడు. అందులో అమ్మకు ఓ పడక గది, ఓ విశ్రాంతి మందిరం, ఓ పూజా గృహం, ఓ వంట గది, ప్రత్యేకంగా కట్టిస్తాను. కిలోలతో తూని నగలు చేయిస్తాను."

లోకం నాకోసం ★

— దోనెపూడి రాజారావు

ఇన్నాళ్ళూ 'లోకం'
ఏదో అనుకున్నాను
అంతా నేనే అనుకున్నాను.
తీరా చూస్తే
నేను తినే తిండి
నేను కట్టే బట్ట
నా నెత్తిమీద గొడుగు
నా కాలిక్రింద చెప్పు
నా చేతిలో గ్రంథం
నా జేబులో కలం
ఇవన్నీ వొకడు చేసిపెట్టినవే.
ఒకడు గనిలో
ఒకడు వనిలో
మరొకడు గిరిలో
ఇంకోడు బృందావనిలో
నాకోసం 'పని' చేస్తున్నారు.
మరి నేనో ఏదీ లేదు;
తెల్లకాగితం
నలుపు చేస్తున్నాను
ఇది 'పని' కాదు వట్టి కబుర్లు.
ఇలా నన్ను నేను
ప్రశ్నించుకుంటే
వెళ్లిపోతున్నాను
వెనక్కు వెనక్కు
మారుమూల పల్లెటూరి శివార్లకు
స్టార్టింగ్ పాయింటుకు
వెళ్లిపోతున్నాను.
నేను ఏదీ కాదు.

''కిలోలతో తూచేది బెల్లమా బంగారమా!'' పూర్ణ వెక్కిరింతగా నవ్వింది.

''సోదరీ! మీవారు అన్నింటా లావువారే కావచ్చుకాని ఇంత గర్వం పనికిరాదని అనుచుంటిని. అగ్రజుడికి...''

''ఆఁ చాల్లే. వదువై పెళ్లాం వచ్చాక ఒక అమ్మ, అన్న వున్నారని గుర్తుంచుకుంటే

అన్నీ కట్టించిఎంత విలువ.'' జయమ్మ కసురుకున్నది.

''ధిక్కారము... ధిక్కారము...'' అన్నాడు తమాషాగా.

''ఏరా చాలా హుషారుగా ఉన్నావ్ ఏమిటి కథ ?''

''నీకు ఉద్యోగం వస్తే నాకు సంతోషం కాదా అన్నయ్యా...''

''కబుర్లు చాలుగాని భోజనం అయ్యాక విశ్వం వాళ్లింట్లో ఆహ్వాన పత్రిక ఇచ్చిరా'' తల్లి చెప్పింది.

''వాడెందుకు ? నేను వెడతానులేమ్మా'' అన్నాడు. అతను బట్టలు మార్చుకుని ఫార్మ్ వైపు

మీకు తెలుసా?

★ ఐక్యరాజ్య సమితి నిపుణుల అంచనాల ప్రకారం ఈనాడు ప్రపంచం సైనికావసరాలమీద ఏటా 4,00,000 మిలియన్ డాలర్లు ఖర్చు పెడుతూంది.

★ మొత్తం ప్రపంచంలో అన్ని దేశాలకు చెందిన సైనికులు 26 మిలియన్లమంది వున్నారు. యుద్ధ పరిశ్రమల్లో పనిచేస్తున్నవారిని కలుపుకుంటే వీరి మొత్తం సంఖ్య 60 మిలియన్లకు చేరుతుంది.

★ రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నాటినుంచి ఇంతవరకూ ప్రపంచంలో ఆయుధాల మీద 60,00,000 మిలియన్ డాలర్లు ఖర్చు జరిగింది. ఇది 1976లో వున్న ప్రపంచ మొత్తం జాతీయోత్పత్తికి సమానం.

★ ప్రపంచ సైనిక ఖర్చుల్లో ఒక్క శాతం ధనాన్ని పక్కన పెడితే, ఆ డబ్బుతో ఆకలితో అలమటిస్తున్న 200 మిలియన్లమంది పిల్లలకు కడుపునిండా తిండి పెట్టవచ్చు. వర్ధమాన దేశాల్లో 50 మిలియన్ల కుటుంబాలకు సరైన గృహవసతి లేదనీ, 650 మిలియన్లమంది దారిద్ర్యంతో బాధపడుతున్నారనీ నిపుణుల అంచనాలవల్ల తెలుస్తోంది.

★ 1976లో ప్రపంచ సైనిక ఖర్చులు, ఆరోగ్య పరిరక్షణకోసం కేటాయించిన మొత్తం కన్నా రెండింతలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికన్ మిస్సైల్ స్వారో–111ను మరింత మెరుగు పర్చడానికి పెట్టిన ఖర్చుతో, ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క మలేరియా నిర్మూలన పథకాన్ని సమర్థవంతంగా అమలు జరపవచ్చు.

★ ప్రపంచ దేశాలు ఆయుధాలపై ఖర్చు పెట్టడం మానేస్తే ఏటా 2,00,000 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. దీనిని ప్రజావసరాల నిమిత్తం ఖర్చు పెట్టవచ్చు.

— [వసంత]

వెళ్ళాడు. అతనికి తెలుసు అక్కడే ఉంటారని. చక్రం కాపురం కూడా పెట్టాడట. కట్నం కోసం మామ కూతుర్ని చదువు కాగానే వివాహం చేసుకున్నాడు. చక్రం భార్య బయట కూర్చుని కునికిపాట్లు పడుతుంది. అతనికి వరండాలో చక్రం తమ్ముళ్లు కనిపించారు.

"మీరా ఇంద్రన్నాయ్..." ఉత్సాహంగా వచ్చారు.

"బావున్నారా?" పలుకరించాడు.

"బావున్నాము అన్నయ్యా! కాలేజి, వాడికి బడి తీస్తారు. ఫీజుకు డబ్బిస్తాడేమోనని వస్తే అన్నయ్య అసలు మాట్లాడటంలేదు" అన్నాడు దిగులుగా.

"ఇక్కడ డబ్బు రాసులు పోసుకుని కూర్చున్నాం. మరదులు రాలేదేమా అని చూస్తున్నాం..." అన్నది చక్రం భార్య, ఏహ్యంగా చూస్తూ.

"అమ్మా! తల్లీ మా అన్నను నీకు అమ్ముకోలేదుగాని నోరు మూసుకో..." అని ఆ అబ్బాయి గదమాయించాడు. ఇంద్రమోహన్ తీక్షణంగా చూచి తలుపు తట్టాడు.

"యెవరూ! ఇప్పుడు పనిలో ఉన్నాము."

"చక్రీ! మొదట తలుపు తియ్యి..." అని అరిచాడు. అయిదు నిమిషాల తరువాత తలుపు తీశారు. అందులో ఓ స్త్రీ కూడా ఉండటం చూచి తెల్లబోయాడు.

"విశ్వం! నువ్వోసారి బయటికి వస్తావా?"

"యెందుకు? ఆ వన్నెలాడి తరపున వకాల్తా తెచ్చావా!"

"నువ్వు ముందు నోరు మూసుకుని బయటికి రా. ఈయన వద్దన్నంత మాత్రాన ఏ ఆడపిల్లకు పెళ్లి కాదనుకుంటున్నాడు మగాడు..."

"ఏమిట్రో..." లేచివచ్చాడు విశ్వం. ఇద్దరికి ఆహ్వాన పత్రికలు ఇచ్చాడు. తీసుకుని చూచారు.

"తప్పక వివాహానికి రావాలిరా" అన్నాడు. డబ్బున్నవారి పిల్లలు ఏం చేసినా చెల్లుతుంది.

"నువ్వు పిలిచాక రాకుండావుంటానా! అక్కడ దొంగిలించిన డబ్బేం చేశావురా? ఓ! చెల్లెలి పెళ్లి కదూ!"

"దాచుకున్నాను. నీ పెళ్లి ఎప్పుడు?"

"పూర్ణిమ తరువాత, అయిదురోజులకు అన్నవరంలో వుంది. స్నేహితులు రాకపోతే ఎలా? మా మామగార్ని కట్నం, కానుకలు, ఆడబిడ్డల లాంఛనాలు కాక స్నేహితుల మర్యాదలని మరో కొత్త నిబంధనలు పెట్టాను." విశ్వం నవ్వాడు.

"ఎన్ని నిబంధనలయినా పెడతావురా లక్ష్మీపుత్రుడివి" అన్నాడు వెటకారంగా.

"విశ్వం అంటే ఏమిటనుకున్నావురా! అన్నీ క్లాసుగానే జరుగుతాయి. ఈసారి నేను ఎన్నుకున్న సంబంధం చాలా మంచిది. ముద్దబంతిపువ్వు, ఒట్టి పల్లెటూరిపిల్ల. అయితే ఏం పవిత్రమయింది..."

అప్పటికే ఇంద్రమోహన్ బయటికి వచ్చాడు. చక్రం తమ్ముళ్ని విదిలించివేస్తున్నాడు, విసుక్కున్నాడు.

"ఈ ఒక్కసారికి ఓ వందరూపాయలు సర్దు అన్నయ్యా! ఫిక్స్డ్ డిపాజిట్స్ అన్నీ నీ వ్యాపారంలో పెట్టావు కదా..."

"చాలావరకు వచ్చిందే వ్యవహారం! అవునా తెచ్చుకున్నాను. ఏం చేస్తారు?" చక్రం అడిగాడు.

"అలా నిదానంగా అడుగుతారేమండీ! మీ పెద్దన్న వెండీ, బంగారం తీసుకుని వెళ్లితే మీ అమ్మా, నాన్న ఊర్కోలే. అదంతా లెక్క చూపినవాడు యిస్తాం అని చెప్పండి." చక్రం పెళ్లాం అంది. ఇంద్రమోహన్ ఆశ్చర్యంగా చూచాడు. అనుబంధాలు, ఆప్యాయతలూ అన్నీ అబద్ధం అంటారు, అనుభవంలేనివారు. తన తమ్ముడు, చెల్లెలు ఎంత ఆనందపడ్డారు! మరో జన్మ ఎత్తినా, ఆ ఆప్యాయత చక్రం పొందగలడా! డబ్బు సంపాదించి దాచుకున్నా, త్రాగినా ఆ అనుభూతి వస్తుందా? ఆ ఆప్యాయత చాలు తను బ్రతుకడానికి. చక్రం విసురుగా తలుపు వేసుకున్నాడు.

"బాబూ..." ఆప్యాయంగా ఆ కుర్రాడి భుజం తట్టాడు. పెళ్లి ఖర్చులు చేస్తున్నాడు. అందులో మిగిలిన వందరూపాయలు తీసి ఇచ్చాడు.

"వద్దండీ..." చెయ్యి చాపలేదు.

"దానం చేసేటంత ధనవంతుడిని కాను తమ్ముడూ. అప్పిస్తున్నాను. ఆత్మీయత మరిచిపోయిన అన్నను దేవిరించేకంటే ప్రొద్దున లేచి పదిండ్లకు పాలు ఇచ్చి. డబ్బు తెచ్చుకొండి" అన్నాడు గంభీరంగా.

"మాకు యెవరిస్తారన్నయ్యా?"

"ఇదిగో ఈ అడ్రసుకు వెళ్లు. కొందరు చదివి స్వార్థపరులయితే, కొందరు నిస్వార్థంగా తోటివారికి సాయపడతారు. చిన్న కులంలో నుండి వచ్చి క్రిస్టియన్ అయినా స్వామీ పెద్ద బుద్ధి గలవాడు" అని అడ్రసు ఇచ్చాడు. వారు నోటితో చెప్పలేని భావం కళ్లల్లో కనిపించింది. నమస్కరించి వెళ్లిపోయారు.

ఇంద్రమోహన్ ఒక్కడుగు ముందుకు వేశాడు. చక్రం, అతడి భార్య బుసలు కొడుతూ వచ్చారు.

"ఒరేయ్! నా తమ్ముళ్లకి డబ్బివ్వడానికి నువ్వెవడవురా?"

"నీ మొగుణ్ణి! అడగడానికి నువ్వెవడవురా?"

"ఒరేయ్ అసలు సంగతి నీకు తెలియదు."

"వడ్డీ సంగతి కూడా తెలియదు. ఏమిటో సెలవీయి మిత్రమా!"

"అమ్మా, నాన్న లేరు..."

"ఆ సంగతి పనిగట్టుకుని నువ్వు చెప్పాలిట్రా! నువ్వు మీ ఆవిడకే పుట్టావని నాకు తెలియదూ?"

"మాటలు మర్యాదగా రానియ్యి..."


"మర్యాద..." పళ్లు కొరుకుతూ వచ్చి చక్రం కాలర్ పట్టుకున్నాడు, అటు, ఇటు ఊపాడు.

"ఒరేయ్! ఒక్కసారి ఆ విద్యార్థి జీవితం గుర్తుకు తెచ్చుకోరా! యెంత దర్జాగా, యెంత నిస్వార్థంగా, యెంత ప్రేమగా బ్రతికామో! తెలియని ఆప్యాయత, ఆత్మీయత ఉండేవి. యెందుకురా ఇంత స్వార్థం పెంచుకున్నావ్! యెంత సంపాదించినా, యెన్ని లక్షలున్నా పట్టెడు అన్నమే తింటాంరా. ఒకే జత బట్టలు ఒకేసారి వేస్తాంరా."

"కట్టిపెట్టరా నీ వేదాంతం!" అతని చేతులు దులపరించాడు చక్రం విసురుగా.

"ఈరోజు కాదురా, లక్షలున్నా 'బాగున్నావా!' అని పలుకరించే దిక్కులేనినాడు, ఒంటరివాడవయినవాడు తెలుస్తుంది ఆత్మీయుల అవసరం, వస్తాను..." చర, చర బయటికి వచ్చేశాడు. అతని మనసు అల్లకల్లోలమయిపోయింది.

[ఇంకా వుంది]



'కుమార రాజా'లో ఒక దృశ్యం

జి. వి. జి. పేజీ

బిజీ హాస్యనటుడు మాడా

మాడా ఇప్పుడు ఎంత బిజీగా వున్నారంటే– ఆయన్ని ఏ స్టూడియోలోనో తప్ప, ఇంటి దగ్గర పట్టుకోవడం చాలా కష్టం. అయినా, ఒకసారి ఇంటి దగ్గరే ప్రయత్నించి చూద్దామనిపించి, డైరెక్టర్స్ కాలనీలోని ఆయన ఫ్లాట్‌కు వెళ్ళా. ట్రాన్సిస్టర్ వింటూన్న ఆయన పెద్దకూతురు వి. అనూరాధ "నాన్నగారిప్పుడే దేవీ ఫిలిమ్ ప్రొడక్షన్స్ 'కేడీ నెంబర్–1' షూటింగ్‌లో పాల్గొని వచ్చారు. ఆ చిత్రానికి ఈవేళే ప్రారంభోత్సవంకదా?" అంది. "ఆ ట్రాన్సిస్టర్‌లో బేటరీ వేసి చాలాకాలమైందా?" అన్నాను. "సౌండ్ బాగానే వుందే!" అందా అమ్మాయి అమాయకంగా. "అబ్బే – అందుకుకాదు. ఎప్పుడో నా చిన్నతనంలో చూసిన పాత సినిమా పాట వినిపిస్తూంటేనూ ... విజయవాడ కేంద్రమా?" అన్నాను. "అవునండి," అందా అమ్మాయి నా జోక్‌కు నవ్వుకుంటూ. ఇంతలో మాడా వచ్చారు "బావా! ఎప్పుడు వచ్చితివీవు?" అంటూ. ఫిలిమ్ జర్నలిస్టుగా ఈ పాతికేళ్ళలో నాకు దక్కింది – కొందరు ఆప్యాయతతో నన్నిలా వరసలుపెట్టి పిలవడం "ఎలా వుందేమిటి మీరు కొన్న కారు?" అని అడిగా. "పాత కారు ఎన్ని ముప్పతిప్పలు పెట్టాలో అంతా పెట్టింది. రిపేరీకయిన ఖర్చులు దాని కొన్న ఖరీదును మించాయి. పక్కన షెడ్‌లో పారేశాను," అన్నారు. "దాన్ని వెంటనే అమ్మేసి, ఆ వచ్చిన డబ్బుతో మాంచి బాల్‌పాయింట్ పెన్ ఒకటి కొనుక్కోండి," అని నవ్వుతూ అంటూ, ఆయన నటిస్తూన్న చిత్రాల లిస్టు అడిగా. "సింహబలుడు, ప్రేమ – పగ, కేడీ నెంబర్–1, లాయర్ విశ్వనాధ్, శివరంజని, మరో సీత కథ, అనుకున్నది సాధిస్తా, వియ్యాలవారి కయ్యాలు, తీర్థయాత్ర, పచ్చబొట్టు, తుఫాన్ మెయిల్, ఆడదంటే అలుసా, గౌరమ్మా నీ మొగుడెవరమ్మా, ఏడడుగుల అనుబంధం, లంబాడోళ్ళ రాందాసు, భవానీ ఆర్ట్ పిక్చర్స్, లక్ష్మీ ఫిలిమ్ కంబైన్స్ వారి కొత్త చిత్రాలు, త్వరలో ప్రారంభం కాబోయే జగపతివారి ముద్దుల కొడుకు..." అంటూ తెలియజేశారు – మధ్య మధ్య ఆయన మరచిపోయినవాటిని పెద్దమ్మాయి గుర్తుచేస్తూండగా. "ఎన్నయ్యాయి, బావా? 18 కదూ? గుడ్! సంఖ్యా శాస్త్రం ప్రకారం ఒకటి ప్లస్ ఎనిమిది–9 నా లక్కీ నెంబరు. 8 నాకు అచ్చిరాదు," అన్నారు.

న్యూమరాలజీ మీద కొందరికి విపరీతమైన నమ్మకముంది. నెంబర్ 8 మాజీ కేంద్ర మంత్రి రాజ్‌నారాయణ్‌కు లక్కీ నెంబరట. అంచేత, మంత్రి పదవిని అలంకరించిన కొంతకాలానికి తన ఇంటి పాత నెంబర్ 9ని 8కి మార్పించుకున్నారట. ఫలిత మిప్పుడేమిటో అందరికీ తెలిసిందే.

ప్రేమ - పగ

భుజంగం : ఒరే గంటయ్యా, గంటయ్యా!

గంటయ్య : ఏంటండీ! నన్నలా పిలవ్వొద్దని ఎన్నిసార్లు చెప్పాను? ఇప్పుడు నా పేరు గంటేశ్వరరావు.

భుజ : ఏడ్చావ్! అయినా, వంట చేసేవాడివి నీకు వేషమేమిట్రా?... ఒరే! ఎంత పొగర్రా? నువ్వు నా ముందు కూచుంటావట్రా, గాడిదా?

గంట : తప్పేముందిలెండి. ఇద్దరం ఒకే జాతి కదా? మీ సీక్రెట్ నాకు తెలుసు. నా వీక్‌నెస్ మీకు తెలుసు. ఒక అయిదువేలిలా పారేయండి.

భుజ : ఏమిట్రా నీ ధీమా?


గంట : హరేరామ శాలువా ... అదేనండి – ఆరోజు తగలెయ్యమనిచ్చారే! తగలేసే టైము లేక దాచేశాను. తమరెప్పుడు డబ్బులివ్వకపోతే అప్పుడది బయటపడిపోతుంది. తమరు లోపల కెళ్ళిపోతారు.

భుజ : ఎవరన్నా పెద్దమనుషులొస్తారు. లేచి లోపలికెళ్ళు. అడిగిన డబ్బిస్తాను.

బి. వి ప్రసాద్ దర్శకత్వంలో ఎం. బాలయ్య సమర్పించే ''ప్రేమ – పగ'' వర్ణ చిత్రంలో మురళీమోహన్, సత్యనారాయణ, బాలయ్య, ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య, మాడా, మిక్కిలినేని, సత్యేంద్రకుమార్, సారథి, సావిత్రి, లత, రూప పాత్రధారులు. అప్పలాచార్య మాటలు, ఎస్. రాజేశ్వరరావు సంగీతం, ఎస్. ఎస్. లాల్ ఛాయ, వీరప్ప కూర్పు, కుదరవల్లి నాగేశ్వరరావు శిల్పం, రెడ్డి కాళిదాసు నిర్వహణ గల ఈ చిత్రానికి అలపర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు నిర్మాతలు.

ఓంప్రకాష్‌కు చుక్కెదురు !

ఆ మధ్య ఒక చిత్రం షూటింగ్‌లో పాల్గొనడానికి లండన్ వెళ్ళిన కేరెక్టర్ ఆర్టిస్ట్ ఓంప్రకాష్ ఒకనాటి సాయంత్రం షికారుకని తన బసనించి కాలినడకన బయలుదేరాడు. ఒకచోట కారులో వస్తూన్న ఓ చక్కని చుక్క అతన్ని చూడగానే హఠాత్తుగా బ్రేక్ వేసింది. అంతే... అతనివంక నిమిషంపాటు అలాగే చూస్తుండిపోయింది. తర్వాత చిరునవ్వు విసిరింది. ఓంప్రకాష్ ఒళ్ళు పులకరించింది. తను బయలుదేరిన వేళావిశేషం అంత దివ్యంగా ఉందని తనను తాను అభినందించుకుంటూ, తను కూడా మందహాసం చేశాడు. ఆమె వెంటనే కారు తలుపు తెరిచింది. తాను నిజంగా నక్కతోక తొక్కివచ్చి ఉండాలనుకుంటూ, పరుగున వెళ్ళి ఆమె పక్కన కూర్చున్నాడు. అతన్ని ఓ హోటల్‌కు తీసుకెళ్ళి, ఆమె విందు ఇచ్చింది. ఇంతలో ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. ''కారం తిన్నారేమిటి ?'' అన్నాడు ఓం. ''కాదండి. నన్ను పెంచి పెద్దచేసి, మొన్నీమధ్యనే కన్ను మూసిన మా తాతయ్య అచ్చం మీలాగే ఉండే వారు'', అనేసరికి ఓంప్రకాష్‌కు కూడా దాదాపు దుఃఖం వచ్చినంత పనైంది.



'రాధాకృష్ణ'లో ఒక దృశ్యం

ఓంప్రకాష్‌కు ఏ చిత్రంలోనైనా తన పాత్ర నచ్చకపోతే, ''అది చాలా చక్కని పాత్రే అనుకోండి. దానికి నేనేమాత్రం సరిపోను. న్యాయం చేయలేను కూడా'' అంటూ తన అనంగీకారాన్ని అంత ఘనంగా తెలియజేస్తూంటాటట.

* జి. వి. జి. పేజీ *



'రిక్షా రాజీ'లో చంద్రమోహన్

అభిరుచులు ఎదిగాయా ?

''మంచి కథ, మంచి పాత్ర ఉంటే శోభన్‌బాబుకేం ? మల్లెపూవు చిత్రంలో అంతటి వేషం దొరికింది గనుకే తన సత్తా చూపించాడు.'' రాజమండ్రి స్టేషన్‌లో ఇలా ఇద్దరు మాట్లాడుకోవడంలో అత్యుక్తి ఏమీ లేదనిపించింది. ఇటీవల నేను పర్యటించిన తెనాలి, విజయవాడ ప్రాంతాలలో కూడా ఈ చిత్రం గురించి ఇటువంటి అభిప్రాయమే విన్నాను. ఇతర భారీ బాక్సాఫీస్ హంగులు లేకపోయినా — చక్కని కథ గల చిత్రాల పట్ల మక్కువ ప్రజలకు ఎప్పట్నించో ఉంది. భారీ తారాబలం లేకపోయినా తక్కువ బడ్జెట్‌లో తీసిన మంచి కథాబలం గల చిత్రాలు ఇటీవల విశేషాదరణ పొందిన విషయం సర్వ విదితమే. మరో గమనింపదగిన విషయ మేమిటంటే — వికృత రూపం దాలుస్తున్న అసభ్యత, అశ్లీలతలాంటి అవాంఛనీయ ధోరణులు, ద్వంద్వార్థ స్ఫోరకములైన సంభాషణలు, పాటలు పట్ల ప్రజానీకానికి జుగుప్స క్రమేపీ పెరుగుతూండడం.

ఈ మధ్యనే గుంటూరులో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీమతి జమునా రమణరావు ఇటువంటి చవకబారు చిత్రాలను బహిష్కరించవలసిన బాధ్యత ప్రేక్షకులదే అని ఉద్ఘాటించారు. ''ప్రేక్షకులలో మార్పు రావాలి. వాళ్ళ అభిరుచులలో మార్పు రానిదే మంచి చిత్రాలు రూపొందడం జరగవు. ఇష్టంలేని చిత్రాన్ని చూడవద్దనే స్థాయికి ప్రేక్షకులు ఎదగాలి. సినిమాలు వాస్తవిక దృక్పథంలో రూపొందడానికి ప్రజలు ఆందోళన చేయాలి,'' అని సూచించారు డాక్టర్ అక్కినేని.

ఒక హిందీ చిత్రంలో ఒక వనితను దాదాపు నగ్నంగా చూపిన సన్నివేశానికి అసమ్మతిగా జూలై 9న పునే నగరంలో యువతుల నుంచి వృద్ధ నారీమణుల్ల వరకు తీవ్రంగా ఒక నిరసన ప్రదర్శన జరిపారు. కుళ్ళిపోయిన సమాజ వ్యవస్థను ఒక దిష్టిబొమ్మగా చేసి, ఆ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్ వరకు ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ ఆ దిష్టిబొమ్మను తగలబెట్టారు

స్వేచ్ఛావిపణి వెర్రితలలు వేస్తున్న చలన చిత్రాలలో పెచ్చుమీరిపోతున్న అశ్లీలతపట్ల ఉద్యమం ప్రారంభించి, చలన చిత్రాల తీరుతెన్నులు సంస్కరించడంలో నిర్మాణాత్మకమైన కృషి చేస్తున్న తెనాలి క్లాసికల్ ఫిలిమ్ సొసైటీ గురించి ప్రత్యేకంగా ఇక్కడ పేర్కొనక తప్పదు. దాని వ్యవస్థాపకులు, స్థానిక ప్రముఖ వైద్యులు డాక్టర్ సి. దక్షిణామూర్తిగారు అటు రోగులలో అనారోగ్యాన్ని నివారిస్తూ, ఇటు చలన చిత్రాలలోని అనారోగ్యకరమైన అశ్లీలతను బాపుతూ — ప్రేక్షకులలోను, చలనచిత్ర పరిశ్రమలోను ఉన్నత భావాలను, సాంప్రదాయాలను, అభిరుచులను పెంపొందించడానికి చాలా కాలంగా కృషి చేస్తున్నారు జూలై 23న ఈ క్లాసికల్ ఫిలిమ్ సొసైటీ పంచమ వార్షికోత్సవ సందర్భంగా 'సీనియర్ సముద్రాల స్మారక ఉత్తమ గేయ రచయిత' అవార్డును డాక్టర్ దాశరథికి, ''చిల్లర దేవుళ్ళు'' చిత్ర దర్శకుడు శ్రీ టి. మాధవరావుకు 'బి. ఎన్. రెడ్డి స్మారక ఉత్తమ దర్శకత్వ' అవార్డును ఇచ్చారు. 'గూడవల్లి రామబ్రహ్మం స్మారక ఉత్తమ జర్నలిస్టు' అవార్డు నాకు దక్కడం ''ఆంధ్రపత్రిక'' పాఠకుల ఆశీస్సుల ఫలితమే.

ఎం. ఎస్. విశ్వనాథం గాన వినోదం

''చో దర్శకత్వం వహించిన 'మహ్మద్ బిన్ తుగ్లక్' తమిళ చిత్రంలో నేను 'అల్లా అల్లా' అని అల్లామీద పాడిన భక్తి గీతాన్ని మన దేవాలయాల ఉత్సవాల్లో సైతం మన హిందువులు కోరి నాచేత పాడించి తరిస్తుంటారు,'' అని తెలియజేశారు సంగీత దర్శకుడు ఎం. ఎస్. విశ్వనాథన్ ''సింహబలుడు'' చిత్రం రీరికార్డింగ్ సందర్భంలో. ''ఇంకో తమాషా... చో దర్శకత్వం నెఱపిన మరో తమిళ చిత్రం 'ఉన్మయే ఉన్ విలై ఎన్నా' (నిజమా — నీ విలువెంత)లో ఒక పాటను ఎస్. వి. వెంకట్రామన్ అనే గాయకునిచేత పాడించాలని నేనంటే, నేనే పాడాలని చో పట్టుపట్టారు. ఈ సమస్యా పరిష్కారానికి మేమిద్దరమూ చివరికి ఓ నిర్ణయానికి వచ్చి, చీటీలు వేశాం. తీసిన చీటీలో నా పేరే ఉంది. అంచేత, నేనే పాడక తప్పింది కాదు. కాని, ఆ తర్వాత చో వెల్లడి చేసిన రహస్య మేమిటంటే — ఆ రెండు చీటీలలో ఆయన నా పేరే రాశారట !'' అన్నారు విశ్వనాథన్.



ఎన్. టి. ఆర్., వాణిశ్రీలతో కె. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో డాక్టర్ డి. వి. ఎస్. రాజు సమర్పించే తిరుపతి ప్రొడక్షన్స్ ''సింహబలుడు'' సినిమాస్కోప్ వర్ణచిత్రానికి దాట్ల శ్రీరంగరాజు నిర్మాత.



'తాయారమ్మ—బంగారయ్య'లో ఒక సన్నివేశం


మన ఊరి పాండవులు

"కదిలిందయో — రథము కదిలిందయో
పాపాత్ములకు గుండె పగిలిందయో
పుణ్యాత్ముల పంట పండిందయో!"

పై కొసరాజు గీతం రసవత్తరంగా చిత్రీకరింపబడిన "మన వూరి పాండవులు" వర్ణ చిత్రం లొకేషన్‌కు యిటీవల కొందరు పాత్రికేయులను ఆహ్వానించారు జయకృష్ణ మూవీస్ వారు. రాజమండ్రికి ఆరు మైళ్ళ దూరంలో వున్న వేమగిరి మెట్ట మీద నిలుచొని చుట్టూ చూస్తే, ఆ ప్రకృతి రామణీయకతకు ఎవరైనా పరవశత్వం చెందుతారు. ఇక బాలుమహేంద్ర కెమెరా పనితనంతో, డైరెక్టర్ బాపు ఆర్టిస్టిక్ టచ్‌తో ఆ ప్రకృతి మరింత శోభాయమానంగా తెరమీద కనిపిస్తుందనడంలో సందేహంలేదు. "మన రాష్ట్రంలోనే వున్నాయండీ మంచి సీనరీలు. ఔట్‌డోర్ షూటింగ్‌లకు ఏ దూర ప్రదేశానికో వెళ్ళనక్కర్లేదు," అంటూ ఈ చిత్రాన్ని సమర్పించే హీరో కృష్ణంరాజు ఈ చిత్ర కథను టూకీగా వివరించారు. "ఆ గ్రామంలో పెద్దదొరగా చెలామణి అయ్యే ఒక మోతుబరి, ఆయన అనుచరుడు కన్నప్ప కలిసి కాని పనులెన్నో చేస్తూ, కావలసినవన్నీ జరిపించుకుంటూంటారు. వారి దురాగతాలు, దుండగాలు భరించలేక ఆ గ్రామంలోని యువకశక్తి విజృంభిస్తుంది. ప్రజ్వరిల్లిన చైతన్యంతో ఐదుగురు యువకులు — ఆ దుర్మార్గుల దుష్కృత్యాలను అరికట్టి, ఆ గ్రామానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సుఖశాంతులను ప్రసాదిస్తారు," అంటూ పై పాట సన్నివేశాన్ని విశదీకరించారు ఈ చిత్రంలో సరికొత్త పాత్రను ఎంతో నైపుణ్యంతో పోషిస్తున్న కృష్ణంరాజు. ఇంకా మురళీమోహన్, రావుగోపాలరావు, కాంతారావు, రమణమూర్తి, అల్లురామలింగయ్య, ప్రసాద్‌బాబు, సారథి, శోభ, హలం, జయమాలిని, ఝాన్సి, శాంతిశ్రీ, లక్ష్మీదేవితో పాటు ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన చిరంజీవి, భానుచందర్, భాస్కర్, నూతన తారలు గీత, సుమంగళి ఈ చిత్రం ద్వారా పరిచయం గావింపబడడం మరో విశేషం. జూన్ 29 ఉదయం గుమ్మళ్ళదొడ్డి కొండపైన ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ బొమ్మూరు, దోసకాయలపల్లి, కడియం, నిడిగట్లు, వేమగిరిగుట్ట వగైరా రాజమండ్రి పరిసర ప్రాంతాలలో నిర్విరామంగా సాగి, ఆగస్టు 2న పూర్తయింది. "ఎండ వున్నా లేకపోయినా షూట్ చేసేస్తున్నారు బాలుమహేంద్ర. రషెస్‌ను ప్రసాద్ కలర్ లాబ్‌లో వేసుకొని చూస్తే, అదిరిపోయాం. అంత గొప్పగా వచ్చింది రిజల్టు. ఇక, మహదేవన్‌గారు ఎంతగా విజృంభించారో మా పాటలు వింటే మీకే తెలుస్తుంది," అన్నారు ఈ చిత్ర నిర్మాత జయకృష్ణ. యు. వి. సూర్యనారాయణరాజు నిర్వహణలో రమణీయంగా రూపుదిద్దుకుంటూన్న ఈ చిత్రానికి ముళ్ళపూడి వెంకటరమణ రచయిత. ఆత్రేయ, కొసరాజు పాటలు రాశారు. భాస్కరరాజు శిల్ప దర్శకుడు. కూర్పు : రామచంద్రయ్య.




'నాలుగ ఎందర్లో'లో ఒక సన్నివేశం



ఇతర హీరోలతో రంగనాథ్

హీరో రంగనాథ్ ఇటీవలే పోరూర్ సోమసుందరం వీధిలోని విజయనిర్మల భవంతికి ఎదురుగావున్న మేడలోకి మారారు. (నెం. 1). "లాయర్ విశ్వనాథ్"లో ఎన్. టి. ఆర్. తో, "ముద్దుల కొడుకు"లో ఎ. ఎన్. ఆర్. తో, "ముత్తైదువ"లో కృష్ణతో, "రామబాణం"లో శోభన్‌బాబు, కృష్ణంరాజులతో, "ప్రేమ్ కహానీ" ఆధారంగా భవానీ పిక్చర్స్ నిర్మించే చిత్రంలో శ్రీధర్, మురళీమోహన్‌లతో నటిస్తున్నారు. పూర్తయిన చిత్రాలు : "లవ్ మేరేజ్, ప్రేమ చేసిన పెళ్ళి, నవ్వుతూ బ్రతకాలి, మనిషిలో మనిషి, రత్తాలు — రాంబాబు." నిర్మాణంలో వున్న ఇతర చిత్రాలు : "రామచిలక, ప్రియబాంధవి, కిలాడీ మొనగాడు, ధర్మం దారి తప్పితే" వగైరా. రంగనాథ్ సరసన నటిస్తున్న హీరోయిన్‌లు : వాణిశ్రీ, విజయనిర్మల, జయచిత్ర, దీప, సంగీత, కాంచన, జయంతి, జయలక్ష్మి, ఉషాచౌదరి. ఇవి కాక చక్రవర్తి దర్శకత్వంలో నామ శేషగిరిరావు నిర్మించే చిత్రంలోనూ, పి. సాంబశివరావు దర్శకత్వంలో నవతా ఎన్. కృష్ణంరాజు నిర్మించే చిత్రంలోనూ నటించనున్నట్లు తెలియజేశారు రంగనాథ్.



'శ్రీరామ పట్టాభిషేకం'లో రామారావు

సంక్షిప్త చిత్ర వార్తలు

★ జూలై 20 నుంచి ఆగస్ట్ 15 వరకు ఒకే షెడ్యూల్‌తో పూర్తయిన టి. వి. ఫిలిమ్స్ ''ఏది పాపం, ఏది పుణ్యం'' వర్ణ చిత్రానికి రాజమండ్రి, కడియం, మాధవరాయుడుపాలెం వగైరా చోట్ల చిత్రీకరణ జరిగింది. చంద్రమోహన్, మాధవి, నూతన్‌ప్రసాద్, సరోజ, విజయభాను, గెస్ట్‌లుగా గిరిబాబు, కె. విజయలం, సారథి పాల్గొన్నారు. గోపీ సంభాషణలకర్త. ఆయనతోపాటు కొసరాజు, దాశరథి రాసిన గీతాలకు సత్యం బాణీలు కూర్చారు. ఛాయాగ్రాహకుడు : పాచూ. కూర్పు : సి. హెచ్. సుబ్బారావు. నిర్వహణ : కె. బాబూరావు, కె. పద్మాకరరావు. నిర్మాత : కె. మహేంద్ర. సమర్పణ : త్రిపురమల్లు వెంకటేశ్వర్లు. దర్శకత్వం : కె. వాసు

★ ''శివరంజని'' చిత్రం ద్వారా దాసరి నారాయణరావు పరిచయం చేస్తున్న సుభాషిణి దర్శక నిర్మాత వి. బి. రాజేంద్రప్రసాద్ త్వరలో ప్రారంభించే జగపతి పిక్చర్స్ ''ముద్దుల కొడుకు''తో పాటు శ్రీధర్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో భరణీ రెడ్డి నిర్మించే చిత్రంలో నటిస్తుంది. భరణీ చిత్ర బానర్‌లో తయారయ్యే ఈ చిత్రంలో లత, నారాయణరావు, నరసింహరాజు ఇతర పాత్రధారులు. మాటలు : వసంతకుమార్. సంగీతం : ఇళయరాజా. ఛాయ : బాలకృష్ణ.

★ కె. సత్యం, కూర్పు, దర్శకత్వంలో కె. తాతాజీ నిర్మించే ఉమాదేవి పిక్చర్స్ తొలి వర్ణచిత్రంలో కమలహాసన్, మురళీమోహన్, శ్రీదేవి, సత్యప్రియ, మోహన్‌బాబు, రమాప్రభ, పి. ఆర్. వరలక్ష్మి, లక్ష్మీకళ, డి. బ్రహ్మయ్య తారాగణం. రచన : వీటూరి. సంగీతం : చక్రవర్తి. ఛాయ : సాయిప్రసాద్. సహదర్శకుడు : మేడిశెట్టి అప్పారావు.

★ తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఉపకార్యాలయం జూలై 20న హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని ఒక భవంతిలో ప్రారంభమైంది. తాత్కాలిక పథకమైన స్వరాష్ట్రంలో తయారయ్యే చిత్రాల కిచ్చే సబ్సిడీని నిలిపివేస్తున్నట్లు డాక్టర్ చెన్నారెడ్డిగారు ప్రకటించారు.

★ కార్లోవీవరీలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో మృణాళ్‌సేన్ దర్శకత్వంలో ఎ. పరంధామరెడ్డి నిర్మించిన ''ఒక ఊరి కథ''కు ప్రత్యేక బహుమతి లభించింది.

'శంకర్—సైమన్—సలీమ్'లో మంజుల



★ అక్టోబర్ 6న విడుదలయ్యే తిరుపతి ప్రొడక్షన్స్ సినిమాస్కోప్ వర్ణ చిత్రం ''సాహసవంతుడు''లో ఎన్. టి. ఆర్. సరసన కథానాయికలుగా వాణిశ్రీ, శ్రీవిద్యతో పాటు చంద్రకళ కూడా నటిస్తోంది. కె. బాపయ్య దర్శకుడు. కె. విద్యాసాగర్ నిర్మాత.

★ విశ్వప్రసాద్ రచన, దర్శకత్వంలో భగవాన్ ప్రొడక్షన్స్ నిర్మించే థ్రిల్లర్‌కు ''కిలాడీ మొనగాడు'' అని, వీటూరి రచన, దర్శకత్వంలో ఎ. శ్రీరామ్‌రెడ్డి నిర్మించే సరస్వతీ ఆర్ట్ పిక్చర్స్ చిత్రానికి ''ధర్మసత్రం'' అని పేర్లు పెట్టారు.

★ రాజా శ్రీధర్ దర్శకత్వంలో శ్రీమతి టి. జె. రాజారెడ్డి నిర్మించే శుభోదయా ఆర్ట్ పిక్చర్స్‌వారి చిత్రం పేరును ''అన్నా చెల్లెలు'' నుంచి ''ఈ కాలం కథ''గా మార్చారు.


★ కె. ఎస్. ఆర్. దాస్ దర్శకత్వంలో సురేంద్ర, వాసిరెడ్డి సినిమాస్కోప్‌లో నిర్మించే సురేంద్ర ఆర్ట్ పిక్చర్స్ ''ఎవడబ్బసొమ్ము'' వర్ణ చిత్రంలో కృష్ణ, శ్రీప్రియ, సత్యనారాయణ, జానకి ఆదిగాగల వారుంటారు. త్రిపురనేని మహారథి రచయిత. రాఘవులు సంగీత దర్శకుడు. పుష్పాల గోపీకృష్ణ ఛాయాగ్రాహకుడు. రామలింగేశ్వరరావు శిల్ప దర్శకుడు. సెప్టెంబర్‌లో షూటింగ్ ప్రారంభమై, డిసెంబర్‌లో పూర్తవుతుంది

★ నన్నపనేని సుధాకర్ త్వరలో ప్రారంభించే లఘుబడ్జెట్ వర్ణ చిత్రంలో మురళీమోహన్ హీరో. సెప్టెంబర్‌లో షూటింగ్ ప్రారంభం.

★ పర్వతనేని సాంబశివరావు దర్శకత్వంలో సత్యనారాయణ, సూర్యనారాయణ నిర్మించే సత్య చిత్ర వారి 5వ చిత్రం ''లారీ డ్రయివర్''కు జూలై 26 ఉదయం విజయా గార్డన్స్‌లో తొలి పాట ధ్వనిముద్రిక చేయబడింది. హీరోయిన్ జయప్రదకు హీరో కృష్ణ లారీ డ్రయివింగ్ నేర్పే వేటూరి గీతం ''లారీలప్పా లారీలప్పా... ఒప్పులకుప్పా, చక్రం తిప్పా...తిప్పలు చెప్పాలా''ను బాలసుబ్రహ్మణ్యం, సుశీల పాడారు. ఈ స్కోప్ వర్ణ చిత్రానికి ముళ్ళపూడి రచయిత, మహదేవన్ సంగీత దర్శకుడు, వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు, ఎస్. కృష్ణారావు శిల్ప దర్శకుడు, కోటగిరి గోపాలరావు కూర్పరి.

★ బండి కృష్ణారావు దర్శకత్వంలో ప్రియదర్శిని క్రియేషన్స్ వారు ''వందేమాతరం'' అనే చిత్రాన్ని కొత్త నటీనటులతో నిర్మిస్తున్నారు.


★ యమధర్మరాజుగా సత్యనారాయణ నటించే సత్పురుషా ఫిలిమ్స్ ''రాధా మాధవ్'' వర్ణ చిత్రం నిర్మాత డాక్టర్ ఎ. రఘురామరెడ్డి దర్శకత్వంలో ఏడు రీళ్ళకు పైగా పూర్తయింది. మోహన్, దీప, గిరీష్ కార్నాడ్ ప్రభృతులు పాల్గొనే ఈ చిత్రం అక్టోబర్ నుండి ఆంగ్లంలో కూడా తయారౌతుంది. ఛాయ : బాలుమహేంద్ర. శిల్పం : గోఖలే. సంగీతం : వైద్యనాథన్. కూర్పు : భక్తవత్సలం. సహకార దర్శకుడు : పి. జనార్ధనరెడ్డి. నిర్మాణ నిర్వహణ : డాక్టర్ ఆర్. ఎం. ధనుంజయన్, ఎ. జగన్మోహన్‌రెడ్డి, బి. యె. రమణారెడ్డి.



తప్పక చూడండి!
ప్రతి పాటకు
ప్రతి మాటకు
అన్ని థియేటర్లలో
కరతాళధ్వనులు!
ఆంధ్ర దేశమంతటా
జేజేలు
అందుకుంటున్న
చిత్రం!
సమతి
ఆర్ట్స
మల్లెపూవు
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాతలు
వి.ఆర్.యాచేంద్ర
కె.చటర్జి
సంగీతం:
చక్రవర్తి
దర్శకత్వం
వి.మధుసూదనరావు
శ్రీఫిలింస్
VEEKAY

.....సంక్షిప్త చిత్ర వార్తలు.....

★ కొమ్మినేని శేషగిరిరావు కథ, దర్శకత్వంలో ఏడిద నాగేశ్వరరావు, ఆకాశం శ్రీరాములు, నిర్మించే ''తాయారమ్మ — బంగారయ్య'' వర్ణచిత్రంలో ఎప్పుడూ నవ్విస్తూ, నవ్వుతూ, సంసారంలో పెల్లుబికే సమస్యలను తీర్చిదిద్దే ఆదర్శ జంటగా ప్రధాన పాత్రలలో జానకి, సత్యనారాయణ, ఇతర ముఖ్య భూమికలలో చంద్రమోహన్, రంగనాథ్, రాజబాబు, అల్లు రామలింగయ్య, మాడా, శరత్‌బాబు, జి. ఎస్. ఆర్. మూర్తి, సంగీత, మాధవి, ఛాయాదేవి నటిస్తున్నారు. తొలి షెడ్యూల్ నెల్లూరు పరిసర ప్రాంతాలలో జూలై 1 నుండి 11 వరకు జరిగింది. రెండవ షెడ్యూల్ భాగ్యనగర్ స్టూడియోలో జరుగుతుంది. మాటలు : జంధ్యాల. సంగీతం : చక్రవర్తి. ఛాయ : భాస్కరరావు. గీతాలు : ఆత్రేయ. కూర్పు : అంకిరెడ్డి. నిర్వహణ : పృథ్వీరాజ్



'శభాష్ గోపీ'లో వరలక్ష్మి, కాంచన

★ జి. సి. శేఖర్ దర్శకత్వంలో అడుసుమిల్లి లక్ష్మీకుమార్ నిర్మించే తృతీయ చిత్రం ''అతనికంటె ఘనుడు''కు ఇటీవల ఏర్కాడులో కృష్ణ, జయప్రదలపై రెండు పాటలు చిత్రీకరించబడ్డాయి ఈ స్కోప్ కలర్ చిత్రం అనంతరం మారుతీ ప్రొడక్షన్స్ సెప్టెంబర్ 16న ప్రారంభించి 40 రోజుల షూటింగ్‌తో పూర్తిచేసే నాలుగవ చిత్రం ''శివకేశవులు''లో మురళీమోహన్, చంద్రమోహన్, సుభాషిణి, జయమాలిని ఉంటారు. రచన : సత్యానంద్. గీతాలు : ఆత్రేయ. సంగీతం : చక్రవర్తి. ఛాయ : కన్నప్ప. శిల్పం : రాజేంద్రకుమార్. కూర్పు : కోటగిరి గోపాలరావు. నిర్వహణ : జాస్తి. దర్శకత్వం : జి. సి. శేఖర్.

★ చైతన్య చిత్ర ఇంటర్నేషనల్ వారి చిత్రానికి ''మా భూమి'' అని పేరు పెట్టారు.

★ జి. వి. ఆర్. పిక్చర్స్ ద్వితీయ చిత్రం ''రామదండు''లో హీరో కృష్ణ పుత్రుడు వి. రమేష్ ప్రధాన పాత్రధారి వీరి తొలి చిత్రం ''శభాష్ గోపీ''లో పాల్గొనే యూనిట్‌లోని వారందరితోపాటు రచనా విభాగంలో మహారథి ఉంటారు.

హైద్రాబాద్ సినిమా

లక్ష్మీ ఫిలిం కంబైన్స్ కొత్త చిత్రం

జులై 31 సోమవారం ఉదయం అన్నపూర్ణా స్టూడియోస్ ఆవరణ కళకళలాడుతూంది. తమ మొదటిదయిన మూడవ చిత్రం ప్రారంభోత్సవం జరుపుతున్న లక్ష్మీ ఫిలిం కంబైన్స్ అనూరాధ, శ్రీనివాసరావు 'రండి రండి' అని ఆహ్వానించారు. ఒడ్డూ పొడుగుతో చూపరుల దృష్టిని యిట్టే ఆకట్టుకునే దిట్టమైన ఒక యువకుడు — పేరు విజయకుమార్ అని తర్వాత తెలిసింది — లోనకు తీసుకువెళ్లారు.

అక్కినేని వచ్చి ఆదరంగా పలకరించి వెళ్లారు. కొంతసేపటికి వచ్చారు ముఖ్యమంత్రి చెన్నారెడ్డి. ఆయనచేత కూడా దేవుని పటం ముందు కొబ్బరికాయ కొట్టించి, మద్రాసు నుంచి తెచ్చిన నిలువెత్తు మల్లెపూల దండలు వేసి, సుముహూర్తం వేళకు కామెరా స్విచ్ ఆన్ చేయించారు నిర్మాత, దర్శకుడు.

ముదురు నీలపు రంగు జీన్ క్లాత్ పాంటు, బుష్ షర్టు, మెడకు ఎర్రని మఫ్లరు, నోట బీడీతో కొరకొర చూస్తూ అనుచరుణ్ణి 'గణపతీ ఏమిట్రా హడావిడి,' అని అక్కినేని అడిగే ఒక బిట్టు తొలి షాట్‌లో తీయబడింది.

ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెనుకటితరం నాయిక, అనూరాధ తల్లి చిత్రజల్లు కృష్ణవేణి పర్యవేక్షించారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రానికి దర్శకత్వంతోపాటు కథ, చిత్ర కథ, మాటలు కూడా దాసరివేనని వేరే చెప్పనక్కర్లేదుకదా. కామెరా — కె. ఎస్. మణి. పాటలు — వేటూరి సుందరరామమూర్తి, దాసం గోపాలకృష్ణ. సంగీతం — జి. కె. వెంకటేశ్. కళ — నాలి. కూర్పు — బాలు.

ప్రధాన పాత్రధారిణులు — లత, జయచిత్ర. ఇతర పాత్రధారులు — మురళీమోహన్, ప్రభాకరరెడ్డి, మోహన్‌బాబు, అల్లురామలింగయ్య, మాడా వెంకటేశ్వరరావు, కె వి. చలం వగైరా.

ఈస్ట్‌మన్ కలర్‌లో వుండే ఈ చిత్రం దాసరి తీస్తున్న మూడవ సినిమాస్కోప్ చిత్రం. అక్కినేనితో తీస్తున్న రెండవ చిత్రం.

ప్రథమ షెడ్యూలు 14 రోజులలో వేటూరి వ్రాసిన 'రవివర్మకే అందని ఒకే ఒక అందానివో,' దాసం వ్రాసిన 'ఉప్పుశాప, పప్పుశారు' పాటలు కూడా చిత్రీకరించబడతాయని దర్శకుడు చెప్పారు.

దాసరి దర్శకత్వంలో ఇదివరకు 'చిల్లరకొట్టు' పెట్టిన జయచిత్ర ఈసారి 'టీ అంగడి' నడుపుతుంది.

యమదూతలు

'క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్,' అన్నది ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన అనుభవం.

'క్షణక్షణముల్ సినిమాల వృత్తముల్' అన్నది తొలి తెలుగు అభ్యుదయ దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం అభిభాషణం.

హైదరాబాద్ లక్ష్మీ చిత్ర మూవీస్ చిత్ర నిర్మాణయత్నం చూస్తే ఈమధ్య నానుడి జ్ఞాపకం వచ్చాయి. చిత్ర నిర్మాణం అన్ని శాఖలలోనూ ప్రతిభ గల కొత్తవారికి అవకాశం ఇచ్చి అన్ని వర్గాల ప్రేక్షకులకూ నిరపాయమైన నిక్షేప కాలక్షేపం సమకూర్చే చిత్రం తీయాలనే ఆసక్తితో, కళానురక్తితో ఆరంభించారు ఈ సంస్థను ఆర్. నరసింహారావు, టి. సూర్యమణి. తొలుత కథ, చిత్ర కథ, దర్శకత్వం — జి. వి. ప్రభాకర్, మాటలు—సముద్రాల సుధాకర్, సంగీతం — సత్యం, కామెరా—పి. గోపాల్, కూర్పు—సురేంద్రనాథరెడ్డి అని వెల్లడించారు. చిత్రం పేరు 'పున్నమిరాత్రి' అన్నారు. సాధకబాధకాలవల్ల ఆ బృందం, ఆ పేరు మారిపోయాయి. తర్వాత ఎం. దేవేంద్రనాథ్ డైరెక్టరు, కొప్పిశెట్టి రచయిత అనీ, చిత్రం పేరు 'ఆమె పిలుస్తోంది' అనీ అన్నారు. అదీ ఒనగూడి రానందున ఇప్పుడు విక్టరీ విజన్‌తో కలిసి 'యమదూతలు' అనే చిత్రం తీయటానికి సమకట్టారు.

ఈ చిత్రానికి మూలకథ టి. వి. సత్యనారాయణది. చిత్ర కథ, దర్శకత్వం — కృష్ణకిశోర్, ఛాయాగ్రహణం — విజయ్, మాటలు — కృష్ణమోహన్, పాటలు — ఆత్రేయ, సంగీతం — సత్యం, కళ — బి. ఎన్. కృష్ణ, నృత్యం — శీను, కూర్పు — కందసామి, పబ్లిసిటీ — రవి, నిర్మాణ నిర్వహణ — భరద్వాజ.

నటీనటవర్గం — విజయలలిత, దీప, కవిత, కాంచన, రాజసులోచన, జయమాలిని, మురళీమోహన్, ప్రభాకరరెడ్డి, సత్యనారాయణ, శరత్‌బాబు, త్యాగరాజు, రావు గోపాలరావు, కన్నడ ప్రభాకర్.

ఆగస్టు 6, 7, 8 తేదీలలో పాటల రికార్డింగుతో నిర్మాణ కార్యకలాపం ప్రారంభం అయింది.

మన మహాత్ముడు

శాంత్ ఆర్ట్స్ పేరిట తీసిన 'మన మహాత్ముడు' చిత్రానికి తుది మెరుగులు దిద్దుతున్నారు నిర్మాత, దర్శకుడు అయిన పేపూరి నారాయణస్వామి. తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం సరికొత్త టెక్నీషియన్లను, నటీనటులను పరిచయం చేస్తుంది. కథ వ్రాసినవారు గోపాల ప్రమీల. మాటలు, పాటలు — నిర్మాత స్వామి, నటుడు విద్యాసాగర్. ఛాయాగ్రహణం — రామకృష్ణారావు, సంగీతం — రేడియో గాయకుడు ఎం. చిత్తరంజన్, కళ — పి. కె. మూర్తి, కూర్పు — రవి రమణ, మోహన్.


ఇక నటీనటులు — జయప్రభ, కృష్ణవేణి, విజయశ్రీ, జయశీల, స్వరూప, మధు, జయగోపాల్, వేణుగోపాల్, రాజహంస, సుభాన్ వగైరా


ఎం. ఎస్. శర్మ

పెరుగుతున్న సంవత్సరాలు


కాల్షియం-శాండోజ్® సంవత్సరాలు







ఇప్పుడు అమోఘమైన కొత్త ప్యాక్‌లో దొరుకుతోంది. ఎక్కువ ధర పెట్టకుండానే.



పాప పుట్టక ముందు నుంచే, పాప యొక్క పళ్ళూ ఎముకలూ రూపొందటం మొదలెడతాయి. పసిదనం నుంచీ, పెరిగే వయస్సులో అంతా కూడా కాల్షియం ఎంతో కీలకమైనది.

మీ పాపకి గనక, పెరుగుతూన్న ఏ దశలోనైనా సరే, అవసరమైనంత కాల్షియం లభించకపోతే, తరవాత ఎంత యిచ్చినా ప్రయోజనం ఉండదు. అందుకే నేడే మీ పాపకు కాల్షియం-శాండోజ్ యివ్వడం మొదలెట్టండి. రోజుకు నాలుగు కాల్షియం-శాండోజ్ బిళ్ళలు గనక యిస్తే, అవి పెరిగే దశలోని ఆ ఏళ్ళలో అత్యవసరమైన కాల్షియంను సమకూర్చి, గట్టిపళ్ళనూ, పటిష్ఠమైన ఎముకలనూ రూపొందిస్తాయి. విటమిన్ సి, డి మరియు బి[12]తో పటిష్ఠం చేయబడిన కాల్షియం-శాండోజ్ బిళ్ళల్లో, పిల్లలకి యిష్టమయ్యే రుచిగల వెనీలా సువాసన ఉంది.

కాల్షియం-శాండోజ్ స్విట్జర్‌లాండ్‌లోని శాండోజ్ వారు రూపొందించినది, ప్రపంచంలోని అత్యుత్తమమైన కాల్షియం.

కాల్షియం-శాండోజ్®

గట్టిపళ్ళు, పటిష్ఠమైన ఎముకల కోసం

SANDOZ

daCunha/CS/25D TEL/Rev.



కొత్త వెలుగు

వి. కళ్యాణి సోమరాజ్

తెల్లవారి చాలాసేపే అయినా మబ్బులు దట్టంగా పట్టివుండటంవలన సూర్యుని వెలుగు కిరణాలు భూమిని ఇంకా తాకటంలేదు. దానికితోడు ఒకటే గాలి. సీత దొడ్లో నిన్ననే పుట్టిన కోడెదూడను పట్టుకోవాలని ప్రయత్నించి ఆయాసపడుతోంది.

''నీకెందుకే సీతా ఆ పని. నిండునెలలొచ్చిన దానివి అలా పరిగెత్తకూడదమ్మా!'' రంగమ్మ ఆవుకు మేత వేస్తూ మెల్లగా కోడలిని మందలించింది.

''అదికాదత్తా! అరగంట నుంచి చూస్తున్నాను, లోపల కట్టేద్దామని. అందితేనా. అసలే చలిగాలి ఎలా వీస్తోందో, నిన్న పుట్టిందో లేదో అప్పుడే ఎంత పొగరో'' ఒగరుస్తూ అంది. సీత మాటలకి రంగమ్మ నవ్వేస్తూ ''ఔను. సీతా! రేపు నా మనవడు కూడ ఇంతే. ఇలాగే పెరడంతా పరుగులు పెడుతూ నిన్ను తప్పించుకుంటూ చెంగు చెంగున గంతులేస్తాడు కాబోలు. ఇంక ఎంతలే, రేపో, మాపో!'' భావిని గురించిన సుందర స్వప్నంలో తానుండగానే, సీత ''అమ్మో!'' అంటూ వేసిన కేకతో ఈ లోకానికి వచ్చి ''ఏమైందే సీతా!'' అంటూ పరుగున దగ్గరకు వెళ్ళింది.

సీత మెల్లగా అక్కడే వున్న అరుగుమీద చతికిలపడి ''ఏం లేదత్తా! ఒక్కసారి నరాలన్ని ఎలాగో లాగినట్లైంది''. ''నే చెప్తే వినవు కదా! గిలకలా తిరుగుతావు. అసలే అర్భకపు పిల్లవు. ఈ పనులన్నీ నీకెందుకు పోయి పడుకో... అన్నట్టు వాడుంటే కాస్త సిలు. ఎందుకైనా మంచిది మంత్రసానికి ఓ కబురు పెడతాను.''

''ఆయనింట్లో లేరత్తా! పొద్దున్నే చేనుకాడి కెళ్ళారు. ఒకసారి చూసివస్తానంటూ!''

''మర్చేపోయాను. చెప్పే వెళ్ళాడు నాకు చంద్రం. రేపో మాపో కోతలు కూడ వచ్చిపడతాయి ఈ గాలి చూస్తే ఇలా వుంది పండిన పంట ఇంటికొచ్చేవరకు బెంగే కదా!'' రంగమ్మ తనలో తాను అనుకుంటూ పని చేసుకుంటోంది.

సీత అలాగే కూర్చుని, ఇందాకటి నుంచి తనని ఆటలు పట్టించి పెరడంతా తిప్పిన లేదూడ అమాయకంగా ఆత్రంగా తల్లిదగ్గర చేరి పాలు తాగుతుంటే మైమరచి చూస్తూ వుండిపోయింది పశు పక్ష్యాదుల్లో ఏ తేడాలున్నా మాతృత్వపు ప్రేమ ఒకటే!

సీత దురదృష్టమో, అదృష్టమో ఊహ తెలిసేసరికి తల్లిని, తండ్రిని పోగొట్టుకొని మేనత్త అయిన రంగమ్మ ఇల్లు చేరింది. అన్న కూతురు, అనాథ అని ఆపేక్షతోనే కడుపులో పెట్టుకుని పెంచింది సీతను. తను, చంద్రంతోపాటే అమ్మాని పిలిచేది సీత. సీతంటే, చంద్రానికి ఆరాధనతో కూడిన ప్రేమ. సీతకు అలాగే చిన్నప్పటినుంచి చంద్రం మాటలకు వినయంగా తలూపుతూ భక్తితో చూసుకునేది. సినిమాల్లోలాగా గట్లమ్మట, పుట్లమ్మట పాటలు పాడుకుంటూ తిరక్కపోయినా తమ ప్రేమలను మనసుల్లోనే భద్రంగా నిల్పుకొని పెంచుకొంటూ వచ్చారు. ''పిల్లనిస్తామంటూ'' చంద్రానికి సంబంధాలు రాకపోలేదు. డబ్బుకోసం ఆశ పడి పరాయివాళ్ళను చేసుకొని సీతకు అన్యాయం చేయాలని ఏ కోశాన లేదు రంగమ్మకి! ''సీత కేదో సంబంధం చూసి ముడి పెట్టేసెయ్యి. అన్ని వేలు కట్నం వదులుకుంటావా!'' అంటూ ఉచిత సలహాలు ఇచ్చిన వాళ్ళూ లేకపోలేదు. ఆలశ్యం అమృతం విషం అనుకుంటూ సీతకు పదహారు నిండగానే మంచి ముహూర్తం చూసి తన తాహతుకు తగినట్లు పెళ్లి జరిపించింది. భర్త అనురాగంతో, అత్త ఆపేక్షతో కొత్త జీవితంలో రెండో వసంతంలోకి అడుగు పెట్టింది సీత! తమందరి ప్రేమని పంచుకోటానికి మరొక ప్రాణి త్వరలో రాబోతోందని తెలిసిన రోజున ఆ ఇంట్లోవారి ఆనందానికి అంతు లేదు. మనవడిని ఎప్పుడు ఎత్తుకుందామా అన్న ఆరాటం అత్తలో, కొడుకుని ఎప్పుడు చూసుకొని మురిసిపోదామా అన్న ఆత్రుత భర్తలో చూసి సీత

మనసులో కొడుకుని తలుచుకొని ఉప్పొంగిపోయేది. తనలా కాకుండా తన బాబుకి ఎంతోనుంచి ప్రేమ లభ్యం కాబోతోంది. ఇందరి హృదయాల్లోను ఓలలాడుతూ హాయిగా పెరుగుతాడు తన బాబు!

* * *

చంద్రం ఒక చేత్తో పంచెను ఎత్తిపట్టుకొని చేను గట్టెమ్మట మెల్లగా నడుస్తున్నాడు. జివ్వున చలిగాలి వుండి వుండి మొహం తడిమిపోతొంది.. కంకులు బంగారం పులుముకున్నట్లు బరువుగా ఊగుతూ మెరుస్తున్నాయి. కొంత చేను కోతలు అయిపోయి 'కుప్ప' కోసం ఎదురు చూస్తోంది. సీతను పెళ్ళిచేసుకున్నాక కౌలు చేస్తున్న పొలంకాక రెండు ఎకరాలు సొంతానికి కొనుక్కున్నాడు చంద్రం. తండ్రి చేతిక్రింద పనిచేసిన చంద్రానికి వ్యవసాయం ఇప్పుడు కొట్టిన పిండే! తండ్రిపోయాక వున్న ఆస్థి రెట్టింపు చేసాడేకాని అమ్మిలగిలెయ్యలేదు. అయితే చంద్రం ఏ పని చేసినా తల్లిని సంప్రదించాల్సిందే! ఎందుకో తగని నమ్మకం అతనికి తల్లిమీద! తల్లి ఎప్పటినుంచో పోరుతోంది ఇల్లు పాతదైంది కాస్త పెంకు కప్పించమంటూ. సీతకు పాపం పెళ్ళి అయ్యాక ఒక్క నగంటూ ఏమి చేయించలేదు. ఇది కావాలంటూ ఏది నోరు తెరిచి అడగదు. ఈసారి సీతకు మెళ్ళోకి గొలుసు చేయించాలి. పంట మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు చంద్రం! అతన్ని ఊరిస్తున్నట్లు ఊగుతోంది చేను. ఈ రోజు మబ్బులు ఇలా పట్టకపోతే మిగిలిన చేనుదికూడా కోతలు అయిపోయివుండేది కదా అని మనసులో కాస్త బెంగ పడ్డాడు చంద్రం.

''అదేమిటి చంద్రయ్యా! సన్నగా తుప్పర కూడా పడుతోంది అటుపడిఎటు వెళ్ళిపోతున్నావ్'' తెలిసిన రైతు పలకరింపుకి చంద్రం కొద్దిగా ఉలిక్కిపడి మెల్లగా వెనక్కుతిరిగాడు.

''రామయ్యా! చూశావా. చేను. ఈసారి ఎకరానికి ఇరవైరాలినా ఆశ్చర్యం లేదు కదూ! కాని ఇప్పుడేంటి ఈగాలి కొంపదీసి ఏ ముసురులోకో దింపదుకదా!''

''ప్చ! ఏం చేస్తాం చెప్పు బొత్తిగా దైవాధీనం బ్రతుకులు మనవి. ప్రతి ఏడు చూస్తున్నాంగా! పంట కల్లంలో వుండగానే ఏగాలిదేముడో వాన దేముడో ఎత్తుకు పోవటం. ఈ ఏడాదైనా పిల్లదానికి పెళ్ళిచేసి నా బరువు తీర్చుకోవచ్చు కదా అని గంపెడంత ఆశ పెట్టుకున్నాను. మరి ఏటి అవుద్దో సూద్దాం! చేను మంచి పొగురు మీదుంది. ఎన్నాళ్ళైంది ఇలాపండి''

ఇద్దరూ మాట్లాడుకుంటూ వూళ్ళోకి వచ్చేశారు. చినుకులు కాస్త ఉధృతం అయ్యాయి. దానికి తోడు గాలి.

సీత వసారాలోనే ఎదురైంది.

''సీతా! కాస్త తుండు ఇలా అందుకోవే! దీని తస్సదీయ ఈరోజే రావాలా వర్షం...''

''అదేమిటి అలావున్నావ్.'' సీత చేత తుండు అందుకుంటూ మొహం తుడుచుకుంటూ అదోలా వున్న సీత వాలకం చూస్తూ అన్నాడు.

''ఏంలేదు బావ. బాగానేవున్నాను.'' అంది నీరసంగా!

''ఏంబాగురా. పొద్దిటినుంచి దాని మొహం వాడిపోయేవుంది. ఎందుకైనా మంచిది కాస్త ఆ మంత్రసానమ్మకి కబురుసేద్దామంటే నువ్వులేవు.''

''అలానే వెళ్ళివస్తాలే! కాస్త వర్షం వెలవనీ..'' అంటూ పెరటివైపు వెళ్ళాడు చంద్రం. గడ్డి మేస్తూ అమాయకంగా సేదతీర్చుకుంటున్న ఎడ్లని, గేదలను, ఆవుని వరుసగా ఆదరంగా తడిమిచూసి నాటి ముందు గడ్డి సరిగ్గా చూసి ఆ తరువాతగాని ఇంట్లోకి అడుగు పెట్టలేదు.

''మళ్ళీ ఎక్కడికిరా వెళ్ళావు... అన్నం పెట్టాను...'' ఇంట్లోకి చంద్రం రావటం గమనించ కుండానే అనేసింది.

''చప్పున పెట్టేయ్!'' అంటూ పీటవాల్చుకున్నాడు. ఇల్లంతా తడి తడిగా చికాగ్గావుంది.

''ఏమ్మా ఇల్లంతా కురుస్తున్నట్లుందే!''

''ఆ, కురవదురా! ఎన్నాళ్ళనుంచి పోరుతున్నాను. కాస్త పెంకు వేయించరా అని. మీనాన్న వున్నప్పుడు ఎప్పుడో వేసిన కొంప. కురవదామరి.''

''ఈ ఏడాది ఇక ఆపనమ్మా! అప్పోసొప్పో చేసి డాబా యెయ్యటం కాయం''

టప్‌టప్‌న పొలుగా చినుకులు వచ్చి చంద్రం కంచంలో పడ్డాయి.

''సీత అన్నం తిందా!'' కంచం పక్కకి జరుపుకుంటూ అన్నాడు.

''ఆం ఏం తింటం. ఆకల్లేదంటూ నాలుగు మెతుకులు కొరికి వెళ్ళింది. దాని వరస

వనితలకు మనవి

కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలు —సం.

చూస్తుంటే ఇయ్యాల్లో రేపో కాన్పు వచ్చేలాగానే వుంది.''

''అబ్బ ఈ వర్షంలోనా...''

''బాగుందిరా. మంచి రోజు చూసి పుడతారేటి పిల్లలు'' కొడుకు అమాయకత్వానికి నవ్వు వచ్చింది రంగమ్మకి.

రాను రాను వర్షపు జోరు హెచ్చుతూవుంది వర్షానికి సహాయంగా నేను వున్నానంటూ గాలి! వాతావరణ వివరాలు అరగంట కొకసారి అందిస్తూనే వుంది చంద్రం పక్కనున్న ట్రాన్సిస్టర్! కాని ఎప్పుడు తగ్గు మొఖం పడుతుందన్న వార్త మాత్రం చెప్పలేదు. సీత మంచంలో దుప్పటి కప్పుకొని ముడుచుకు పడుకొంది. రంగమ్మ కేం చేయాలో తెలియక కోడలి పక్కనే కూర్చుని వికృతంగా వీస్తున్న గాలి వంక చూస్తోంది.

ఆ రోజు ఐదు గంటలకే పొద్దువాలిపోయింది. గాలి, వర్షం అలసిపోకుండా తమ పని తాము చేసుకుపోతున్నాయి. క్రమేణ ఇంట్లో పొడిజాగ లేకుండా తడిసిపోయింది. ఇక్కడ కురుస్తోందని, అక్కడికి వెళ్తే మెల్లగా అక్కడా చినుకులే! నెత్తి మీద దుప్పట్లు కప్పుకొని పొడిజాగ కోసం వెతుక్కుంటూ ముగ్గురు భయం భయంగా చూస్తుండిపోయారు.

''అత్తా! ఈ వర్షం ఇంక తగ్గదా!'' సీత వుండబట లేక అడిగింది.

''తగ్గిపోతుందే! దానికి మాత్రం విసుగెయ్యదు. నీకు ఆకలేస్తోందా! బొత్తిగా పొద్దుట కూడ ఏమి తినలేదు...''

''వద్దత్తా! నాకేం తినాలనిలేదు. ఈ వర్షం తగ్గిపోతే బాగుండ్ను...''

ఉన్నట్టుండి పశువుల పాకనుంచి గొడ్ల అరుపులు భయంకరంగా విన్పించసాగాయి.

''అమ్మా గొడ్లెందుకో అరుస్తున్నాయి. ఒకసారి వెళ్ళి చూసివస్తాను...'' చంద్రం ఖంగారుగా లేచాడు.

''వద్దురా! ఈ చీకట్లో ఎక్కడికి వెళ్ళటం. కాస్త తగ్గనీ అందరం వెళ్ళి చూద్దాం'' రంగమ్మ భయంగా అంది.

''అదేమిటమ్మా! మనం తలుపులన్ని వేసుకొని కూర్చుని వాటి సంగతి పట్టించుకోకపోతే ఎలా.'' చంద్రం అయిష్టంగా వుండిపోయాడు.

మనసులో అమాయకమైన ఆ జీవుల గతి ఏమిటన్నట్లు బాధగా వుంది. మరొకవంక మహాలక్ష్మిలా అలంకరించుకున్న చేను ఈ గాలివాన కేమౌతుందో! అన్న బెంగ! ఇంతలో ఫెళ్ళుమంటున్న పెద్ద శబ్దం కలగా పులగంగా పశువుల అరుపులు... ఇక చంద్రం నిలవలేకపోయాడు. ''పాక కూలుతోందేమో! వాటిని విడిపించివస్తా!'' అంటూ దొడ్డితలుపు తీసుకొని పరుగుపెట్టాడు. అంతే! మరో నిముషంలో అమ్మా! అన్న చంద్రం కేకతోపాటు పాక పెద్ద శబ్దం చేసుకుంటూ కూలిపోయింది.

''బాబూ! చంద్రం...ఎందుకు వెళ్ళావురా'' గొల్లుమంది రంగమ్మ సీత కంతా అయోమయంగా అర్థం కాకుండా వుంది. కళ్ళు తిరుగుతున్నట్లు రంగమ్మ భుజంమీద తల వాల్చింది. ''అయ్యో తల్లీ! పదవే బయటకైనా పోదాం. ఇదికూడ కూలుతున్నట్లుంది'' అంటూ వాలిపోతున్న సీతను నడిపించుకుంటూ ఇల్లు వదిలింది రంగమ్మ! ఎక్కడ చూసినా నీరు. ఎన్నో మైళ్ళ వెనకాతల వున్న సముద్రం ఆ వూరివారిని పలకరించటానికి వూళ్ళోకి పరుగులు పెడుతూ వస్తోంది. జోరుగా వీస్తున్న ఆ ఈదురుగాలికి రాలి ఎగిరి పోకుండా సీతను రెండు చేతులతో చుట్టేసింది రంగమ్మ. ''చంద్రం'' ఏమైనాడు. చచ్చిపోయాడా!'' రంగమ్మ దుఃఖం ఆగటంలేదు. కాని ఆవిడ కంటినీరు ఆ నీటి ప్రవాహంలో ఎన్నోవంతు!

వుండి వుండి మెరుస్తున్న మెరుపులకు చెట్టేదో పుట్టేదో కన్పిస్తోంది. జనం అంతా గగ్గోలు పడుతూ, పోయిన ఆత్మీయుల కోసం ఏడుస్తూనే తమ ప్రాణాలైనా దక్కించుకోవాలన్నట్లు దిక్కుతోచక పరుగు పెడుతున్నారు. ఆ వూళ్ళో రామాలయం కాస్త ఎత్తుగా వుండి గట్టిగా వున్న గుడి! అందరికి ఆశ్రయం ఇవ్వగలిగింది. కాని ఆ కొంచెం దూరం వెళ్ళాలన్నా సాధ్యమయ్యేలాలేదు ఎవరికి! మనుష్యుల సహితం ఎగరేసుకుపోయే పెనుగాలి ఒకవైపు, పరవళ్ళు పెడుతూ ప్రవహిస్తున్న నీరు మరొకవైపు — మధ్యమధ్య మెరుపులతో వికృతంగా కురుస్తున్న వర్షం...

డాక్టర్ సలహాలు

వై. వి. ఎల్. — మద్రాస్

నా వయసు 17 సంవత్సరములు. నేను అన్నం తినిన వెంటనే విరోచనము అవుతున్నది. 2 గంటలకు ఒకసారి ఆకలి వేస్తున్నది.

★ దీనిని 'ఇంటస్టైనల్ హర్రీ' అంటారు. దీనికి 'బెలాడివాల్ రిటార్డ్' అనే మాత్రలు ఉదయం సగం, రాత్రి సగం వాడండి. మజ్జిగ ఎక్కువ తీసుకుంటే మంచిది.

ఎన్. ఎస్. ఆర్. — ఒంగోలు

నా వయసు 25 సం॥లు. 2 సం॥ల క్రితం వీపులో ఎడమ ప్రక్క నొప్పి వస్తే డాక్టరు 'టి. బి.' అని వైద్యము చేసారు. ఇప్పుడు గూడా కొంచెము నొప్పి వున్నది. మరల 'టి. బి.' వస్తుందా ?

★ 'టి. బి.' ఎముకకు వచ్చినపుడు పూర్తిగా మాననిదే వైద్యం నిలపకూడదు. ఇంజక్షనులు మాత్రలు కనీసం 1 సంవత్సరము విడవకుండా వాడాలి. తరచు 'ఎక్స్—రే' లు తీసి వైద్యులు వ్యాధియొక్క స్థితిని నిర్ణయించాలి. డాక్టరు వైద్యము నిలుపమనేదాకా మందులు వాడాలి వెన్నెముకకు 'టి. బి.' వచ్చినపుడు 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్ జాకెట్టు'లో పూర్తి విశ్రాంతి అవసరం.

వై. వి. కె. — తెనాలి

నాకు చాలా రోజులనుండి కళ్ళు మంటలుగా వుంటున్నాయి. ఒక్కోసారి నొప్పిగాగూడావుంటుంది.

★ వాతావరణంలో ఎక్కువ దుమ్ము వున్నప్పుడు, శరీరంలో 'రిబోఫ్లావిన్' అనే 'బి' విటమిన్ లోపించి నప్పుడు తరచూ ఇలా రావటం జరుగుతుంది. ప్రతిరోజూ 'ఆప్టెక్స్' 'ఐ' లోషన్‌తో కళ్ళు శుభ్రపరచుకోవటం, సగ్గుబియ్యం జావ 10 రోజులపాటు వరుసగా తీసుకోవటం, 'రిబోఫ్లేవిన్' మాత్రలు రోజుకి 2 వంతున 1 నెల రోజులు తీసుకుంటే తగ్గుతుంది.

ఎం. ఆర్. ఆర్. — నాగపూర్

మా అబ్బాయికి 6 సంవత్సరములు. అస్తమానమూ జలుబుచేస్తుంటే వైద్యులకు చూపించాము. వారు అవయవములన్నీ కుడి—ఎడమలు తారుమారయినవని చెప్పినారు. ప్రమాదమేమీ లేదన్నారు. ఏమైనా మందులు వాడాలా ?

★ శరీరంలో వున్న కొన్ని భాగములు కుడివైపున వున్నవి ఎడమ వైపున, ఎడమ వైపున వున్నవి కుడివైపుకి తారుమారవటం — శిశువు తల్లి గర్భంలో వుండ మూడు నెలల లోపలే జరుగుతుంది. దీనిని 'డెక్స్ట్రోకార్డియా' అంటారు. పిండము ఏర్పడిన దగ్గరనుండి ప్రసవం ఏర్పడే వరకు ప్రతి సెకండుకు శిశువులో జరిగే రసాయనిక భౌతిక మార్పులు అందరూ తెలుసుకుంటే మనం ఎందుకు వంకరలు లేకుండా పుట్టామా అని ఆలోచన తప్పకుండా వస్తుంది. ఏ లోపం లేకుండా పుట్టటం ఆశ్చర్యం గాని లోపం వున్నప్పుడు ఆశ్చర్యపడనవసరం లేదు. మీ బాబుకి మందులేమీ అవసరం లేదు.

టి. ఆర్. ఆర్. — మడికొండ

నా వయస్సు 28 సంవత్సరములు. నేను 'మయోపతీ'తో బాధపడుతున్నాను. ఇదివరకు బాగా నడవగలిగేవాడిని. ప్రస్తుతం కొంచెము దూరం గూడా నడవలేకపోతున్నాను. అన్నిరకాల వైద్యాలు చేయించుకున్నాను. ఏమీ ప్రయోజనం కన్పించలేదు.

★ మీకు డాక్టర్లు చెప్పిన విషయాలు నిజమైనవే. ఈ రోగం వచ్చినపుడు కొద్దిగా బలం రావటానికి చికిత్స చేయకలరుకాని రోగాన్ని అరికట్టటం చేయలేరు. ఎందువలనంటే ఈ రోగం పుట్టకతోనే 'జెనిటిక్' మార్పువల్ల వస్తుంది. ఏదైనా ఒక అంగములో లోపం అయితే నివారించటానికి ప్రయత్నించవచ్చుగాని ప్రతి అణువులోను ఇమిడివున్న 'జీన్సు'లలో మార్పులను తీసుకొనిరావటం యింతవరకు కనుగొనబడలేదు.

మీకు ఏ వైద్య శాస్త్రమైనా చెయ్యగలిగేది తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

వి. ఎస్. ఎస్. — హైదరాబాద్

నాకు 15 రోజులు జ్వరం వచ్చి తగ్గినది. ఇప్పుడు గుండెదడ, నీరసంగా వుంటోంది. నిద్ర రావటం లేదు.

★ జ్వరం వచ్చినపుడు పథ్యం పేరిట లంఖణాలు చెయ్యటం మనలో చాలా తీవ్రంగా వున్నది

శాస్త్రీయంగా జ్వరం వచ్చిన వారికి మామూలుకన్నా రెండింతలు 'కేలరీలు' శక్తి కావలసి వుంటుంది. మనం ఆహారం తీసుకోపోవటం వల్ల మామూలుగా రావలసిన 'కాలరీ'లు గూడా మన శరీరానికి రావు. జ్వరం తగ్గిన తర్వాత విపరీతమైన నీరసం రావటానికి ఇది ముఖ్య కారణం.

ఆహారాన్ని రోగానికి తగినట్లుగా తీసుకోవచ్చును. ఎక్కువ 'కాలరీ'లు వచ్చేటట్లుగా తీసుకోవాలి.

కె. ఎన్ ఆర్. — మచిలీపట్నం

న వయసు 45 సంవత్సరములు. 3 సం॥ల నుండి కొంచెము సేపు చదివితే కంటిచూపు మసకగా వుంటోంది. కళ్ళజోడు వాడుతున్నాను. కొన్ని రోజులయిన తరువాత మరలా అలాగే అయితే మూత్ర పరీక్షచేసి షుగర్ వున్నదని మందులు వాడమన్నారు. కళ్ళజోడు గూడా మార్చాను. అయినా అలాగే వున్నది.

★ వయస్సు పైబడుతున్న కొలది కంటిలోని 'లెన్సు' కొన్ని ప్రకృతిసిద్ధమైన మార్పులను చెందుతుంది దీనికి తోడుగా 'డయాబెటిస్' వున్నప్పుడు ఈ మార్పులు ఇంకా త్వరగా జరిగి కంటిలోపలి రక్తనాళాలు గూడా కంటిలోపలి పొరలకు రక్తము సరిగా సరఫరా చేయలేవు. అందువలనే ఇలా జరుగుతుంది.

'డయాబెటిస్' వున్నప్పుడు మందులు వాడటమే కాకుండా ఆహార పదార్థాలను మితంగా తీసుకోవటం, క్రొవ్వు పదార్థాలను మానటం చెయ్యాలి.

—డా॥ కె. వెంకటేశ్వరరావు

కొత్త వెలుగు

జారిపోతున్న సీతను గట్టిగా పట్టుకుంటూ ఇక నడవలేక ఆయాసపడుతూ చెట్టుకొమ్మ ఒకటి చేతికి చిక్కితే సీతను కాస్త ఆనించింది. మరుక్షణంలో తేలిగ్గావున్న కొమ్మ సీత వాలగానే జరిగి ప్రవాహంలో కొట్టుకు పోయింది. 'సీతా ! సీతా !' అంటూ రంగమ్మ దిక్కులేక పిచ్చిదానిలా పరుగు పెట్టబోయి ఏ లోతుగుంటలోనో కాలువేసి శాశ్వతంగా కూరుకు పోయింది.

ఎటు చూసినా నీరు ! అమాయకంగా ఏమి తెలియనట్లు ఏమి పట్టనట్లు పరుగులు పెడుతోంది జలదేవత ! ఆకలిగొన్న సింహంలా ప్రకృతి ప్రళయ తాండవం చేస్తోంది. ఇళ్ళు కూలుతున్నాయి. జనం చస్తున్నారు. గొడ్డూగోదా సంగతి చెప్పక్కర్లేదు. చెట్లు, చేమ వేళ్ళతోసహా కూలుతున్నాయి. నిన్నటి వరకు బంగారంలా మెరిసిన పంట నీటి పాలైంది. ఎన్నో కుటుంబాలు విచ్ఛిత్తంగా విడిపోయాయి. కొందరు చనిపోయి, కొందరు కొట్టుకు పోయారు. తల్లిదండ్రి లేని పిల్లలు, పిల్లలు పోగొట్టుకున్న తల్లిదండ్రులు, భార్యని పోగొట్టుకున్న భర్తలు, భర్తను పోగొట్టుకున్న భార్యలు ! విధి క్రూర వదనం వికటాట్ట హాసం చేస్తోంది !

సీతను మోస్తున్న కొమ్మ ప్రయాణం చేసి చేసి అడ్డుగా మరొక చెట్టు ఆపటంతో కదల్లేక ఆగిపోయింది. అవిరామంగా చేసిన ప్రకృతి ప్రళయ నృత్యం ఆపి విశ్రాంతి తీసుకొంది ఈ వింత చూద్దానికా అన్నట్లు సూర్యుడు పరామర్శించటానికి వచ్చాడు. సహాయ కార్యక్రమాలు ఆరంభమైయ్యాయి. కొంతమంది సేవా బృందం సీతను తొలగించి శిబిరం చేర్చారు. అయితే సీత కిదేమి తెలియవు.

సీత రెండో రోజున కళ్ళు తెరచి చుట్టూ చూసింది. తను ఏమైనా పీడకల కన్నదేమో ! అబ్బ ఎంత భయంకరమైన కల. అనుకుంటూ కళ్ళు ఎత్తి పరిశీలించింది అది కల కాదు. నిజమే ! అయితే తమవారంతా ఏమైనట్లు. తనెలా బతికింది ? అందర్నీ పొట్టన బెట్టుకున్న విధి తననిమాత్రం విడదీసి ఎందుకు బతికించింది ? ఎందుకింత కఠిన శిక్ష తనకు ? తన పాప ఏమైనట్లు తనను తాను చూసుకుంటూ అనుకుంది. తెల్లని దుస్తుల్లో వున్న నర్స్ గుడ్డల్లో చుట్టివున్న పసికందును సీత కందిస్తూ "మగబిడ్డ" అంది.

అన్ని బంధాలు తెగిపోయిన తనకు ఈ కొత్త బంధం ఏమిటి ? సీత కన్నీటి పొర మధ్య 'బాబు' మసక మసకగా కన్పించాడు. నీకోసం కలవరించిన నీ బామ్మ, నాన్న నిన్ను చూడకుండానే పోయారు. ఇక నా కెవరు మిగిలారు అనుకుంటున్న తరుణాన నువ్వు వచ్చావు. నవ్వాలో, ఏడవాలో అర్థం కావటంలేదు. "సీత బాబుని గుండెలకు అదుముకుంటూ బావురుమంది. ఏమి తెలియని పసివాడి నుంచి "చిరునవ్వే" సమాధానంగా వచ్చింది !

ప్రశ్నె పఠ

రామలక్ష్మి

పి హెచ్. వి. కె. — భీమవరం.

మీరు కూడా రంగనాయకమ్మగారి లాగా ఒక చక్కని సాహిత్య సామ్రాజ్యాన్ని ఎందుకు స్థాపించకూడదూ?

★ ఓపికా లేదు. చోరవా లేదు. రచించటం ఒక్కటే నా పరదా కాదు. స్థానికంగా నాకు అనేక సంస్థలతో సంబంధం వుంది. సంఘ సేవకు సంబంధించిన పని పాటలు వుంటాయి. అంచేత కుదరదు కూడా.

కబీర్ — అనంతపురం.

అమ్మా, మహంకాళీ, నీలాంటి ఆడదాన్ని చేసుకోడం వల్లనే భర్త బైరాగిలా తయారయి నట్టుంది.

★ అందమైన గెడ్డం, కొంగ రెక్కల్లాంటి కిందూరు ఖద్దరు దుస్తులూ బైరాగి చిహ్నాలయితే.. మరింక.. క...బీరు గారి భార్యని నాకు చూడాలని వుంది !!

కె. ఆర్. ఆర్. — పిఠాపురం.

అసలు ఏది అసభ్యత? ఏది అశ్లీలం? నిర్వచనాలు మీరు చెప్పారు వారిద్దాలి...

★ అంతేకదు మరి వాళ్ళిచ్చిన నిర్వచనాలతో విభేదించని విద్యాంతలు కోట్లు పెట్టి నిర్వచనాలు తెల్చాలి! వ్యక్తుల వ్యక్తిత్వాలను, సెన్సిబిలిటీస్‌ని న్యూనత పరిచేదేది అయినా అసభ్యమే. అశ్లీలమే సంఘంలో ఏ కొందరినో కించపరచడం, ఎద్దేవా చేయడం (ఇప్పుడు సినిమాలలో బ్రాహ్మణుని చూపిస్తున్నట్టు!) అసభ్యం అశ్లీలమే, మరి. మాటలతో పాటలతో, చేష్టలతో స్త్రీని మధ్యరూపున్న స్త్రీలని తక్కువచేసేటంటా వుండే పరిస్థితిని కల్పించడం అసభ్యం కాదా అశ్లీలం కాదా స్త్రీని పేపర్ [టిగ్గర్] గానో, సెక్సు సింబల్‌గానో, పడి వుండే సంగం వచ్చిన శరీరంగానో, శవంలాగానో చూపటం అశ్లీలం కాదా? అసభ్యం కాదా? మాటలతో, చేతలతో కించపరచడం. ఆమెపై అత్యాచారాలను వినోదంగా ప్రదర్శించడం.. అశ్లీలం అసభ్యం. ఇలా చెప్పాలంటే చాలా వుంటుంది. అయినా మీకు తెలియక కాదు గదా.. అడుగుతూంటే! తినేవారి సంస్కారం దబ్బుకి దాసోహం అయితే, చూసేవారి సంస్కారం.. వినోదానికి దాసోహం అవుతున్నప్పుడు.. ఏదీ అశ్లీలం అనిపించదు. ఏదీ అసభ్యం అనిపించదు ఎందుచేత? ఆ జరిగే అత్యాచారాలు తమ జాతి పట్ల కాదు కద !?

విజయ ఎస్. ఎమ్. — గుంటూరు.

స్త్రీ ప్రేమను పొందాలంటే ఏం చేయాలి?

★ ఆ స్త్రీ కూడా మిమ్మల్ని ప్రేమించాలి. లేకపోతే.. లాభం శూన్యం. ఆమె ప్రేమను పొందాలన్న తాపత్రయంలో మిమ్మల్ని మీరే చిన్నబుచ్చుకునే ప్రమాదం వుంది.

ఆర్. బి. ఎస్. — రాజమండ్రి.

సమాన హక్కులు కావాలంటున్నారు కదా మరి పెళ్ళి చూపులకు అమ్మాయే పెళ్ళి అబ్బాయిని ఎందుకు చూడకూడదు?

★ బెంగాలీ అమ్మాయిలు హాయిగా పెళ్ళి అబ్బాయిని చూసి వస్తారు! అలాంటి దేశాలన్నీ మన ప్రత్యేకతలు!

ఆదాప్. — కర్నూలు.

తమ హక్కుల కోసం వేదికలెక్కి ఉపన్యసించే స్త్రీల గురించి నాకు తెలిసిన ఒకామెప్పుడు స్త్రీలిలా ఉపన్యాసాలివ్వడం స్త్రీకి తగదు అంటూ విమర్శించింది. కామెంట్ ప్లీజ్.

★ డియర్ ఆదమ్! మీకు తెలిసిన అమ్మాయికి నీతో అప్పటి మాట్లాడే హక్కు వచ్చిందంటే అదెలా వచ్చింది? అడిగి చూడండి! ఇది వరా ద్దాలుగా పెగేస్తున్న స్త్రీ జాతిని తమ ధైర్యంతో సాహసంతో, పట్టుదలతో పోరాడి సాధించిన మహిళా మణుల సేవల ఫలితంగా వచ్చిందని చెప్పండి. లేకపోతే అవిడగారు వీధి ముఖం చూసి వుండదు. ఎందరెందరో మహామహులు సాధించి పెట్టిన హక్కులూ, వస్త్రాలూ.. యీనాటి "మీకు తెలిసిన" అతి తెలివి అమ్మాయిలు చాలా తేలికగా కొట్టి పారవేయగలరు.. కాల జ్ఞానం లేదు కనుక... ఎవరూ పూనుకోకపోతే యీ అమ్మాయికి విమర్శించే హక్కే వుండేది కాదు.

పి. ఎస్. ఎస్. — నరసారావుపేట

నేను బి. కాం చదువుతున్నాను. ఇంగ్లీషు తప్పులు లేకుండా మాట్లాడ్డం రాదు. ఏం చెయ్యాలి?. పేపర్లు చదవమని సలహాయిచ్చారండి. ఆ ప్రయత్నం ఫలించలేదు.

★ పేపర్లు పైకి చదవాలి. తప్పో ఒప్పో ధైర్యంగా మాట్లాడాలి. కొన్నాళ్ళకి అదే వస్తుంది.. బాగా మాట్లాడ్డం. అది పరాయి భాష. శాస్త్ర తప్పులు మాట్లాడినా ఫరవాలేదు.. ఉత్తరాది వాళ్ళ ఆంగ్లం మాట్లాడ్డం విన లేదా ?!

కె.పి.ఆర్. మంగళగిరి.


ఆడవాడుగాని మగవాడుగాని వివాహం చేసుకోనియెడల (జీవితాంతం ఒంటరిగా వుండిపోతే) వారు సంపూర్ణమైన వ్యక్తులు ఎందుకు కారు?

★ కారని ఎవరనగలరు ?...ఎవరి మీదా.. చివరికి తల్లిదండ్రులమీదా, అన్నదమ్ములమీదా, అక్కచెల్లెళ్ళమీదా కూడా ఆర్థికంగా ఆధారపడకుండా వుండగల్గితే..హాయిగా ఉండవచ్చును.

బి. బి. ఆర్. — లాలానగర్.

మీలాంటి వాళ్ళు వంట చేసుకోకుండా ఇలాంటి ఈ ఉద్యోగాలు ఎందుకండీ?

★ అంత దూరం వెళ్ళినా ఆంధ్ర పొలిమేర దాటలేనట్టుంది.. మీ బుర్ర! ఆడదానికి వంట చేయడమూ నామోషీ కాదు. ఉద్యోగం చేయడమూ నామోషీ కాదు. అలాంటి బాధలు మీలాంటి వాళ్ళు చూపు కలవాళ్ళకే..వంటపని ఆడపని అని ఉద్యోగం మగపని అని తప్ప లోకం చూస్తూ కూడా..సత్యాన్ని గ్రహించలేరు.





వంటలు

రొయ్యల పులావ్

కావలసిన వస్తువులు : సన్నబియ్యం 500 గ్రా, రొయ్యలు 700 గ్రా, కొబ్బరి కాయ 1, నెయ్యి 200 గ్రా, నిమ్మపండ్లు 2, జీడిపప్పు, పుదీనా, కొత్తిమీర, అల్లం, దాల్చినచెక్క, లవంగాలు, పసుపు, ఉప్పు తగినంత, పచ్చిమిర్చి10 కాయలు, వెల్లుల్లి పాయలు 5, ఉల్లిపాయలు 5, టొమాటోలు 2, పెరుగు 1 కప్పు.

తయారుచేయు విధానం : బిరుసుగా అన్నం వార్చి వుంచుకోవాలి. రొయ్యలు శుభ్రంచేసి వుంచుకోవాలి. పొయ్యి మీద దళసరి గిన్నెలో నెయ్యివేసి మసాలాసామాను, తరిగిన వుల్లి, వెల్లుల్లి, పచ్చిమిర్చిముక్కలు, టొమాటో ముక్కలు, నూరిన అల్లంముద్ద వేసి బాగా వేగనివ్వాలి పసుపు ఉప్పు వేసి రొయ్యలు కూడా వేసి వేగనిచ్చి పెరుగు వేసి మూత పెట్టాలి. సగం ఉడికిన తర్వాత అన్నంలో కలిపి సన్నని సెగపై వుడికించాలి. కొబ్బరికాయ నుండి పాలు తీసి అన్నంలో పోసి బాగా కలుపుతూ ఉడికిన తర్వాత నిమ్మరసం వేసి దింపుకోవాలి. ఇష్టమున్న వారు పెరుగు పచ్చడి చేసుకొని దీనితో కలుపుకొని తినవచ్చును.

— ఎమ్. సంధ్యాలక్ష్మి

గోధుమరవ్వతో కేక్

కావలసినవి :— గోధుమరవ్వ 1 కప్పు, పాలు 1 కప్పు, పంచదార ఒకటింపావు కప్పు, ఏలకులు 10, జీడిపలుకులు 10, చిన్న వేతి గిన్నెడు నెయ్యి.

చేయు విధానము :— గోధుమరవ్వ సన్నదిగా ఉండాలి. దోరగా వేయించి ఉంచుకోవాలి. జీడిపప్పును వేయించి చిన్నవిగా కత్తిరించాలి. వేయించిన రవ్వ, పంచదార, పాలు కలిపి కొద్దిగా నీరు చిలకరించి సన్నని సెగపై ఉంచాలి. కలుపుతు అడుగంటకుండా చూడాలి. గట్టిపడి గరిట కదలని సమయంలో వేడివేడి నెయ్యినిపోసి కలపాలి. గుల్లబారి మైసూర్‌పాక్‌లా ఉంటుంది. నెయ్యిరాచిన పళ్లెంలోకి వంపి ముక్కలుగా కోసి, వాటిపై జీడిపలుకులు, ఏలకులపొడి, చల్లాలి. నెయ్యి మాత్రం వేడిగానే ఉన్నది పొయ్యాలి సుమా. రెండు రోజులకన్న నిలువ ఉండదు.

పంచదారతో కేక్

కావలసినవి :— సన్నని గోధుమరవ్వ ఒకటిన్నర కప్పు, పంచదార ఒకటిన్నరకప్పు ఏలకులు, జీడిపలుకులు.

రవ్వని దోరగా వేయించాలి. రెండు కప్పుల నీరును, పంచదార, రవ్వను కలిపి సన్నని సెగపై పాకం రానివ్వాలి. పాకం గట్టిపడగానే, తగిన నెయ్యి పోసి, నెయ్యి రాచిన పళ్లెంలోకి వంపాలి. పైన ఏలకపొడి జీడిపలుకులు పేర్చి ముక్కలుగా కోయాలి. పాలు లేని సమయంలో ఈ రకంగా గోధుమ రవ్వ కేక్ తయారు చేయవచ్చు.

గోధుమరవ్వతో బెల్లవుండలు

కావలసినవి :— ముతక గోధుమరవ్వ 2 కప్పులు, బెల్లం రెండు కప్పులు, నువ్వులు 1 కప్పు, ఏలకులు 10, కొద్దిగా నెయ్యి.

చేయు విధానము :— రవ్వను నెయ్యివేసి దోరగా వేయించాలి. బెల్లం సన్నగా తరిగి అరకప్పు నీరుపోసి సన్నని సెగపై ఉంచాలి. గట్టి పాకం వచ్చేవరకు కలుపుతూ ఉండాలి. పాకం రాగానే, రవ్వ, నువ్వులు, ఏలకులపొడి వేసి బాగా కలపాలి. వేడిమీద చిన్న చిన్న ఉండలుగా చేసి చల్లారిన తరువాత డబ్బాలో పెట్టుకుంటే ఎన్ని రోజులైనా ఉంటాయి. పల్లి ఉండలయితే పిల్లలకు జబ్బు చేస్తాయి ఇవి ఎన్ని తిన్నా చేయవు ఏమి.

— పూర్ణ

ముల్లంగి ఆవకాయ

ముల్లంగి దుంపలు 1 డజను, ఆవాలు 50 గ్రా, నూనె అరలీటరు, ఉప్పు 4 లేక 5 టీస్పూన్లు, గసగసాలు, లవంగాలు, ఏలకులు తగినన్ని

ముల్లంగి దుంపలను శుభ్రంగా కడిగి, ఉప్పువేసిన నీటిలో బాగా నుడకబెట్టాలి. ఆ తరువాత ఈ దుంపలను చక్రాల్లాగ కోసి, తడి ఆరేటంత వరకూ ఎండలో ఆరబెట్టాలి. అటుపైన, ఈ ముక్కలను గసగసాలు, లవంగాలు, ఏలకులతోబాటుగా నూనెలో వేయించాలి. చివరగా, కాసింత పసుపు వేస్తే మంచిది. ఈ ఆవకాయ నిలువ వుంటుంది. తినడానికి రుచిగా వుండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా మంచిది.

— కె. సీత

అవీ...ఇవీ...అన్నీ

వడుస్తున్న గీతం

భావచిత్రాలు. రచన : శ్రీ నండూరి భాస్కర్. 12 పేజీలు. వెల నాలుగురూపాయలు. ప్రచురణ : విజయా పబ్లిషర్స్. లోటరీకట్ క్రాస్‌రోడ్డు, తణుకు (ప.గో. జిల్లా).

విదేశయానం

బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలలో ప్రదర్శనలు ఇవ్వడానికి యూరోపు బయలుదేరివెళ్తున్న ఒక సాంస్కృతిక బృందంతో కొఠారీ అండ్ కో (మదరాసు)లోని షేర్స్ విభాగంలోఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న శ్రీ డి. నరసింహదాసుకి కూడా ఆహ్వానం అందింది. లలితకళలపై మక్కువగల శ్రీ నరసింహదాసు చిన్నతనం నుంచీ కలకత్తాలో భరతనాట్యాన్ని, తర్వాత మదరాసు వచ్చి కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి మదరాసు, ఆంధ్రలలో పెక్కు ప్రదర్శనలిచ్చారు. ఈయన డి.జె. శర్మగారి ఆధ్వర్యాన ఉన్నారు. ఈ బృందం తిరిగి ఆగస్టులో స్వదేశం వస్తుంది.

శంకర్ ఫిలిమ్స్

చిన్న బడ్జెట్ చిత్రాలని, కొత్త నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక కళాకారులని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో విజయవాడలో "శంకర్ ఫిలిమ్స్" అన్న పంపిణీ సంస్థని స్థాపించినట్లు హైదరాబాదు అజంతా స్టూడియోస్ అధినేత శ్రీ రామకృష్ణారెడ్డి యిటీవల విజయవాడలో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వెల్లడించారు. శ్రీ కంచర్ల మాధవరావు మేనేజింగ్ పార్ట్‌నర్‌గా తాము నెలకొల్పిన ఈ సంస్థ ద్వారా "అగ్నిజ్వాలలో ఆడవాళ్లు" చిత్ర నిర్మాణం పూర్తయిందని తెలియజేశారు ★

హైదరాబాద్ నోట్ బుక్

శ్రీ హయగ్రీవాచారి పిలుపు :

ఉస్మానియా విశ్వ విద్యాలయం సోషియాలజీ విభాగం యీమధ్యనే జూలై 28, 29, 30 తేదీలలో "మేధావులు, యువకులు-సామాజిక పునర్నిర్మాణం" అనే విషయంపై గోష్టి జరిగింది. గోష్టికి సాంకేతిక విద్యాశాఖామంత్రి శ్రీ తిరుపంగం హయగ్రీవాచారి ప్రారంభోత్సవం జరుపుతూ, వరకట్నం కులతత్వం వంటి సాంఘిక దురాచారాలను నిర్మూలించడంలో యువతరం సహకరించాలని కోరారు. మూడవ నాడు సమాప్త్యుత్సవంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ జి. రామిరెడ్డి ప్రసంగిస్తూ, జాతీయలక్ష్యం సాధనవిషయంలో స్థూలంగా ఏకాభిప్రాయం కుదిరినప్పుడే సంఘ పునర్నిర్మాణం సాధ్యమన్నారు. దేశంలోని మేధావుల దృష్టి సమాజ పునర్నిర్మాణం వైపు పోలేదని, వారు సమాజంలోని తక్కిన వారి నుంచి వేరుపడి కపటం ధర్మంగా జీవిస్తున్నారని శ్రీ రామిరెడ్డి విచారం ప్రకటించారు. గోష్టి నిర్వాహకులు, ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాలు ప్రొఫెసర్ సి. లక్ష్మన్న, మున్నుగువారు ప్రసంగించారు. సోషియాలజీ రీడరు డాక్టర్ జి. విశ్వనాథం స్వాగతం చెప్పారు. లెక్చరర్ శ్రీ జి. వి. రాఘవేంద్రరావు ధన్యవాదాలు సమర్పించారు.

జనతాకు అప్రతిష్ఠ

ఒకవైపు కేంద్ర మంత్రివర్గంలో మల్లగుల్లాలు జరుగుతుండగా, రాష్ట్రంలో జనతాను అప్రతిష్ఠపాలు చేసే దుర్ఘటన జరిగింది. రాష్ట్ర విధాన సభనుంచి విధాన పరిషత్తుకు జరిగిన ద్వైవార్షిక ఎన్నికలలో జనతా అభ్యర్థులు ఇద్దరు ఎన్నిక కావలసివుండగా, ఒకరే ఎన్నికయ్యారు. రెండవ స్థానానికి ఇండిపెండెంటు అభ్యర్థి శ్రీ టి. పాంచజన్యం ఎన్నికయారు. జనతా విధాన సభ్యుల సంఖ్య 55. ఇద్దరు అవలీలగా ఎన్నిక కావచ్చు. కాని ఇండిపెండెంట్ అభ్యర్థి గెలిచాడంటే, జనతా సభ్యులు తమ పార్టీకి ద్రోహం చేశారనే కదా! డాక్టర్ చెన్నారెడ్డి వర్గంవారు ఎనమండుగురూ గెలిచారు. జనతావారిలాగే కాంగ్రెస్‌వారుకూడా తమ అభ్యర్థి శ్రీ లక్ష్మీ నారాయణ్ యాదవ్‌ను ముంచారు. పన్నెండు వోట్లకూ నాలుగే వచ్చాయి శ్రీ యాదవ్‌కు. క్రమశిక్షణ అనేది ఎక్కడా కనబడలేదు; విప్పులతో దెబ్బలతో వచ్చేదికాదు; మనసులో వుండాలి; నిశ్చయం తోడురావాలి.

అభినవ కళాసాహితి మహిళా విభాగం :

అలియాబాద్‌లో ఏడు సంవత్సరాలుగా సాహిత్య కళాసేవ చేస్తున్న అభినవ కళాసాహితి మహిళా

విభాగానికి రెడ్డిజనసంఘం హాలులో జూలై 16వ తేదీన ఆంధ్రా బ్యాంకి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు శ్రీ కె. వి. భాస్కరరావు ప్రారంభోత్సవం చేశారు. ఈ సమావేశానికి శ్రీ తిరుమల రామచంద్ర అధ్యక్షత వహించారు. "ఆంధ్ర సాహిత్యంలో హరిశ్చంద్రోపాఖ్యానము" అనే పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ పట్టం పొందిన వనితా మహా విద్యాలయ ఆచార్య శ్రీమతి వాసా ప్రభావతీశాస్త్రికి అభినవ కళాసాహితి సన్మానించింది. కార్యదర్శి శ్రీ బి. గౌతం బాబు సంచిక సమర్పణ చేశారు.

నాయనివారి సంస్మరణ :—

జూలై 20 వ తేదీన నాగార్జున నగర్ కాలనీలో కీర్తిశేషులు శ్రీ నాయని సుబ్బారావు సంస్మరణం కళాప్రపూర్ణ శ్రీ రావూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ప్రముఖ ప్రచారనాయకుడు శ్రీ కడియాల గోపాలరావు స్వాగతం చెప్పిన పిదప శ్రీ రావూరి, నాయని వారి కవితా మూర్తిని అపూర్వ వచనకవిత వంటి అధ్యక్ష వచనాలతో వివరించిన మీదట, శ్రీయుతులు తిరుమల రామచంద్ర, డాక్టర్ అంతటి నరసింహం, దాశరథి రంగాచార్యులు, మల్లిక్, శ్రీమతి ఎలమంచిలి శాయారమ్మ, ఏటుకూరి ప్రసాద్, డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం, నాయనివారి రచనలపై డాక్టరేట్ చేస్తున్న భూమయ్య ప్రసంగించారు. శ్రీ సతీశ్ అనే యువకుడు "నీ కీర్తి కిరీటాల కాంతిలో మమ్ము పయనించ నిమ్ము" అనే గేయం పాడారు. శ్రీ వీరమాచనేని ప్రసాద్ వందన సమర్పణ చేస్తూ, "అనుకోడానికి, అనడానికి, ఆచరణకు అంతరంలేని వాడు ఆయన. పదినిమిషాలు పలకరిస్తేనే పరిపూర్ణ మానవుడనే పూర్ణజ్ఞానం ఎదుటి వానికి కలిగించే వ్యక్తి ఆయన" అన్నారు.

కందాళ మృణాళిని :

తండ్రి తెలివితేటలు కుమారునికి రాకపోయినా కుమార్తెలకు వస్తుందంటారు సాంఘిక శాస్త్రజ్ఞులు. దీనికి మరొక ఉదాహరణగా కుమారి కందాళ మృణాళిని పేర్కొనవచ్చు. మృణాళిని సుప్రసిద్ధ విద్వత్కవి విమర్శకులు డాక్టరు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ దౌహిత్రి. మొన్నటి మే నెలలో జరిగిన



ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు ఎం. ఏ. పరీక్షలో సర్వ ప్రథమురాలుగా ఉత్తీర్ణ అయి బంగారు పతకం పొందింది. ఈమె తండ్రి పేరు శ్రీ పార్థసారధిశర్మ. తల్లి శ్రీమతి నాగమణి. మృణాళిని వయస్సు 21 సంవత్సరాలు.

ఉపశ్రుతి :—

"అబ్బ దోమలు మరీ మితిమీరి పోతున్నాయండీ" అన్నాడు ఒక హాస్యరచయితు నాతో. పక్కనే ఉన్న సోదరి కుమారి మంత్రిప్రగడ శేషుబాయి ఉన్నారు గదా. "మనదోమలను ఏమీ అనకండి సార్. వాటి కీర్తి ఢిల్లీ దాకా పాకింది. మొన్నను మా అన్నయ్యగారు ఢిల్లీ వెళ్లినప్పుడు 'ఎలావుంది మలకపేట, మంచపల్లింది దోమల పేట' అని కవితలో కుశలప్రశ్న వేశాడండీ!" అని, దోమలమీదికవిత చెప్పిన ఘనత సోదరి శేషుబాయి సోదరునికి ఎందుకు దక్కాలను కున్నాడేమో ఒక సంస్కృత పండితుడు అన్నాడు గదా. "అయ్యో" దోమ ఎప్పుడో సంస్కృతకవిత కెక్కిందండీ!

చక్రభ్రమణ కరత్వాత్
దుర్దృష్టి ర్నివారణీయత్వాత్
ప్రత్యంతభ్వేలనత్వాత్
మశకత్వాం మాధవం మన్యే.

అని మశకాన్ని మాధవునితో పోల్చాడండీ. అంటే "ఓ మశకమా నీకూ చక్రభ్రమణంవుంది. మాధవునికీ వుంది. నీవు చక్రాకారంగా గింగిరీలు కొడతావు. అతడు చక్రం తిప్పుతాడు. క్రోధ చూపులవారు మాధవుణ్ని చూడలేరు. నిన్ను క్రోధ చూపులు చూస్తే జనం దూరంగా పోతారు. నీదారి ఒకటుండగా మాధవుడు ప్రత్యంతాలు—వేదాంతాలలో విహరిస్తాడు—నీవు చెవులదగ్గర గుంయి మంటావు." అని. ఈ పంచెపంలో ఇదేనండీ గొడవ—మోసగాను నా మైనేరా మోహనూ.

— తిరుమల రామచంద్ర.

సైన్సులో సరదాలు

దడిగాడువానవిదిచ

— డాక్టర్. మహీధర నళినీమోహన్.

ఈ గారడీ చెయ్యడానికి 1. దళసరి కాగితం 2. నిమ్మకాయ 3. కలం 4. కొవ్వొత్తి కావాలి.


నిమ్మకాయ రసంతీసి ఒక గిన్నెలో పోసి ఉంచు. సిరా ఆనవాలు లేకుండా శుభ్రంగా కడిగిన కలంతీసుకుని, ఆరసంలో ముంచి, దళసరి కాగితంమీద నీకు తోచిన బొమ్మ ఏదైనా గియ్య. ఆఖరున మాత్రం మరిచిపోకుండా "దడిగాడువానవిదిచ" అని వ్రాయి.

వ్రాస్తున్నప్పుడు తడిగా ఉండి అక్షరాలు కనిపిస్తూనే ఉంటాయి. కాని, పూర్తిగా ఎండేక ఎంత కళ్లు చించుకు చూచినా ఏమీ కనిపించవు. ఏమీ వ్రాయని మామూలు కాగితంలాగే కనిపిస్తుంది.

ఈ కాగితం కవరులో పెట్టి, మీ స్నేహితులచేతికిచ్చి, "చదువుకోండి" అను. వాళ్లు కవరు విప్పి, అందులో వట్టి తెల్ల కాగితం మాత్రమే ఉండడం చూచి, మోసం జరిగింది అనుకుంటారు.

"అరే, దీనిమీదనేనురాసిన విషయాలన్నీ ఎల్లా మాయం అయిపోయాయి ?" అని నువ్వు ఆశ్చర్యంనటించు. "వీటితిరస్కరిణీ విద్య నాదగ్గరా ?" అని స్వగతంగా పైకి అనుకుని కొవ్వొత్తి వెలిగించు. మీ స్నేహితులు చూస్తూండగా ఆ కాగితాన్ని మంటకి కాస్త ఎత్తులో ఉంచి, నిప్పు అంటుకోకుండా అటూ ఇటూ కదిలిస్తూ వెచ్చబెట్టు. కొద్ది క్షణాలలో ఆ కాగితంమీద గోధుమ రంగులో మాయమైన వ్రాతలన్నీ బయట పడతాయి.

"దడిగాడువానవిదిచ" ఏమిటి అని ఎవరేనా అడిగితే తిరగేసి చదవమను.



అంతకి వేడి చెయ్యడంవల మాయమైన అక్షరాలు ఎందుకు కనిపిస్తాయి ?

నిమ్మకాయ సిరాలో నానిన కాగితం వేడి చేసినప్పుడు రసాయన సంయోగం చెందుతుంది. బెగ్గ వేడి చేస్తే ముందర గోధుమ రంగులోకి తరువాత నలుపు రంగులోకి మారడం మనకు తెలిసిందేకదా.

ఈనాటి వనితాలోకం

చేబదుళ్ళ ఇబ్బందులు

'వదినగారూ! కొద్దిగా పంచదార వుంటే ఇస్తారూ? కాఫీలోకి తక్కువైంది.' ప్రొద్దున్నే ప్రక్కవాటా ఆవిడ అడుగుతుంది. 'పాపం!' అని ఇస్తాం.

కాస్త ప్రొద్దెక్కినాక 'అక్కయ్యగారూ! ఓ తవ్వెడు బియ్యం వుంటే ఇవ్వండి. సాయంత్రం ఆయన తేగానే ఇచ్చేస్తాను' అంటుందింకో వాటా ఇల్లాలు. 'అయ్యో! దానిదేముందండీ! తీసికోండి!' అంటాం.

'పిన్నిగారూ! ఓ సోలెడు కందిపప్పు ఇవ్వమంది మా అమ్మ!' అంటుంది ఇంటావిడ కూతురు. ఈ సారీ విసుక్కోకుండా ఇచ్చేస్తాం!

ఇంతవరకూ బాగానే వుంది. కానీ శృతి మించితేనే చిక్కు! నెల మొదటి రోజుల్లో అయితే ఇవ్వగలం! కాని నెలాఖరు రోజుల్లో కూడా ఇలాగే అడుగుతుంటే ఏం చేసేది? అడిగిన వస్తువు లేదని చెప్పలేము. అలాగని ఇచ్చేస్తే వస్తువులు వదులుకోవాలి. కాదని ధైర్యంచేసి 'లేదమ్మా...' అంటే చాలు... ఇక చూస్కోండి.

'చూసావా! చూసావా? ఆ ప్రక్కవాటా ఆఫీసరు భార్యకైతే ఇచ్చింది. నాలాంటి గుమాస్తా పెళ్ళాని కెందు కిస్తుంది?...'' అంటూ చేసే రకరకాల ప్రచారాలు మిన్నుముట్టుతాయి. కానీ ఆ ప్రక్కవాటా ఆవిడ నెల మొదటి రోజుల్లోనే అడిగి తీసుకుందని గ్రహించారు.

ఇంకా కొంత మంది ఉంటారు.



శ్రీమతి ముద్దా సరస్వతి


'అక్కయ్యగారూ! మీ నెక్లెస్ చాలా బాగుంటుందండీ! రేపు మా పిన్నిగారమ్మాయి పెళ్ళి! ఓసారి యివ్వరూ? పెళ్ళి నుంచి రాగానే మీ నెక్లెస్ మీ కిచ్చేస్తాను.' రోజూ చనువుగా ఇంట్లో తిరిగే ఇంటి వారమ్మాయి అలా అడుగుతూంటే మొహమాట పడకుండా ఉండగలరా? అలాగే పట్టుచీరలూ, వెండి సామానూ! పోనీ నమ్మకస్తులే కదా అని యిచ్చి వూరుకుంటే మళ్ళీ అవి మనదగ్గర కొచ్చేసరికి వాటి సహజ స్వరూపాలే మారిపోయి ఉంటాయి.

అంతవరకెందుకు? రోజూవారీ మనం తెప్పించుకునే దినపత్రికలూ, వారపత్రికలూ అలా అందె లంచెలుగా ఇంటి వాటాల వారందరూ చూసి, వీలైతే ఆ ప్రక్క వీధులకు కూడా వెళ్ళి మన చేతికొచ్చేసరికి అది అసలు ఈవారం పత్రికేనా? అన్న అనుమానం వస్తుంది. దినపత్రికలైతే ఆ రోజు తేదీ మారిపోతుంది. వారపత్రికయితే మళ్ళీ క్రొత్త పత్రికే వస్తుంది!

పోనీమధ్య మా అక్కగారి వూరెళ్ళాను. అక్కయ్యగారింటి ప్రక్కవాటా ఆవిడ చాలా కలుపుగోలు మనిషి. ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ నవ్విస్తూంటుంది. ఆవిడ, అక్కదగ్గర బదుళ్ళు తీసుకుంటూండేది. కానీ మళ్ళీ తీర్చే ప్రసక్తి వుండేది కాదు. అసలు తీర్చకపోయినా ఫర్వాలేదన్నట్లు నిపిస్తాయి ఆవిడ కబుర్లు. కానీ బదుళ్ళు తీసుకోవటం ఎక్కువైపోయేసరికి సిగ్గువిడిచి ఎపుడైనా అక్క అడిగేది. జీతాలు రాగానే ఇచ్చేస్తానంటూనే జీతాలు రాగానే పిక్చర్ ప్రోగ్రాం వేసుకునేది. ఆ మర్నాడే మళ్ళీ 'ఈసారి అన్నీకలిపి తీర్చేస్తాను' అంటూ అప్పు తీసుకెళ్ళేది. ఇలా పది చేబదుళ్ళకు ఒకటి తీర్చేదిట. ఆవిడతో బదుళ్ళ బాధ పడలేక అక్కవాళ్ళు అన్ని సౌకర్యాలున్న ఆ యిల్లు విడిచి ఇంకో వీధిలోకి మారిపోయారంటే మనం ఆశ్చర్యపోనక్కరలేదు!

ఇదండీ ఈనాటి వనితాలోకం! —సమాజంలో మనుగడకి ఒకరి సహాయం మరొకరికి చాలా అవసరం. ముఖ్యంగా ఈ నాటి మధ్యతరగతి యువతి పలువురి సహాయ సహకారాలతో జీవనం సాగిస్తోందంటే అసహజం కాదేమో?

అనుకోకుండా చుట్టాలు వచ్చినా, అనుకోని ఖర్చులు తగిలినా చేబదుళ్ళకు వెళ్ళక తప్పదు. మరి బదులు తీసికొని అవతలి వారిని తిప్పలు పెట్టకుండా సాధ్యమైనంత తొందరలో తీరిస్తే బాగుంటుంది. వాళ్ళూ మనలాటి జీతగాళ్ళేకదా! అన్న ఇంగిత జ్ఞానం అలవరచుకోవాలి. అలాగే పుస్తకాలు ఏవైనా తీసుకున్నపుడు వాటిని నలిపి, చింపి పాడుచెయ్యకుండా, చిన్నపిల్లలకు అందనివ్వకుండా, అది ఇతరుల పుస్తకం అన్న భావనతో జాగ్రత్తగా చదివిన వెంటనే ఇచ్చేయాలి. అలాగే ఎంతో తప్పని సరైతేనే గానీ అప్పు చేయకూడదు. సాధ్యమైనంత వరకూ ఇంట్లో వున్నవాటిని ఒక ప్లాన్ ప్రకారం పొదుపుగా వాడుతూ ఉండాలి.



ఫైల్స్ డైరీ

పోస్టుగ్రాడ్యుయేట్ ప్యూన్లు!

ఢిల్లీ మున్సిపల్ ప్రైమరీ స్కూలు టీచర్ల పోస్టులకు వచ్చిన 15,381 అప్లికేషన్లలో గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్లు కలిపి సుమారో ఆరువేల మంది వున్నారట. వీరేగాక 36 మంది పి. హెచ్. డి డాక్టరేట్లుకూడావున్నారటీ అప్లికెంట్సులో. చదువుకి నాడుఎంతవిలువున్నదో తెలిపే వుదాహరణలింకా చాలా వున్నాయట. ఢిల్లీ కార్పొరేషన్లో నలుగురు ఎమ్మే చదివినవారు. ముప్ఫయి ఇద్దరు గ్రాడ్యుయేట్లు ప్యూను వుద్యోగాలు చేస్తున్నారటీనాడు.

జీవితాశయం!

రంజన అనే ఆవిడ లెక్చరరు వుద్యోగానికి ఏడు కాలేజీలలో దరఖాస్తు పెడితే, మూడు కాలేజిలలో ఇంటర్వ్యూ వచ్చి, నీకు తగినన్ని అర్హతలులేవు అని తేల్చారిటా అధికారులు. ఆవిడ రస ఎమ్మేలో ప్రథమశ్రేణిలో వుత్తీర్ణురాలయ్యారట. నూటికి తొంభైనాలుగు మార్కులు అన్ని సబ్జక్టులలో వచ్చాయటావిడకు. అంతేగాక ఆరు ఎవార్డులు, నాలుగు బంగారు పతకాలూ ఆవిడ పొందారట తన చదువు సందర్భంగా. పోలేపోయిందనావిడిప్పుడు ఫిలాసఫిలో డాక్టరేటు చదువనిర్ణయించుకుని, జీవితంలో మీ ఆశయం ఏమిటంటే కనీసం ఏ కాలేజీలో సాధారణ లెక్చరరుగా నయినా వుద్యోగం చేయడం అన్నారట—హతవిధీ—చదువు వదేపాట్లెన్ని!

గొర్రె కడుపున మానవ శిశువు!

హుబ్లీలో ఒక గొర్రె ప్రసవించి ఓ మగ పిల్లాడిని కన్నదట. గొర్రెకు పుట్టిన యీ మగ శిశువు కచ్చితంగా మనిషిశిశువులా ముఖం, కళ్ళు, ముక్కు, మూతీ అన్నీవున్నాయట. ఎటొచ్చీ యీ బిడ్డ చచ్చిపుట్టాడట. ఈ బిడ్డడితోపాటు మరో గొర్రెపిల్లకూడా పుట్టిందట. తల్లీ ఆపిల్లాకులాసా అట.

దొరికిన దుడ్డు

ఈ రోడ్డులో 33 ఏళ్ళ షణ్ముగం అనే వో వ్యక్తి ఓ బంగారు నగ అమ్మజూపి, రెండొందల యాభై రూపాయలు యిస్తే చాలన్నాడట. తీరా చూస్తే నవరత్నాలుపొదిగిన ఆ చెవిదుద్దుసుమారు నాలుగువేల రూపాయల ఖరీదట. పోలీసు లు దబాయిస్తే ఆ వ్యక్తి తనకా దుద్దు కరూరు బస్టాండులో దొరికిందన్నాడట.

1978 దీపావళి కథలపోటీ

మొత్తం రు. 5000 ల బహుమతులు

ఈసారికూడా దీపావళికి కథానికలపోటీ పెడుతున్నాము... పోయినేడాదిలాగే యీ ఏడు కూడా సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన ఐదు కథలను ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి సంచికలో, ఆ తరువాతి సంచికలో వేస్తాము. అటు తరువాత పాఠకుల బ్యాలట్ నిర్వహిస్తాము.

ముగింపు తేదీ 16-9-'78 శనివారం

పోటీలో ఎన్నికైన ఐదు కథలకు ఒక్కొక్కదానికి రు. **600** లు చొప్పున బహుమతులు యిస్తాము. అటు తరువాత బ్యాలట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన మూడు కథలకు రు. **600**, రు. **500**, రు. **400** ల చొప్పున అదనపు బహుమతులు యివ్వడమే గాక మిగిలిన రెండు కథలకు రు. **250** ల చొప్పున కన్సొలేషన్ బహుమతులను అందజేస్తాము.

★ 'కథానిక' ఆంధ్ర సచిత్ర వార పత్రికలో నాలుగు పేజీలు మించకుండా వుండాలి. 12 అరటావులు దాటకుండా వ్రాస్తే చాలు. నిడివి ఎక్కువ అయిన కథలకు బహుమతి రాగల అవకాశాలు చాలా తక్కువ అని గమనించాలి.

★ కథావస్తువు తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించి వుండాలి.

★ అనువాదం, అనుసరణ, అనుకరణ, కాపీ కథలు పంపకూడదు. ప్రసారమైన, ప్రచురణ అయిన లేదా ఇతర పత్రికలకు పంపబడి పరిశీలనలో వున్న కథలు అసలే పంపకూడదు.

★ పై అంశాల మేరకు హామీ పత్రం ప్రతి కథతోపాటు విడిగా వుండి తీరాలి. కలంపేరు వాడినా అసలు పేరు, యింటి పేరు సహా పూర్తిగా విడిగా స్పష్టంగా పూర్తి చిరునామాతోపాటు అందిన కథలనే పరిశీలించ వీలవుతుంది.

★ కథలతోపాటు రచయితల పేర్లు పడవు. బ్యాలట్ తరువాత వారి పరిచయం తోనే వేస్తాము.

★ రచనలపై పేచీలు వస్తే రచయితలే బాధ్యత వహించవలసి వుంటుంది.

★ పోటీలో నెగ్గిన కథల రచయితలు తమ ఫొటో, జీవిత విశేషాలు మొదలైనవాటిని పంపి వాటి ప్రచురణకు అంగీకరించాలి.

★ ముగింపు తేదీ దాటిన తరువాత అందిన కథలను మామూలు ప్రచురణకు వీలువెంబడి పరిశీలిస్తాము. పోటీకి పంపిన కథలను ఏట్టి పరిస్థితులలోను త్రిప్పి పంపలేము.

సం॥

ఫాలాక్షుని డైరీ

గుర్తింపు ?!

సుల్తాన్‌గంజ్‌కు చెందిన విశ్వనాథ్‌సింగ్ అనే వ్యక్తి "దేమిస్" అనే ఒకామెను బలాత్కరించి, చెరిచినందుకు భాగల్పూర్ సెషన్సు జడ్జి కోర్టులో శిక్షపొందాడట. ఆనక కొన్నాళ్ళకి అతన్ని "స్వాతంత్ర్యసమరయోధుడు"గా భారత ప్రభుత్వం గుర్తించిందట. అతను చేసిన ఒకే ఒక్కపని "దేమిని"ని చెరచడమట. స్వాతంత్ర్యానికి అతనికి ఏ విధమైన సంబంధం లేదట. అయితే భారతప్రభుత్వ మతన్నెలావనిలే యీ "ఫ్రీడమ్‌ఫైటర్" అనిబిరుదిచ్చి పెన్షనిచ్చిందా!

మంజుల భర్తపై కరుణానిధి కుమారుని దౌర్జన్యం

తమిళనటుడు, నటి మంజుల భర్త విజయ కుమార్ అన్నాడి.యం.కె. పార్టీ ప్రచారసభలో మాట్లాడడానికి వెళ్ళేసరికి డి.యం.కె. పార్టీ ప్రెసిడెంటు కరుణానిధి కొడుకుముత్తు ఆ విజయ కుమార్ యింటికి మరో అయిదుగురు స్నేహితులతో వెళ్ళి "ఏడి ఎంగే విజయకుమార్" అని అరిచి, గలాటా చేశాడట. నటి మంజుల మొదలైనవారు పోలీసులకు ఫోను చేస్తే వారొచ్చి ముత్తును అరెస్టు చేశారట. అతను త్రాగిన మైకంలో వున్నట్లు పోలీసు కేసునమోదు చేసుకున్నారట. విజయకుమార్ యం.జి.ఆర్. పార్టీ.

అప్పుతీర్చమంటే అపాయం !

మేలూరుకు చెందిన ఓ గ్రామంలో రాజాసింగ్ అనే అతనివద్ద దేవరాజన్ అనే అతను ఓ యిరవై రూపాయలు అప్పు తీసుకున్నాడట. బాకీ ఎన్నాళ్ళకి యివ్వకపోయేసరికి రాజాసింగ్ ఆ దేవరాజన్ని నడిబజారులో నిలబెట్టి దూషించాడట. దాంతో ఆ దేవరాజుకు కోపంవచ్చి పరుగున యింటికి వెళ్ళి కొడవలి దొరకబుచ్చుకుని అంతవేగంగానూ తిరిగివచ్చి "బాకీయిదిగో" అంటూ ఆ రాజాసింగ్ మెడనరికాడట. అడ్డొచ్చిన మరొకాయన చేతులకూడా గాయాలయ్యాయట. రాజాసింగ్ అపాయస్థితిలో ఆసుపత్రిలోవున్నాడట.

కిషన్‌చంద్ ఆత్మహత్య

ఎమర్జన్సీకాలంలో ఢిల్లీలో గవర్నరు పదవిలో వున్న అరవైయేళ్ళ కిషన్‌చంద్ ఆ నాటి వ్యవహారాలలో తనను గురించి పత్రికా విమర్శలూ, భాగ్యిమర్శలూ తాను భరించలేనంతగా వస్తున్నాయనీ, వీటికి తన హృదయం చీకి, చికికిపోయి జీవితంమీద విరక్తి కలిగిందని, తాను ఆత్మహత్య చేసుకోడానికి నిశ్చయించుకున్నట్లూ ఓ పుత్తరం రాసింట్లో పెట్టి ఓ పెద్ద పల్లిపు బావిలో దూకి జీవితాన్ని అంతం చేసుకున్నాడటాయన. ఏది ఎమర్జన్సీవో, ఏమి ఆ నాటి గొడవలో తెలీదు కాని ఆ గొడవలను వెలికితీయడం అనే యీ నాటి గొడవ మరింతస్సర దుర్భరంగావున్నది.

వారఫలం

25-8-1978 శుక్రవారం మొదలు 31-8-1978 గురువారం వరకు

మేషం :— మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో పోటీదారి పోటీ తగ్గుతుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు అద్భుతంగా ఉంటాయి. స్త్రీలకు_కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం :— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వ్యాపారవిస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. స్త్రీలకు_ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

మిథునం :— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. స్త్రీలకు_కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వ్యతిరేకమైన వార్తలను వింటారు.

కర్కాటకం :— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో చికాకులు ఏర్పడతాయి. వారం ఆఖరులో నూతన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు_ఆరోగ్యం బాగుండదు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

సింహం :— అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు_ఆరోగ్యం బాగుంటుంది. బంధువుల వల్ల చికాకులు ఏర్పడతాయి.

కన్య :— వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. మిత్రులు సహాయం చేస్తారు. ప్రయాణాలు ఫలిస్తాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు_వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవకార్యాలు నెరవేరతాయి.

తుల :— మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో శుభ కాలమైన వార్తను వింటారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో [illegible] వ్యక్తులను కలుసుకొంటారు. స్త్రీలకు_ఆరోగ్యం బాగుండదు. పోటీదారిలో గౌరవం లభిస్తుంది.

వృశ్చికం :— రావలసిన డబ్బు అందుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు_కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

ధనుస్సు :— రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. పోటీ వారితో పాత ప్రతివాదాలు తగ్గవు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో వృత్తిలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. స్త్రీలకు_ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

మకరం :— వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. మీ కార్యక్రమాలలో మార్పులు వస్తాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. స్త్రీలకు_కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం:— ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపార రంగంలో ఆదాయం బాగుంటుంది. వారం ఆఖరులో మీ అంచనాలు తారుమారు కాగలవు. స్త్రీలకు_ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.


మీనం :— వృత్తిలో పోటీదారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు_సంతోషకరమైన [illegible] అందుతుంది, పుణ్యకార్యాలు చేస్తారు.

— మహేష్

స్వస్తిక్ షికాకాయ్

సౌందర్యపు సబ్బు–జుట్టు కొరకు

క్రొత్త రేపర్! క్రొత్త ఆకృతి! క్రొత్త సువాసన!



జుట్టుకు సిల్కువంటి మృదుత్వము నిచ్చుటకు నైసర్గిక ఉపాయము

ఉత్తరాలు

అట్టమీద బొమ్మ

"లత" ముఖచిత్రంగా 4-8-78వ తేదీన వెలువడిన మా (నా) అభిమాన "ఆంధ్ర సచిత్ర వార పత్రిక" ముమ్మల్నెంతో ఆకర్షించిమరలమరల చదవాలనిపించేట్లు చేసింది. మంచి కథల వేస్తున్నందుకు మీకు మా ధన్యవాదాలు. సీరియల్ అంత బాగా సాగటంలేదనిపిస్తున్నది.

నా అభిప్రాయాలను బాహాటంగా పత్రికాముఖంగా తెలియజేయటం ఇదే మొదటి సారి.

కె. గంగాధర్, కె. రాజశ్రీ, (గుంటూరు)

సీరియల్

4-8-78 "లత" ముఖచిత్రంలో వెలువడిన పత్రిక మమ్మలను ఎంతో ఆనంద పరచినది. ముఖ్యంగా క్రొత్త సీరియల్ "రాగద్వేషాలు" మొదటి భాగంలోనే మాకు ఎంతో ఆనందాన్ని అందించింది. "మోహనరూప" సీరియల్ కూడ చాలా ఆసక్తిదాయకంగా నడుస్తోంది. "ఒక పిచ్చిదానికథ" మీ (మా) పత్రికకే సూపర్బ్ అని వ్రాయటానికి ఎంతో ఆనందిస్తున్నాము. ఈ వారం "ధర్మపథం" ఎంతో నీతిదాయకంగా ఉంది. ఇన్ని మంచి అంశాలను అందజేస్తున్న మీకు మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఓరుగంటి వెంకటలక్ష్మీరమణ, సత్యసుబ్బలక్ష్మి, కామేశ్వరి, సుబ్రహ్మణ్యశర్మ, (రాజమండ్రి)

ఈవారం (21-7-78) పత్రిక జయప్రద ముఖచిత్రంతో సర్వాంగ సుందరముగా చూడ ముచ్చటగా వుంది.

-మోహనరూప- సీరియల్ మంచి ప్లాటుతోకూడి చక్కని డైలాగులతో చాలా ఇంటరెస్ట్‌గా సాగుతోంది. ఈవారం ప్రారంభమైన పెద్ద కథ -ప్రేమించు ముక్కికై- మొదటి భాగం మా హృదయాలను ఆకట్టుకొంది.

మాతృభాషను మూలకు నెట్టి, పరభాషా వ్యామోహముతో తమపిల్లలను ఇంగ్లీషుమీడియం స్కూళ్లలో చేర్పించే తల్లిదండ్రులకు కనువిప్పు కలిగించేలా వుంది. సామాన్యుని సణుగుడులో వీరాజీగారి హాస్యం అమెరికా క్లబ్ను గూర్చి విజ్ఞానదాయకమైన వ్యాసమును ప్రచురించిన మీకు నా కృతజ్ఞతలు.

ఎ.పి. ప్రభాకర్, (కర్నూలు-1)

* * *

28-7-78 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖచిత్రం కుమారి జరీనా వాహబ్ చాలా అందంగా వుంది. "తులసీ పుష్పం" చాలా బాగుంది. మాదిరెడ్డిగారి "మోహనరూప" సీరియల్ చాలా ఆసక్తిదాయకంగావుంది. సినిమాల గూర్చి శ్రీనివాస్‌గారు చాలా విషయాలు తెలియచేస్తూ వుంటారు. వారికి నా అభివందనలు.

కుమారి మట్టాసౌభాగ్యరోధె (ఉయ్యూరు.)


కథలు

27-7-78వ తేదీన మీ (మా) ఆంధ్ర సచిత్ర వార పత్రికలో వెలువడిన కథల లో శ్రీ కొడాలి సాంబశివరావుగారు చిత్రీకరించిన "తులసి పుష్పం" కథ చాల బాగుంది. హెచ్చో యం. మరియు జలంధర టీచర్ మధ్య జరిగిన సంభాషణ చాల ఇంట్రెస్టుగా వుంది. రచయిత కథను చక్కని శైలితో వ్రాసి మమ్మలను ఆనంద పరచినందులకు కృతజ్ఞతలు.

ఎస్. వి. వెంకటరావు (ఆదోని)

వార్షికోత్సవ సభ - సన్మానాలు

క్లాసికల్ ఫిలిం సొసైటీ, తెనాలి వారు తమ సంస్థ 5 వ వార్షికోత్సవ సందర్భంగా డాక్టర్ దాశరథి, దర్శకుడు శ్రీ టి. మాధవరావు, సినీ జర్నలిస్టు శ్రీ జి. వి. జి. ధ్వన్యనుకరణ సామ్రాట్ శ్రీ నేరెళ్ల వేణుమాధవ్ గార్లని సన్మానించారు. సన్మానితులకు శ్రీయుతులు అచ్యుతరాం, కన్నేశ్వరరావు, సఫీజుద్దీన్, రవీంద్రప్రసాద్ అభినందన పత్రాలను అందజేశారు. డా. పి. దక్షిణామూర్తి సభకు అధ్యక్షత వహించారు. సొసైటీ అధ్యక్షుడు శ్రీ బి. శేషిరెడ్డి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి శ్రీ భగవాన్ స్వాగతం పలికారు. శ్రీ వెలివోలు సీతారామయ్య, శ్రీ మల్లిప్రియ నాగరాజు సన్మానితుల నభినందిస్తూ ప్రసంగించారు. శ్రీ ఎం. బసవపున్నారావు వందన సమర్పణతో సభ ముగిసింది.



1-7-78వ నాటి మీ (మా) ఆంధ్ర సచిత్ర వార పత్రిక అట్టమీద నటి "శారద" గారి ముఖ చిత్రం చాల బాగున్నది. ముమ్మూర్తులతో ఆకర్షిం చింది.

సులోచనగారి "మోహనరూప" సీరియల్ ప్రారంభంలోనే చాల ఇంట్రస్టుగా సాగుతున్నది. సదానందగారి "కదనరంగం" కథ బాగున్నది. విజయానికైన, మరణానికైన ఆర్. ఆదరి, అవసరమే కారణమని చాలబాగా తెలియచేసినారు. వారికి మా అభినందనలు. సినిమా విశేషాలు చాల బాగున్నాయి. డాక్టర్ సలహాలు సహాయకరముగా వున్నవి.

లక్ష్మి. (మద్రాసు)

Printed and Published by S NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3 Editor. S Radhakrishna

ఉత్తరాలు

మంచి కథలతో ఉన్న తెలుగు పుస్తకాలు అరుదుగా లభించే మాలాంటివారికి ఆంధ్ర పత్రిక ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. 14-7-78వ తేదీనాటి పత్రికలో మీరు ప్రచురించిన మూడు కథలలో -సంశయం బ్రతుకు- -వేశ్య- కథలు ఆకట్టుకున్నవి. కథ -వేశ్య- వాస్తవానికి అతి దగ్గరగా చిత్రీకరించారు రచయిత శ్రీ ప్రతాప రవిశంకర్‌గారు.

లోకంలోపడ ఈవారం పత్రికకు హైలెట్. డాక్టర్ సలహాలు శీర్షికలో ఎన్నో సందేహాలకు విశదంగా విపులీకరిస్తూ, సలహాలు యిస్తున్న డాక్టర్ శ్రీ వెంకటేశ్వరరావుగారు అభినందనీయులు.

సీరియల్ -మోహనరూప- చాల ఉన్నతస్థాయి అందుకొంటుందని చెప్పటకు ఆనందించుచున్నాను.

ఈ వారంతో ముగిసిన సీరియల్ కథ -పద్మావతి పెళ్ళి- ప్రత్యేకతను సంతరించుకున్నది.

అన్నెపు కైలాసరావు, (కనిమెట్ట)

సీరియల్

మీ పత్రిక కోసం మేం ప్రతివారం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తాం. మీ (మా) పత్రిక మాకు ఎంతో ఇష్టమైన పత్రిక. పత్రికలో ప్రచురణలు చాలా బాగుంటున్నాయి. "మోహన రూప" సీరియల్ చాలా ఆసక్తిదాయకంగావుంది. ఇంకా ఈ వారం కథలు "భయం," "అంతా గాడ్ మహిమ" కథలు చాలాబాగున్నాయి.

డి. అరుణ, (హైదరాబాదు.)

ఈనాటి వనితాలోకం

ఈ వారం పత్రికలో (28-7-78) మీరు ప్రచురించిన "వనితాలోకం" ఈనాటి వనితా లోకానికే ఒకగీటురాయి. కె. వరలక్ష్మి (న్యూఢిల్లి) గారికి నా హృదయపూర్వక వందనములు. ఆమె యొక్క భావనలు మన "భారతస్త్రీ" యొక్క ఉద్దేశాలను వెల్లడించాయి.

గరిమెళ్ల శంకరపరమి, (బరంపురం.)

మాడ్రన్ స్కూల్

21-7-78 తేది ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వీరాజీగారి "మమ్మీ ః మమ్మీ మాడ్రన్ స్కూలు" చాల బావుంది. ఈ రోజుల్లో మధ్య తరగతి ప్రజలకు ఇంగ్లీషు మీడియం మీదున్నమోజు గల వ్యామోహాన్ని తన వ్యంగ్య రచనలో చక్కగా చిత్రీకరించారు. ఉదహరించిన వ్యంగ్యమైన సంభాషణలు ఎంతో అవసరం. "మోహన రూప"కు మోహనమైన రూపాన్ని తెచ్చారు రచయిత్రి. మిగతా శీర్షికలు, కథలు చదువుటకు ఆసక్తికరంగావున్నవి. "ధర్మపథం" పత్రికకు మొదటి పలాకం.

కె. మాధవిఅన్నపూర్ణ, (తిరుపతి)

చందాదారులుగా జేరడానికై మీరు

ముందుగా ఏమీ చెల్లించనవసరం లేదు

ఈ అత్యద్భుతమైన పత్రికకు సంవత్సర చందా కేవలం రూ.25/- మాత్రమే!

అంతేకాదు

మున్ముందుగా మాకు చందా పైకం పంపనవసరంలేదు.

ఉచితం



వ్యక్తిత్వ వికాసం



సైకాలజీ ఆఫ్ సెక్స్

కళ్ళుచెదిరే అతిసుందరమైన ప్లాస్టిక్ ముఖ చిత్రంతో మిగదికే శోభనుచేకూర్చే ఈ పుస్తకాలు, కేవలం చందాదారుల కోసం ప్రత్యేకంగా ముద్రించబడ్డాయి. ఎంత ధరపెట్టి కొనగోరినా ఇవి ఎక్కడా లభ్యంకావు.

లక్షలాదిమంది ప్రశంసలు పొందిన అతివిలువైన సమాచారంతో అంతరంగిక మిత్రునిలా అనునిత్యం మీకు తోడ్పడే "వ్యక్తిత్వవికాసం"; లేక మానవ లైంగిక ప్రవృత్తిపైజరిగిన వేలాదిపరిశోధనల సారాన్ని విశదపరచుతూ దాంపత్య జీవితంలో నూతనపుభరిమళు, పారవశ్యాన్ని కొనితెచ్చే "సైకాలజీ ఆఫ్ సెక్స్" లలో ఏదో ఒకటి మీరు ఎంచుకోవచ్చు.

- మీరు చందాదారులుగాచేరగోరితే ప్రక్కనవున్న అతివిలువైన పుస్తకాలలో ఒకటి మీకు కేవలం ఉచితంగా లభిస్తుంది.
- మీ పూర్తి చిరునామా తెలియజేస్తూ, ఈ రెండు పుస్తకాలలో మీరు కోరుతున్న పుస్తకాన్ని 'టిక్'చేసి ప్రక్కనవున్న కార్డును పోస్టు చెయ్యండి.
- ఈకార్డుకు మీరు స్టాంపులంటించనవసరం లేదు.
- ఈకార్డుమాకుచేరగానే మిమ్మల్ని చందాదారులుగా నమోదుచేస్తాం.
- ప్రక్కన ఉన్న పుస్తకాలలో మీరు కోరినదానిని మీకు కేవలం ఉచితంగా వి. పి. పి. ద్వారా పంపిస్తాం.

ఉచితం:
వి. పి. పి. చార్జీలు రు. 4/- మేమే భరిస్తాము

- తరువాత పోస్ట్‌మాన్‌కు ఈ పత్రిక చందా నిమిత్తం రు.25/- చెల్లించవలెను. ఈ విలువైన పుస్తకం మీకు ఆ క్షణంలోనే ఉచితంగా లభిస్తుంది. మీకు 'రేపు' మాస పత్రికను సంవత్సరంపాటు ప్రతి నెలా ఒకటవ తేదీకి జేరేలా పంపిస్తాము.

మీరు నమ్మలేకపోవచ్చు!

మీరు ఊహించి ఎరుగని అద్భుతం ఎదురవుతుంది!

కేవలం పాతికరూపాయిలతో మహోజ్వల భవిష్యత్తుకు రాజమార్గం ఏర్పడుతుంది!!

రేపు

విజయవాడ - 2

"అదృష్టములో నమ్మకము కలిగి యుండుటయు మరణమును ఎదురు చూచుటయును ఒకటే"

— ఒక జపాను సామెత

చిరకాలముగా, కొన్ని గ్రుడ్డి నమ్మకములు (blind beliefs) మానవుని అభివృద్ధికి ఆటంకముగా ఉండుచూ ఉన్నవి. "అదృష్టము వచ్చును" అని వేచి యుండుట, శకునము చూచి పనిచేయుట వంటివి.

"అదృష్టము"ఉన్నచో, రాజ కుటుంబములోనే జన్మించి యుండవచ్చునే! ఆంగ్ల రచయిత, ఆలివర్ గోల్డ్‌స్మిత్, "కొందరు నోటిలో వెండి చెంచతోను, కొందరు చెక్క చెంచతోను జన్మింతురు" అనెను. అవగా, కొందరు ధనవంతుల ఇళ్ళలోను, కొందరు బీదవారి నివాసములలోను జన్మింతురు. సర్వసమైక్యతయే రానిమ్ము! అపుడును అందరును అందలము (Palanquin) ఎక్కుటకు వీలగునా? అందరు ఎక్కినచో దానిని మోయు వారెవరు?

శకునము (OMEN): పిల్లి అడ్డువడుట, విధవ, లేక పురోహితుడు (Lone Priest) ఎదురువడుట, కట్టెలమోపు, క్రొత్తకుండ ఎదురుగా వచ్చుట మొదలగునవి అపశకునములు.

మన భారతదేశము ఆంగ్లేయుని చేజిక్కుటకు, మన ప్రజలలో స్థిరపడిన ఇటువంటి గ్రుడ్డి నమ్మకములు కూడ ఒక కారణము.

ఒక రాజు ఆంగ్లేయునితో సమరము చేయుటకు సమర భూమికి పోవు సన్నాహము చేయునపుడు, పిల్లి ఒకటి అడ్డు వచ్చెను". "శకునము సరికాదు" అని ఆ రాజు యుద్ధమునకు పోక, "అనవసర బెడదయేల?" అని ఆంగ్లేయుడడిగిన సగము రాజ్యమును అతనికి ఇచ్చివేసెను.

విల్లియం షేక్స్‌పియర్ యొక్క "Macbeth" అను నాటకములో, తన్ను ప్రాణాధికముగా ప్రేమించిన తన భార్యయొక్క ప్రాణము మరణ శయ్యలో ఊగిసలాడుచుండగా, మేక్‌బెత్ ప్రభువు, రణరంగమునకు (war front) పోవుటకు కాలు మోపెను. అపుడు Seyton అను అధికారి పరుగెత్తుతూ వచ్చి తెలిపెను, "The Queen my Lord, is dead". (ఓ ప్రభూ, రాణి మరణించిరి). ఈ వార్తను అపశకునముగా తలంచలేదు; అప్పుడును అతడు ముందు మోపిన కాలును వెనుదీయలేదు.

ఇటువంటి Shakespeare సృష్టి చేసిన పాత్ర యైన పరాక్రమ వంతుడైన Macbeth ఎక్కడ? పిల్లికి భయపడు పిరికి పందయైన మన భారతదేశ మాజీరాజు ఎక్కడ? —పోల్చి చూడదగునా?

నేనడుగుచున్నాను: ఒకతె "విధవ" అయినచో అది నేరమా? లేక ప్రకృతి యొక్క కోపమా? భగవంతుని సేవకు తమ్మర్పించుకొనిన పురోహితులు ఎట్లు అపశకున మగుదురు? కట్టెలు, కుండ లేనిచో పొట్టకు భోజనము లభించునా ఇవన్నియు అపశకునములట! ఎంత మతి విహీనత!!

ఒకప్పుడు నేను "గణిత" పరీక్షకు పోవునపుడు, విధవలు ఎదురు పడిరి. కాని, నేను నూటికి నూరు తెచ్చుకొంటిని. ఇంకను అది నాకు వీడని తలంపు. కావున, శకునమనునది అర్థములేని వాగుడు.

అదృష్టము, శకునము, గ్రుడ్డి నమ్మకములు వంటి మూఢ నమ్మకములన్నియు మాసిపోవలెను.

తపాలాద్వారా చదివిన అర్థము కాదట. ఇట్లొక గ్రుడ్డి తలంపు! నేరుగా వచ్చి తరగతులలో చదివియు, కొందరు "సున్న (0)" తెచ్చుకొనుచున్నారే, దీనికేమి యర్థము?

చదువునకు కావలసినవి: ఆత్మ విశ్వాసము, ఓర్పు, సాధించగల శక్తి సామర్థ్యములు, పరిశ్రమ.

ఈ విద్యా సంస్థలో తపాలాద్వారా "ఆంగ్ల భాషా శిక్షణ" ఆత్మ విశ్వాసము నిచ్చుటతో స్వయముగా ఇంకను అభివృద్ధి చేసికొనుటకు దారితీయును.

G. SHANMUGASUNDARAM

